
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
**డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ**
**పొన్నూరు హైమవతీశాస్త్రి**
**ముక్కామల రత్నాకర్**
**డి.వి.ఆర్.మూర్తి**
**సాధన నరసింహాచార్య**

సంపుటి 17 - సంచిక 03
**ఆగస్టు 2012**
**విడిప్రతి రూ॥ 12.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

పత్రిక చందా మనీ ఆర్డర్ ద్వారా కాని, డ్రాఫ్టు ద్వారా కాని పంపవలసిన చిరునామా
**“శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు”**
**గాయత్రీ చేతనా కేంద్రము**
హెచ్.పి. రోడ్, మూసాపేట,
అశ్విని హౌస్ దగ్గర,
హైదరాబాదు - 500 018.


## పరమాత్మ ఒక్కడే చాలు

వివిధ రకాలైన సంపదల కొరకు అనేక రీతులలో ఈ భౌతిక ప్రపంచమంతటా గాలించాను. కాని నాకు బాధలు కష్టాలే మిగిలాయి. ఇక భౌతికమైన వెదుకులాటను ఆపి, స్వయంగా నా లోపలే ఉన్న సంపద కోసం అన్వేషణ ప్రారంభించాను. సాక్షాత్తు భగవంతుడే లభించాడు. ‘భగవంతుడిని పోగొట్టుకోవటం ఆపద అని, ఆయనను పొందటం సంపద అని’ అప్పుడు తెలిసింది.

ఒక చారణుడు చక్రవర్తిని ఎంతగానో పొగిడాడు. ఆయనను పొగుడుతూ చక్కని పాటలు కూడా పాడాడు. అతని పొగడ్తలను విని చక్రవర్తి చిరునవ్వు నవ్వుతూ ఉండిపోయాడు. అంతా అయిన తరువాత ఆ చారణుడికి చక్రవర్తి ఎన్నో బంగారునాణేలను బహూకరించాడు. చారణుడు ఆ బంగారునాణేల వైపు దృష్టిసారించగానే అతని లోపల ఏదో ఒక మెరుపు మెరిసినట్లయినది. ఆ మెరుపు అతని చేతనత్వమంతటా విస్తరించింది.

అతడు బంగారునాణెములను విసిరికొట్టి నృత్యం చెయ్యటం ఆరంభించాడు. ఒక విశేషమైన కృతజ్ఞత అతడి వదనంపైన వ్యాపించింది. నాణేలను చూసిన వెంటనే అతడిలో ఎలాంటి మార్పు వచ్చిందో తెలియదు. ఇప్పుడు అతడు చారణుడు కాడు. ఒక సాధువు అయినాడు.

చాలా సంవత్సరాల తర్వాత ఎవరో అతనిని ‘ఆ నాణెములలో ఏమున్నది?’ అని అడిగారు. ఆ నాణెములలో ఏమైనా గారడీ ఉన్నదా అని ప్రశ్నించారు. అందుకు సమాధానంగా ఆ సాధువు ఒకసారి నవ్వి ఇలా అన్నాడు. ‘నాణెములలో కాదు, వాని పైన వ్రాసి ఉన్న వాక్యాలలో గారడీ ఉన్నది’. ‘జీవితంలో అన్ని అవసరాలకు ఆ పరమాత్మ ఒక్కడు ఉంటే చాలు’ అనే వాక్యం ఆ నాణెముల పైన వ్రాసి ఉన్నది’ అని అన్నాడు.

నిజంగా పరమాత్మ ఒక్కడు ఉంటే చాలు అన్న విషయం సత్యమే! ఒక వ్యక్తి వద్ద సకల సంపదలు, సమస్త భోగభాగ్యాలు ఉన్నాయి. ఐతే భగవంతుని ఉనికి అతనివద్ద లేని కారణంగా అతడు దరిద్రునివలె ఉంటాడు. అలాగే మరొక వ్యక్తి వద్ద ఎటువంటి సంపదలు, సాధనోపకరణములు ఏమీ లేవు. అయితే అతనికి భగవంతుని అండదండలు ఉన్న కారణంగా అతడు సంపత్తిశాలి అనిపించుకున్నాడు. అన్నీ పొందాలనుకున్న వ్యక్తి, అన్నింటినీ త్యాగం చెయ్యవలసి ఉంటుంది అన్న నియమం అప్పుడే వెల్లడయింది. అన్నింటినీ త్యజించగలిగే సాహసం చెయ్యగలిగిన వ్యక్తులు సాక్షాత్తు ఆ భగవంతుడినే పొందగలుగుతారు.

యుగశక్తి గాయత్రి మాస పత్రికపై ఫిర్యాదులు, సూచనలు, సలహాల కొరకు ఈ క్రింది నంబర్లలో సంప్రదించండి.
**ఫోన్: 040-23700722, 9440769798**

ఏకాగ్రమైన మనస్సుతో చేసిన ఉపాసనతో ఇష్టదైవం యొక్క సింహాసనం కదులుతుంది.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** పరమాత్మ ఒక్కడే చాలు 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** స్వచ్ఛమైన మనస్సు నుండి సభ్య సమాజం 2
3. **వేదమంత్రం :** మనం బ్రాహ్మణులం కావాలి 3
4. **గాయత్రీ విద్య-23 :** ధ్యానం 4
5. **గాయత్రీ చిత్రావళి - 2 :** ఆధ్యాత్మిక జననీ జనకులు 7
6. **ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం) :** సత్సాహస సంఘర్షణ ప్రకరణం 8
7. **పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం : 87-94** రాజకీయ రంగం - శీల నిర్మాణం 9
8. **బోధ కథ :** బుద్ధభగవానుని సన్నిధిలో 11
9. **స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేకం :** మానవజాతి పాలన, సభ్యతకు జన్మస్థలి భరతభూమి 13
10. **ప్రగతిశీల స్వావలంబనం-1 :** గ్రామాభివృద్ధి 16
11. **ఆదిశక్తి యొక్క లీలా కథలు-26 :** సింహవాహినియైన భవానీమాత సాధన ద్వారా మహాభాగులు కాగలరు 19
12. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-2:** భారత భాగ్య విధాత 22
13. **యువతకు ప్రత్యేకం :** ఐశ్వర్యం - 4 26
14. **తిలకధారణ వెనుకగల విజ్ఞానం, దర్శనం** 29
15. **మేడమ్ బ్లావట్స్కీ జన్మదిన ప్రత్యేకం :** పరోక్ష జగత్తు - అనంతమైన అవకాశాల భాండాగారం 32
16. **పూజ్య గురుదేవుల అమృతవాణి :** యుగశిల్పులకు నాలుగు కార్యక్రమాలు 34
17. **నా వారితో నా మాట :** ప్రజ్ఞను ప్రఖరతరం చేయాలి 38
18. **ఆరోగ్యమే మహాభాగ్యం-21 :** హోమియో వైద్య సేవ 40
19. **సుభాషితాలలో సుధారస బిందువులు - 10** 43
20. **నిత్యస్మరణీయులు - 8 :** సమైక్యతా స్వాప్నికుడు సర్దార్ పటేల్ 44
21. **శ్రావణ మాసం - శోభిత హాసం** 45
22. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 46




# సద్గురు వచనామృతం

## స్వచ్ఛమైన మనస్సు నుండి సభ్య సమాజం

పనులకు మూలం ఆలోచనలు. మస్తిష్కంలో ఎటువంటి ఆలోచనలు తిరుగుతూ ఉంటే అటువంటి పనులు జరుగుతూ ఉంటాయి. స్వార్థపరత్వంతో, తృష్ణతో, వాంఛతో, అహంభావంతో కూడిన ఆలోచనలలో మునిగి ఉండే వారిలో రకరకాల క్లేశాలు, కలహాలు, దుష్కర్మలు, నేరాలు నిరంతరం పెరుగుతూ ఉంటాయి. ఎక్కడ పరమార్థానికి, సంయమనానికి, సంతృప్తికి, నమ్రతకు, ఆదర్శ వాదానికి ప్రాధాన్యత ఉంటుందో అక్కడ సత్కర్మలే జరుగుతుంటాయి. ఫలితంగా కృతయుగ సుఖశాంతుల వాతావరణం నిర్మాణం అవుతుంది. ఆరోగ్యకరమైన శరీరానికి, స్వచ్ఛమైన మనసుకు సంబంధం ఉంది. అలాగే స్వచ్ఛమైన మనసుపై సభ్యసమాజం నిర్మాణం ఆధారపడి ఉంటుంది. శరీరంలో వ్యాధి ఉంటే, మనస్సులో తక్కువస్థాయి ఆలోచనలే వస్తూ ఉంటాయి. అస్వస్థుడైన వ్యక్తి ఎక్కువసేపు ఉన్నత భావనలను మనసులో ఉంచుకోలేడు. అటువంటి వ్యక్తులతో నిండిన సమాజం ఎన్నడూ సభ్యసమాజం కాలేదు. ఏకత్వం, ప్రేమ, ప్రగతి, శాంతి, సమృద్ధుల వైపుకు మానవజాతి ముందుకు పోవాలంటే ప్రజల మనస్సులు ఆదర్శవాదంతో, ధర్మవాదంతో, కర్తవ్యపరాయణతతో, పరోపకారంతో, ఆస్తికతతో పొంగి పొరలాలి. ఈ దిశలో మనం అడుగులు వేస్తూ ఉంటే ఉన్నతి కొరకు అవసరమయ్యే యోగ్యతలు, సామర్థ్యాలు, అన్నీ త్వరగా తేలికగా లభిస్తాయి. దుర్గుణాలు కలిగిన మనుష్యుల నేర్పరితనం, సాధన సంపత్తులు దుర్వినియోగం కావడం వల్ల ఆపదలు ఇనుమడిస్తాయి.

*- అఖండజ్యోతి, జులై, 1962*

*అనువాదం: సత్యనారాయణ గుప్తా*

## పండుగలు

**ఆగస్టు 2012**

**02-08-2012 జంధ్యాల పూర్ణిమ / రాఖీ పూర్ణిమ**

**15-08-2012 స్వాతంత్ర్య దినోత్సవం**

**సెప్టెంబర్ 2012**

**19-09-2012 వినాయక చవితి**

**వశంలో ఉన్న మనస్సు ఒక పనిమీద నిమగ్నమయితే ఇక అటు ఇటు పోదు.**

వేద మంత్రం

# మనం బ్రాహ్మణులం కావాలి

**బ్రాహ్మణాసః సోమినో వాచమక్రత ।**
**బ్రహ్మ కృణ్వన్తః పరివత్సరీణమ్ ।**
**అధ్వర్యవో ధర్మిణః సిష్విదానా ।**
**ఆవిర్భవన్తి గుహ్యా నకేచిత్ ॥ (ఋగ్వేద 7/103/8)**

**భావార్థం : శాంత స్వభావి, తపస్వి, సత్కర్మలు చేసేవాడే బ్రాహ్మణుడు.** సంవత్సర పర్యంతము నడిచే సోమయుక్త యజ్ఞములో ఎలా మంత్ర ధ్వని చేస్తారో, కప్పలు కూడా అలాంటి ధ్వనులే చేస్తాయి. స్వయంగా జ్ఞానియై, ప్రపంచానికి జ్ఞానమిచ్చి, దారితప్పిన వారిని సన్మార్గంలోనికి తెచ్చేవారినే బ్రాహ్మణులంటారు. వారు ప్రపంచంలో ముందుకు వచ్చి ప్రజలకు ఉపకారం చేయాలి.

**సందేశం :** మన ఋషులు, మనీషులు కర్మలననుసరించి వర్ణ వ్యవస్థ ఏర్పాటు చేసి, నాలుగు వర్ణములలో బ్రాహ్మణులపై గురుతర భారముంచారు. ప్రపంచమంతటా జ్ఞాన ప్రకాశము వ్యాపింప చేయుట వారి బాధ్యత. **నేడు వర్ణవ్యవస్థ కర్మను బట్టి కాక జన్మను బట్టి భావించుట మన దురదృష్టము.** కేవలం బ్రాహ్మణ కులంలో జన్మించినందున అతడు మొద్దబ్బాయి అయినా చివరికి దొంగ, బద్మాష్, మోసగాడు, దురాచారి, కుటిలుడు, కపటి అయినా కూడా బ్రాహ్మణుడంటున్నారు.

**ఎవరు తేజస్వి, జ్ఞాని, పవిత్రుడు, సంయమియో అతడే బ్రాహ్మణుడు.** అతడే పురోహితుడవుతాడు. 'అగ్ని ఋషిః పవమానః పాంచజన్యః. అతని కర్తవ్యం ఏమిటంటే అధికాధిక జ్ఞానార్జన చేయాలి. సంయమియై, యజ్ఞీయ జీవనం జీవించాలి; లోకశిక్షణ, ధర్మోపదేశం వంటి ప్రశంసనీయ కార్యాలలో నిమగ్నం కావాలి. ఏ వ్యక్తి అయినా విద్య యొక్క ఉపయోగము తన స్వార్థం కొరకు మాత్రమే చేస్తుంటే, ఇతరులకు జ్ఞానదానం చెయ్యకపోతే అతడు బ్రాహ్మణుడని పిలువతగడు.

**బ్రాహ్మణుని స్వభావము సౌమ్యం, శాంతం, సహన శీలం, సంయమి అయి ఉండాలి.** శారీరక మానసిక తపస్సుతో పరిపూర్ణ తపస్వీ జీవనం జీవించాలి. ఎటువంటి కఠిన, విపరీత పరిస్థితులలో కూడా తన పనిలో నిమగ్నమయ్యేంతగా శరీర తపస్సు చేసి బలిష్టుడై ఉండాలి. సోమరితనము, అజాగ్రత్తలో చిక్కుకోకుండా ఉండాలి. మానసిక తపస్సు ద్వారా మాయ, మోహం, మమకారం, క్రోధం, దురాలోచనలు, చెడు స్నేహముల నుండి విముక్తి పొంది ఉండాలి. తన అవసరాలను తగ్గించుకొని, తక్కువలో తక్కువతో తన పని గడుపుకొని, యజ్ఞీయ భావనతో పరోపకారము కొరకు తన సర్వస్వము సమర్పించు కొనుటకై తత్పరుడై ఉండాలి. పరమపిత పరమేశ్వరుడు మనుష్యులకే ఈ బాధ్యత అప్పగించాడు, వారు దానిని నిర్వర్తించేందుకు ఋషులు బ్రాహ్మణ వర్ణాన్ని స్థాపించారు.

బ్రాహ్మణునికి అన్నింటికన్నా పెద్ద శత్రువు అహంకారము. అతడు జ్ఞానవంతుడగుటవలన అందరి నుండి గౌరవం ప్రాప్తించు చుండుటచే తాము ఇతరుల కంటే ఉన్నతుడనని అనుకుంటాడు. కామ, క్రోధ, లోభ, మోహ అహంకారములలో, అన్నింటికన్నా మించిన వికారము అహంకారమే. దీనివలన మనస్సులో భావాత్మక నికృష్టత జన్మిస్తుంది. గుణాలలో, వస్తు విశేషములో ఇతరుల కన్నా తాను గొప్పవాడిననే నీచ ఆలోచన అతని మనస్సులో తలెత్తుతుంది. అహంకారమునకు గురికాగానే అతడు సంతులనం పోగొట్టుకొని బ్రాహ్మణత్వాన్ని కూడా కోల్పోతాడు.

మన ధర్మమేమంటే మనం బ్రాహ్మణులం కావాలి. బ్రాహ్మణత్వాన్ని రక్షించాలి, పోషించాలి.

★★★

## పాంచాలి విశాల హృదయం

*ద్రౌపది యొక్క ఐదుగురు పుత్రులు నిద్రిస్తుండగా ద్రోణుని పుత్రుడైన అశ్వద్ధామ వారిని చంపుతాడు. పాండవుల క్రోధానికి హద్దు లేదు. అశ్వాద్ధామను బంధించి తెస్తారు. ద్రౌపది ఎదురుగా అతని శిరస్సు ఖండించాలనుకున్నారు.*

*ద్రౌపదిలో అప్పటికే వివేకం జాగృతమయింది. "పుత్రుడు మరణిస్తే తల్లి ఎంత దుఃఖిస్తుందో నాకు తెలుసు. అంతే దుఃఖం గురువు ద్రోణాచార్యుని భార్యకు కలుగుతుంది. గురు ఋణమును, గురుమాత ఋణమును అర్థం చేసుకుని అతనిని వదలి వేయండి" అన్నది. ప్రతీకార భావనను కరుణ జయించింది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**వశంలో ఉంచుకున్న మనస్సు భూలోకంలోని కల్పవృక్షము.**



# గాయత్రీ విద్య-23

# ధ్యానం

ధ్యానం ఒక మానసిక ప్రక్రియ. దీని ద్వారా ఏ వస్తువునయిన మనస్సులో స్థాపించుకోవచ్చు. మానసిక క్షేత్రంలో స్థాపించబడిన వస్తువు ఆకర్షణ కేంద్రం అవుతుంది. మస్తిష్కం యొక్క అధికాధిక శక్తులు దానివైపు లాగబడతాయి. ఫల స్వరూపంగా అవి ఒక స్థానంపై కేంద్రీకరించబడతాయి. అయస్కాంతం నలువైపుల చల్లాచెదురుగా పడి ఉన్న లోహపు కణములను తన వైపు లాక్కుంటుంది. ఇదే విధంగా మనస్సులో పడి ఉన్న చిత్తప్రవృత్తులు ఒక స్థానంలో గుమిగూడతాయి.

**ఏదైనా ఆదర్శాన్ని, లక్ష్యాన్ని, ఇష్టాన్ని నిర్ధారించుకుని దానితో తన్మయత్వం చెందడాన్ని ధ్యానం అంటారు. మనిషి ఎలా ధ్యానం చేస్తే అలా తయారవుతాడు.** అచ్చులో తడి మట్టిని వేసి నొక్కితే దాని ఆకృతికి మారిపోతుంది. కీటక బృంగముల ఉదాహరణ సుప్రసిద్ధము. బృంగం (గండు తుమ్మెద) కీటకాన్ని (మిడుత) పట్టుకు వచ్చి దాని నలువైపుల ఝుంకారం చేస్తూ తిరుగుతుంది. కీటకం ఆ ఝుంకార ధ్వనిని తన్మయత్వంతో వింటుంది, బృంగం యొక్క రూపంతో, చేష్టలతో శ్రద్ధతో ఏకాగ్రభావంతో కలిసి పోతుంది. కీటకం మనస్సు భృంగమయమయి భృంగం యొక్క రూపాన్ని పొందడం జరుగుతుంది. దాని మాంసం, నాడులు, చర్మం మొదలైనవి మనస్సుతోపాటే పరివర్తనం చెందడం ప్రారంభమవుతుంది. కొద్ది సమయంలో దాని మనస్సు, శరీరం, భృంగంవలె తయారవుతాయి. ఇదే విధంగా ధ్యానం వల్ల సాధకుని సర్వాంగముల కాయకల్పం జరుగుతుంది.

సాధారణ ధ్యానంతో మానవుని శరీరం పరివర్తన చెందదు. దీనికొరకు ప్రత్యేకమైన రీతిలో లోతైన సాధనలు చెయ్యవలసి ఉంటుంది. కాని మానసిక కాయకల్పం చేయడం వల్ల ప్రతి మనిషి ధ్యానసాధనతో పరిపూర్ణమైన లాభం పొందగలడు. ప్రతి సాధకుడు ఇష్టదైవాన్ని ఎంచుకోవాలని ఋషులు నొక్కి వక్కాణించారు. ఇష్టదైవాన్ని ఎంచుకోవడమంటే జీవన ప్రధాన లక్ష్యాన్ని నిర్ధారించుకొనుటయే. ఇష్టదైవ ఉపాసన అంటే ఆ లక్ష్యంలో తన మానసిక చేతనను తన్మయింపచేయాలి. ఇలా చేయడం వల్ల మనస్సు యొక్క చిందరవందరగా పడి ఉన్న శక్తులన్నీ ఒక బిందువుపై కేంద్రీకరించబడతాయి. ఒకే స్థానంపై ఏకాగ్రత సాధించుట వలన ఆ దిశయందు సర్వమానసిక శక్తులు లగ్నమవుతాయి. ఫలస్వరూపంగా సాధకుని గుణం స్వభావం, ఆలోచనలు, ఉపాయం అద్భుత రీతిలో పెంపొందుతాయి. అభీష్ట లక్ష్యమును తేలికగా అనతికాలంలోనే చేరతాడు. దీనినే ఇష్టసిద్ధి అంటారు.

ఆదర్శముల, ఇష్టముల కొరకు ధ్యానసాధనలో వాటిని దివ్యరూపధారులైన దేవతల రూపంలో భావించుకుని వానితో తన్మయత స్థాపించుకొనుటయే యోగుల పద్ధతి. సజాతీయులపైనే ఇష్టం ఉంటుంది. అందువల్ల ఇష్టాన్ని లక్ష్యరూపంలో దివ్యదేహ ధారులైన దేవతలుగా భావించి వాటితో తన్మయత పొందడమనే గూఢమైన, రహస్యమైన మనోవైజ్ఞానిక ఆధారం ఉపయోగించు కోవాలి. ఒక్కొక్క అభిలాషకు, ఆదర్శానికి ఒక్కొక్క ఇష్టదైవం ఉన్నది. బలమునకు ప్రతీక దుర్గ, ధనమునకు ప్రతీక లక్ష్మి, బుద్ధికి ప్రతీక సరస్వతి, ధార్మిక సంపదకు గాయత్రి, భౌతిక విజ్ఞానమునకు ప్రతీక సావిత్రిగా భావిస్తారు. గౌరి, పద్మ, శచి, మేధా, సావిత్రి, విజయ, జయ, దేవసేన, స్వధా, స్వాహా, మాతర, లోకమాతర, ధృతి, తుష్టి, పుష్టి, ఆత్మదేవి అనే షోడశ మాతృకలు ప్రసిద్ధి గాంచినవి. శైలపుత్రి, బ్రహ్మచారి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి, ఈ నవదుర్గలకు తమ తమ ప్రత్యేకతలు ఉన్నాయి.

ఒకే ఇష్టదైవం విభిన్న గుణములు కలది కూడా కావచ్చు. ఒకే మహాశక్తి వివిధ ప్రయోజనముల కొరకు కాళి, తార, షోడశి, భువనేశ్వరి, చిన్నమస్తా, త్రిపుర, భైరవి, బగళ, మాతంగి, కమల, ఇంద్రాణి, వైష్ణవి, బ్రాహ్మణి, కౌమారి, నరసింహ, బారాహి, మహేశ్వరి మొదలైన వివిధ రూపాలలో ఉపాసన చెయ్యవచ్చు. ఒకే మహాగాయత్రిని హ్రీం, శ్రీం, క్లీం (సరస్వతి, లక్ష్మి, కాళి) మూడు రూపాలలో ఉపాసన జరుగుతుంది. ఇంకా ఈ మూడింటిలో అనేక భేదములు ఉంటాయి. ఏ సాధకులలో ఈ మహాశక్తి అపేక్ష, పిత్రుశక్తి రూపంలో అధిక రుచి ఉంటుందో, ఎవరిలో నారిశక్తి తత్వం పురుషతత్వ ప్రధానంగా (పుంలింగం) దివ్య తత్వములపై మనస్సు విశేషంగా లగ్నమవుతుందో వారు గణేశుడు. నృసింహ, భైరవి, శివ, విష్ణు మొదలైన ఇష్టముల (దేవతల) ఉపాసన చేస్తారు.

**వాయువును వశంలో ఉంచుకొనుట ఎంత కష్టమో మనస్సును వశంలో ఉంచుకొనుట అంతే కష్టం.**

ఇక్కడ ఎటువంటి భ్రమలో పడకూడదు. అనేక దేవతలకు స్వతంత్ర ఆధారం లేదు. ఈశ్వరుడు ఒకడే. ఆయన అనేక శక్తులనే అనేక దేవతల పేర్లతో పిలుస్తారు. మనుష్యుడు తన ఇచ్ఛ, రుచి, ఆవశ్యతానుసారం ఈ ఈశ్వరీయ శక్తులను ప్రాప్తించుకునేందుకు, తమవైపు ఆకర్షించుకునేందుకు, తమ లక్ష్యములను ఎంచుకుని, వాటితో తన్మయత పొందడమనే మనోవైజ్ఞానిక ఉపాసన పద్ధతి ద్వారా ఆ శక్తులను తమలో అధిక పరిమాణంలో ధారణ చేస్తారు.

ధ్యానయోగ సాధనలో, మనస్సు యొక్క ఏకాగ్రత లక్ష్యాన్ని, ఇష్టాన్ని యోగస్థితిలో పొందే ప్రయత్నం జరుగుతుంది. దీనికొరకే ధ్యాన విధానం నిర్ధారించబడింది. ధ్యానంలో ఐదు అంగములున్నాయి. అవి 1) స్థితి 2) సంస్థితి 3) విగతి 4) ప్రగతి 5) సంస్మితి.

స్థితి అంటే సాధకుడు ఉపాసన చేసే సమయంలో ఉన్న స్థితి. మందిరంలో, నది ఒడ్డున, ఏకాంతంగా, స్మశానంలో, స్నానం చేసి, స్నానం చెయ్యకుండా, పద్మాసనంలో, సిద్ధాసనంలో, ఎటువైపు తిరిగి కూర్చుని, ఏ ముద్రలో, ఏ సమయంలో, ఎలా ధ్యానం చెయ్యాలి? దానికి సంబంధించిన వ్యవస్థను స్థితి అంటారు.

సంస్థితి అంటే ఇష్టదేవత యొక్క అందమైన రూపనిర్ధారణ, ఉపాస్య దైవం యొక్క ముఖాకృతి, ఆకారం, ముద్ర, వస్త్రములు, అభూషణములు (నగలు), వాహనం, స్థానం, భావములను నిశ్చయించుకోవడాన్ని సంస్థితి అంటారు.

విగతి అంటే ఇష్టదైవంలో ఏ ప్రత్యేకతలు, శక్తులు, సామర్థ్యములు, పరంపరలు, గుణములు ఉన్నాయి అనేది తెలుసుకోవడమే.

ప్రగతి అంటే ఉపాసనా కాలంలో సాధకుని మనస్సులో ఉన్న భావములు. దాస్య, సఖ, గురు, బంధువు, మిత్రుడు. మాతా, పిత, పుత్రుడు, సేవకుడు, శత్రువు మొదలైన సంబంధాలలో ఏ సంబంధంతో ఉపాస్య దేవతను భావిస్తామో, ఆ స్థితిని ప్రగాఢం చేసుకునేందుకు ఇష్టదైవమును ధ్యానావస్థలో తమ తమ ఆంతరిక భావములలో వివిధ శబ్దములతో, చేష్టల ద్వారా ఉపస్థితి చెయ్యడాన్ని ప్రగతి అని అంటారు.

సంస్మితి అంటే సాధకుడు సాధ్యంతో, ఉపాసకుడు ఉపాస్య దేవతతో ఏకం కావడం రెండింటిలో (ఇద్దరిలో) ఎటువంటి బేధం ఉండదు. భృంగంపై కీటకం యొక్క తన్మయత ద్వైత స్థానంలో అద్వైతం; ఉపాస్య ఉపాసకుల అబేధంలో స్వయంగా ఇష్టదైవంతో పరిపూర్ణంగా లీనమైనటువంటి అనుభూతి. అగ్నిలో పడి కర్ర ముక్క కూడా అగ్నివలె ఎర్రగా మారుతుంది. అలాంటి స్థితి ఏ క్షణంలో అనుభూతిలోకి వస్తుందో దానిని సంస్మితి అంటారు.

ఒకే ఇష్టదైవాన్ని అనేక ప్రయోజనముల కొరకు అనేక ప్రకారములుగా ధ్యానం చేస్తారు. ఇక్కడ ఆ విస్తార వర్ణన ఇవ్వడం సాధ్యం కాదు. ఇక్కడ మనోమయకోశమును వ్యవస్థితం చేసేందుకు, ధ్యానం ద్వారా మనస్సును ఏకాగ్రం చేసేందుకు, మనస్సును వశంలో తెచ్చుకునే విధి మాత్రమే చెప్పబడుతున్నది. దీని కొరకు కొన్ని ధ్యాన పద్ధతులు ఇవ్వబడుతున్నాయి.

1) నునుపుగా ఉన్న రాతితోగాని, ధాతువులతో అందమైన గాయత్రి ప్రతిమ సమకూర్చుకోవాలి. దానిని ఒక చక్కని ఆసనంపై పెట్టుకోవాలి. ప్రతిదినం ఆ ప్రతిమకు జల, ధూప, దీప, గంధ, నైవేద్య, అక్షత, పుష్పములు మొదలైన మంగళ మయమైన ద్రవ్యములతో పూజించాలి. ఈ విధంగా ప్రతినిత్యం చేయడం వల్ల సాధకునిలో శ్రద్ధ పెరుగుతుంది. మానసిక ప్రవృత్తులు ఆ దిశలోకి మరలుతాయి. సాధకునిలోని అరుచిని పోగొట్టి రుచిని ఉత్పన్నం చేయగల ప్రథమ సోపానం ఈ పార్థివ పూజయే.

2) శుద్ధి అయి, దర్భతో చేసిన ఆసనంపై తూర్పుముఖంగా పద్మాసనంలో కూర్చోవాలి. ఎదుట గాయత్రి చిత్రపటాన్ని పెట్టుకోవాలి. మనోయోగ పూర్వకంగా ఆమె ముఖాకృతి లేక అంగ ప్రత్యంగములను చూడాలి. కన్నులు మూసుకోవాలి. ఆ చిత్రం యొక్క సూక్ష్మత కూడా ధ్యానావస్థలో చక్కగా గోచరిస్తుంది. ఈ ప్రతిమకు మానసిక సాష్టాంగ ప్రణామం చెయ్యాలి. బదులుగా ఆశీర్వాదం ప్రాప్తిస్తున్నట్లు భావించుకోవాలి.

3) ఏకాంత స్థానంలో స్థిరంగా కూర్చోండి. నిఖిల నీల ఆకాశంలో ఏ వస్తువు లేదు. కేవలం ఒక బంగారు వర్ణం కల సూర్యుడు తూర్పు దిశలో మెరుస్తున్నాడు. ధ్యానావస్థలో విశేషమైన మనోయోగపూర్వకంగా ఆ సూర్యుని చూడండి. దాని మధ్యలో హంసారూఢి అయిన అందమైన గాయత్రీమాత స్వరూపం అస్పష్టంగా దృష్టిగోచరం అవుతుంది. అభ్యాసంతో ఈ అందమైన రూపం స్పష్టంగా కనిపించడం జరుగుతుంది.

4) గాయత్రి-సూర్యుని బంగారు కిరణములు నా నగ్న శరీరంపై పడుతున్నాయి. అవి రోమకూపంలోకి ప్రవేశించి ఆ కాంతితో దేహంలో సమస్త స్థూల సూక్ష్మ అంగములలో తన వెలుగు ప్రకాశంలో నింపుతున్నాయి.

**లోభం, క్రోధం, తృష్ణ మున్నగువానితో మానసిక పతనం జరుగుతుంది.**

5) దివ్యమైన తేజస్సుతో, అత్యంత సుందరమైన ఎంత అందమైనదంటే మీరు ఎంత బాగా కల్పన చేయగలరో అంత అందంగా ఆకాశంలో దివ్య వస్త్రములతో, ఆభరణాలతో ఉన్నటువంటి గాయత్రీమాతను ధ్యానం చేయండి. ధ్యానం ఏదైనా అందమైన చిత్రం ఆధారంగా చేసుకుంటే మంచిది. గాయత్రీమాత యొక్క ఒక్కొక్క అంగమును విశేషమైన మనోయోగపూర్వకంగా చూడండి. ఆమె ముఖాకృతి, చూపులు, చిరునవ్వు, భావ భంగిమలపై విశేష ధ్యానం ఇవ్వండి. మాత తన అభీష్టవాణి, చేష్ట, సంకేతముల ద్వారా మీ మనస్సులో నవీన భావములను సంచారం చేస్తుంది.

6) శరీరమును పూర్తిగా సడలించాలి. ఈజీఛైర్‌లో కాని, ఒక దిండు లేక గోడను ఆనుకుని శరీరం యొక్క నాడులన్నీ నిర్జీవమైనట్లు చేసుకోవాలి. తరువాత ఇలా ధ్యానం చేయాలి. సుందరమైన ఆకాశంలో చాలా ఎత్తున ఉన్నటువంటి ధృవ నక్షత్రం నుంచి వెలువడిన ఒక నీల వర్ణపు శుభ్ర కిరణం సుధాధారవలె తన వైపు వస్తున్నట్లుగా, మస్తిష్కం లేక హృదయంలో ఋతుంభరా బుద్ధి రూపంలో, ప్రజ్ఞారూపంలో ప్రవేశిస్తున్నది. ఆ పరమ దివ్య పరమ ప్రేరక శక్తిని చూచి తన హృదయంలో సద్భావనలు, మస్తిష్కంలో మంచి ఆలోచనలు, సముద్రంలో ఆటుపోట్లవలె పొంగి పొరలుతున్నాయి. ఈ దివ్య ధారను ప్రేరకమైన ఆ ధృవతార సత్యలోకవాసియైన గాయత్రీ మాతయే. బాలకుడు తన తల్లి ఒడిలో ఎలా ఆడుకుంటాడో అలాగే మీరు కూడా గాయత్రీమాత ఒడిలో ఆడుకుంటున్నట్లు భావించాలి.

7) మేరుదండాన్ని (వెన్నెముక) నిటారుగా ఉంచుకొని పద్మాసనంలో కూర్చోవాలి. కన్నులు మూసుకోండి. భ్రూమధ్య భాగంలో (భృకుటి) లో తెల్లని వర్ణం దివ్యజ్యోతిని ధ్యానించండి. ఈ జ్యోతి విద్యుత్‌వలె క్రియాశీలమై (active) తన శక్తితో మస్తిష్కంలో చెల్లాచెదురుగా పడి ఉన్న అనేక శక్తులకు పోషణ ఇచ్చి జాగరణ చేస్తున్నదని భావించాలి, విశ్వసించాలి.

8) ఇలా భావన చేయాలి. మీ శరీరం ఒక అందమైన రథం. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే గుర్రాలు ఆ రథానికి కట్టబడ్డాయి. ఈ రథంలో దివ్యతేజోమయమైన మాత విరాజ మానమై ఉన్నది. గుర్రముల కళ్ళెములు ఆమె చేతిలో ఉన్నాయి. ఏ గుర్రం అటు ఇటు అయితే, కొరడాతో దానిని దండించి సరియైన మార్గంలో పెడుతున్నట్లు భావించుకోవాలి. గుర్రాలు కూడా భయపడి మాత యొక్క దెబ్బలను స్వీకరిస్తున్నాయి.

9) హృదయస్థానం దగ్గర, సూర్య చక్రంలో సూర్యుని వంటి ప్రకాశాన్ని ధ్యానం చెయ్యండి. ఇది ఆత్మ యొక్క ప్రకాశం. దానిలో మాత యొక్క శక్తి కలుస్తున్నది. ప్రకాశం ఎక్కువవుతున్నది. ఈ పెరిగి పెద్దదయిన ప్రకాశంలో ఆత్మ యొక్క వస్తు స్వరూపం యొక్క దర్శనం అవుతుంది. ఆత్మ సాక్షాత్కార కేంద్రం సూర్య చక్రమే.

10) నలువైపుల అంధకారం ఉన్నట్లు ధ్యానం చేయండి. దానిలో హోలిలాగా పృథ్వి నుండి ఆకాశం వరకు ప్రచండ తేజస్సు జాజ్వల్యమానంగా ఉన్నది. దానిలో ప్రవేశించడం వల్ల మీ శరీరం లోని ప్రతి అంగం, మనస్సు ఆ పరమతేజస్సుతో సమానంగా అగ్నిమయమయ్యాయి. మీ సమస్త పాపతాపములు, వికారాలు, సంస్కారాలు తగలబడిపోయాయి. శుద్ధమైన సచ్చిదానంద శేషం మిగిలిపోయింది.

పైన కొన్ని సుగమమైన, సర్వోపయోగమైన ధ్యాన విధానములు చెప్పబడ్డాయి. ఇవి సరళమైనవి. ప్రతిబంధనములు లేనివి. వీటి కొరకు ఎటువంటి విశేష నియమాలు పాటించ నవసరం లేదు. శుద్ధ అయి ఈ సాధనలు చేసుకోవాలి. అవకాశం వచ్చినప్పుడు ఇతర సమయాలలో కూడా చిత్తం శాంతంగా ఉంటే ఈ ధ్యానములను, మీ అభిరుచికి తగినట్లు ధ్యానం చేసుకొనవచ్చు. ఈ ధ్యానములలో మనస్సును సంయమముగా, ఏకాగ్రం చేయుటకు చాలా శక్తి ఉన్నది. ఉపాసన యొక్క ఆధ్యాత్మిక లాభం కూడా లభిస్తుంది.

★★★

## ముల్లా నసీరుద్దీన్


*ముల్లా నసీరుద్దీన్ ఢిల్లీకి చెందిన బాదుషా. ఆయన తీరిక సమయాలలో టోపీలను తయారుచేసి వాటి ద్వారా లభించిన ధనంతో తన వ్యక్తిగత అవసరాలను తీర్చుకునేవాడు. ఒకనాడు ఆయన భార్య వంట చేస్తుండగా చేయి కాలింది. "బాదుషా భార్య అయ్యుండి కూడా ఒక్క నౌకరు లేదు. నా కోసం ఒక వంట మనిషినయినా ఏర్పాటు చేయలేవా" అని ఆమె భర్తను ప్రశ్నించింది. దానికి నసీరుద్దీన్ ఇలా అన్నాడు. ఈ రాజ్యం, ఈ ధనం, ఈ వైభవం అన్నీ ప్రజలవి. నేను వీటిని రక్షించే నౌకరును మాత్రమే. నౌకరుకు నౌకర్లు ఎక్కడ నుంచి వస్తారు. అందువలన నీకు వంట నేనే చేసి పెడతానని సిద్ధమవుతాడు. భర్త యొక్క ప్రవర్తన భార్య హృదయాన్ని కదిలించివేసింది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**రాగముల నివృత్తే వైరాగ్యం.**

గాయత్రీ చిత్రావళి - 2

# ఆధ్యాత్మిక జననీ జనకులు




మాతా పితరుల రజోవీర్యములతోనే అన్ని ప్రాణుల జన్మ కలుగుతుంది. ద్విజత్వము, రెండవ జన్మ అనేది మానవుని వాస్తవిక విశేషత. ఈ రెండవ జన్మ గాయత్రీ మాత, ఆచార్యుడనే తండ్రి యొక్క దివ్య శక్తుల సమన్వయముతో కలుగుతుంది. యజ్ఞోపవీత సంస్కారము గురుమంత్రము యొక్క విధి విధానముతో కూడిన దీక్ష. ఈ రెండవ జన్మ ద్విజత్వము యొక్క ప్రకటనగా భావించబడుతుంది. ఈ ప్రకటన లేకుండా ఎవరికీ గాయత్రి అధికారము లభించదు. గాయత్రి యొక్క అధికారము ద్విజులకేనని శాస్త్రములలో చెప్పబడినది.

నిగురా (గురువు లేకుండుట) అన్నది భారతీయ సమాజంలో ఒక తిట్టు. ఎందుకంటే ప్రతి మనుష్యునికి మానసిక వికాసము, సంస్కారము, పరిమార్జన, బీజారోపణ, నిర్మాణములకు ఒక సుయోగ్యుడు, అనుభవజ్ఞుడు, సచ్చరిత్రుడైన విద్వాంసుని యొక్క సమగ్ర సహాయము ఆవశ్యకమవుతుంది. ఎవరికి ఈ సహాయము లభించదో వారు సంస్కారవంతులయ్యే దెలా? ప్రాచీనకాలంలో ప్రతి వ్యక్తికి ఒక ధర్మ గురువు ఉండేవాడు. అందుకే మాత, పిత, ఆచార్యులను బ్రహ్మ విష్ణు మహేశ్వరులుగా వర్ణించారు.

గాయత్రీ మంత్రము కీలితము (locked), ఎప్పటివరకు అది ఉత్కీలితము (unlocked) కాదో అప్పటివరకు అది ఫలించదు. దీని వాస్తవిక తాత్పర్యము ఏమంటే ప్రాణదీక్ష ద్వారా మంత్రశక్తి స్ఫుల్లింగమును తన అంతరంగములో స్థాపించుకొనుట. ఎలాగైతే సామూహిక హోలి నుండి అగ్నిని తెచ్చి తమ ఇంటిలోని చిన్న హోలిని వెలిగిస్తామో అలాగే ఎవరైనా నైష్ఠిక గాయత్రీ ఉపాసకుని నుండి ఆ అగ్నికణాన్ని తీసుకొని దీక్షావిధి ద్వారా తమ లోపల స్థాపించుకొంటే సాధనలో తగిన సాఫల్యము లభిస్తుంది. కేవలం 24 అక్షరాలు మననం చేసినంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదు.

సాధకుడు తన సాధనలో గాయత్రి మాత–గురు పితల ద్వారా తన ఆధ్యాత్మిక ద్వితీయ జన్మ ప్రసవించబడినదని అనుకోవాలి. ఇరువురి పట్ల శ్రద్ధ కలిగిన సాధకుడు ఈ మహామంత్ర సాధనలో సఫలుడవుతాడు. ఏకపక్షసాధన చేసే వ్యక్తి సరియైన మార్గదర్శనం, ప్రకాశము ప్రాప్తించక తన బహుమూల్య సమయము నిష్ఫలంగా పోగొట్టుకుంటాడు.

గాయత్రి శక్తివంతమైనది, కానీ ఆ శక్తి జాగరణ గురువు ద్వారా మాత్రమే అవుతుంది. గురువులేని సాధకుడు అత్యధిక ప్రయత్నము చేసి కూడా అత్యల్ప ఫలమును పొందుతాడు. అందుకే ఉపాసకులు ఆధ్యాత్మిక మాతాపితలైన గాయత్రి–గురువుల పట్ల సముచిత శ్రద్ధ కలిగి ఉండుట ఉచితము.

*– అనువాదం : డా॥ తుమ్మూరి*

**ఆహారంతో మనస్సును మార్చవచ్చు.**

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం)

# సత్సాహస సంఘర్షణ ప్రకరణం

**ఏవం స్రష్టా హానియుక్త మనావశ్యకమప్యదః ।**
**అవాంఛనీయతాస్తిత్వం స్థాపయా మాసమాన్యతామ్ ॥ 16**

ఈ విధంగా సృష్టికర్త హానికరమైనది, అనావశ్యకమైన అవాంఛనీయమైనది అయిన మార్గాలను సృష్టించి, వాటి నుండి బయటపడి, వాటికి దూరంగా ఉంటూ, న్యాయ నిష్టను అలవర్చు కోమని భగవంతుడు ఇచ్చే సందేశాన్ని మనం ఆచరణలో పెట్టాలి.

**వ్యాయామభవనే యే తు యుద్ధ యంత్రేహి పరస్పరమ్ ।**
**శూరావీరాశ్చ జాయంతే బలిష్టా నాత్ర సంశయః ॥ 17**

నిత్యము వ్యాయామశాలలో సాధన చేస్తూ, దేహ దారుఢ్యాన్ని పెంపొందించుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు యోగ సాధకులైన బలశాలురు. వారే వీరులుగా, శూరులుగా మారి సుశిక్షితులైన యుద్ధ సైనికులుగా రక్షణ బాధ్యతను స్వీకరిస్తారు. ఆ నిత్యసాధన కేవలం దేహానికి మాత్రమే కాకుండా మనస్సుకు, బుద్ధికి కూడా అవసరం. మనస్సు ఇంద్రియాల నుండి, బుద్ధి అలసత్వం నుండి రక్షించబడాలంటే తప్పక నిత్యసాధన అవసరం. అపుడే పటిష్టమైన బుద్ధి, నిర్మలమైన మనస్సులు కర్మమార్గంవైపు, నిష్కామకర్మ లక్ష్యంవైపు మనిషిని నడిపిస్తాయి.

**పరాక్రమోనరస్యాస్తి, మహత్వ మహితోగుణః ।**
**ఉదయః సంభవస్త స్య సంఘర్షణైవనాన్యథా ॥ 18**

నిత్యసాధన ద్వారా ఇంద్రియాలను అదుపు చేస్తూ, తమ పరాక్రమాన్ని ప్రదర్శించిన మనస్సు, బుద్ధి, జ్ఞానమనే ఉదయాన్ని అందించి, ఆ వెలుగులో "చీకటి" అనే నైరాశ్యాన్ని తొలగింపచేసి, ఆరోగ్యంతోబాటు మనోధైర్యాన్ని ఇస్తాయి. ఆ మహిమాన్విత గుణాల వల్లనే లౌకిక ఆకర్షణాలకు అతీతంగా మనిషి ఎదుగుతాడు. ఇంద్రియ నిగ్రహ శక్తితో నిత్య సంఘర్షణతో మనిషి పరాక్రమునిగా, త్రివిక్రమునిగా (సత్త్వ, రజో, తమస్సులను జయించిన) లోకంలో మార్గదర్శకుడౌతాడు.

**ఏతాదృశే త్వనాయాతే జీవనేఽవసరేనరః ।**
**వంచితః ప్రతిభాయాశ్చ ప్రఖరత అపిత్వలమ్ ॥ 19**

ఇటువంటి కర్మయోగసాధన చేయకుంటే నరుడు లౌకిక బంధనాలకు చిక్కుకుపోయి, తన ప్రజ్ఞా పాటవాల దారి మళ్ళి, వ్యర్థంగా, నిష్ప్రయోజనకరంగా మారి అధర్మ మార్గంలోకి పయనించే అవకాశం ఉంటుంది. మానవుని ప్రతిభ, ప్రకర్షలు ఇలా వృధాగా, విరుద్ధంగా మారి ఎటువంటి దశ, దిశా నిర్దేశం లేని వ్యర్థ జీవితాన్ని గడుపుతాడు.

**యేన స నిష్ప్రభం దీనహీనమేవ హి జీవతి ।**
**జాగృతి స్త తృరత్వం చ ప్రఖరతాసంతి సద్గుణాః ॥ 20**

దీనుని వలే, హీనంగా జీవనాన్ని గడిపే మానవుడు తప్పక జాగృతి, తత్పరత, పట్టుదల (రక్షణయే లక్ష్యంగా కల్గి ఉండడం) అనే సద్గుణాలను పొందే ప్రయత్నం చేయవలెను అపుడే అతనికి జీవన లక్ష్యం తెలుస్తుంది. అపుడే యదార్థ మానవునిగా మారతాడు. జాగృతి అంటే ఏది ఆదర్శ జీవనానికి వాంఛనీయం (కోరతగినది), ఏది అవాంఛనీయం (కోరతగనిది) అనే విచక్షణ, 'తత్పరత అనగా, ఒక నిర్ణయాన్ని తీసుకుని, తదనుగుణంగా కర్మాచరణ కొరకు కర్మ, జ్ఞానేంద్రియాలను సమన్వయపరిచే క్రియాశీలత 'ప్రఖరత' అంటే తాను తీసుకున్న నిర్ణయానికి ఎటువంటి అవరోధాలు, ఆటంకాలు రాకుండా రక్షణ బాధ్యతను స్వీకరించి, తుది విజయం వరకు పాటపడడటమే. కావున ఈ మూడు సద్గుణాలు మానవ జీవన వికాసానికి తోడ్పడే సద్గుణ త్రయం.

**ఇమే త్రయోగుణా న్యాయ పక్షమాశ్రిత్య సర్వథా ।**
**యుద్ధ్యమానే భజంత్యాశు వికాసంతు మాహామునౌ ॥21**

ఈ మూడు గుణాలు న్యాయమార్గాలలో మానవుని పయనింపచేస్తూ విరోధగుణాల పట్ల యుద్ధాన్ని ప్రకటించి, వాటి దురాక్రమణను అడ్డుకునే శక్తినిచ్చే సంజీవినీ మంత్రాల వంటివి. ఇవే మానవ వికాసానికి తోడ్పడే యదార్థ విజయ సూత్రాలు. ఓ మహామునీ! వీటిని నిత్యం ప్రతిఒక్కరూ సేవించినపుడే వారి జన్మ సాఫల్యం అవుతుంది.

*- కథాకథన వ్యాఖ్యానం: సాధన నరసింహాచార్య*

మానసిక స్థితిని మార్చుకొనడమే పూజావిధానం.

పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం : 87-94

# రాజకీయ రంగం, శీల నిర్మాణం

ఈనాడు ప్రభుత్వ వ్యవస్థకు బలం హెచ్చుగా ఉంది. కనుక దాని బాధ్యత కూడా ఎక్కువే. జాతీయ శీలం ఉన్నతి పొందడంలో, పతనం చెందడంలో ప్రభుత్వ వ్యవస్థ తన విధానాల ద్వారా ఎంతగానో సహాయపడవచ్చు, ఆటంకపరచవచ్చు కూడా. రాజకీయరంగంలో శీల (character) నిర్మాణానికి దోహదం చేసే కొన్ని సూచనలను దిగువ ఇస్తున్నాం. మనం నేడు ప్రత్యక్షంగా రాజకీయాలలో పాల్గొనడం లేదు. అయితే, ఒక ఓటరుగా, బాధ్యత కలిగిన పౌరుడుగా ప్రభుత్వ వ్యవస్థను తగు విధంగా మెరుగు పరచేందుకు ప్రయత్నించడం మన బాధ్యత.

ఎన్నికయిన వ్యక్తులకు ఈ సలహాలు అందాలి. రేపు ఎన్నుకోబడే వ్యక్తులకు కూడా ఈ సలహాల ప్రాముఖ్యాన్ని తెలియజెప్పాలి. ఎన్నికైన వ్యక్తుల అధిక సంఖ్యాక బలం ఈ దిశలో చర్యలు తీసుకోగలుగుతుంది. అల్పసంఖ్యలో ఉన్న వ్యక్తులు కూడా అధిక సంఖ్యాకులను ప్రభావితం చేయగలుగుతారు. ప్రజా ఉద్యమంగా ఈ ఆలోచనా విధానాన్ని ప్రభుత్వానికి అందిస్తే, దీన్ని పరిశీలించి తగు సంస్కరణలు జరిపే అవకాశం ప్రభుత్వానికి లభిస్తుంది. మనం నిర్మాణాత్మకమైన కృషి చేయాలి. ప్రభుత్వ వ్యవస్థలో శీల నిర్మాణానికి ఉపకరించే వాతావరణం నిర్మాణం కావడానికి ప్రయత్నించాలి.

### భగవద్గీత ద్వారా జన జాగరణ

భాగవత సప్తాహాల ద్వారా ఆధ్యాత్మిక జాగరణ జరుగుతుంది. అలాగే, గీతా సప్తాహాల ద్వారా జన జాగరణ జరపడానికి కృషి జరగాలి. యుగ నిర్మాణ యోజన ప్రతిపాదించే ఆర్ష ఆలోచనా విధానం భగవద్గీతలో సమగ్రంగా ఉన్నది. వ్యామోహంలో చిక్కుకున్న అర్జునునికి కృష్ణ భగవానుడు గీతా సందేశాన్ని వినిపించి అతడిని కర్తవ్య మార్గంలో నడిపించాడు. అలాగే, నిద్రాణమై ఉన్న భారతదేశాన్ని మేలుకొల్పడానికై జన జీవనంలో గీతా జ్ఞానాన్ని ప్రవేశపెట్టాలి.

గీతా ప్రవచనాలు ఇవ్వడంలో శిక్షణ ఇవ్వడానికై ఒక ప్రత్యేక పథకాన్ని రూపొందించారు. గీతా శ్లోకాలకు అనుగుణమైన రామాయణ ఘట్టాలను, చారిత్రక పౌరాణిక కథలను వర్ణించే పుస్తకాలు తయారైనాయి. ఆ పుస్తకాల ద్వారా గీతా సందేశాన్ని ఆబాలగోపాలం, స్త్రీ పురుషులు, విద్యావంతులు, నిరక్షరాస్యులు అందరికీ ఆకర్షణీయంగా, ప్రబోధకంగా, హృదయానికి హత్తుకునే విధంగా అందించవచ్చు. గీతకు పాడుకునేందుకు అనువైన పద్యానువాదం కూడా అచ్చయింది. దానిని కీర్తనగా, భజనగా పాడుకోవచ్చు. సమావేశాలలో పాల్గొనే వ్యక్తులు జట్లుగా ఏర్పడి, ఒక జట్టు తర్వాత మరో జట్టు ఈ పద్యానువాదాన్ని సామూహికంగా పఠించవచ్చు. అలా చేస్తే, గీతా పారాయణం ఎంతో ఆకర్షణీయంగా రూపొందుతుంది. ఏ శ్లోకంతో ఏ యుగ నిర్మాణ సిద్ధాంతాన్ని జోడించాలో, దాన్ని ఎలా ప్రతిపాదించాలో ఆ పద్ధతిని ఈ గీతా సప్తాహ సాహిత్యంలో వర్ణించారు. ఇలాంటి ప్రవచనాలు ఇచ్చే వ్యక్తుల శిక్షణకై నెలరోజుల శిక్షణ శిబిరాలను నిర్వహిస్తూ ఉండాలి.

పరమపూజ్య గురుదేవులు ప్రజ్ఞాపురాణాన్ని యుగపురాణంగా రచించారు. భాగవత పురాణ కథవలె ప్రజ్ఞాపురాణం ప్రవచనానికి కూడా వారం రోజులపాటు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలి.

### ఓట్లు, ఓటర్లు

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల బాగోగుల బాధ్యత ఓటర్లపై ఉన్నది. **ఓటు వేయడం ఒక పరమపవిత్రమైన కర్తవ్యం.** ఓటు విలువను మనం గుర్తించాలి. పక్షపాతం వల్ల, ఒత్తిడివల్ల, ప్రలోభం వల్ల ఎవరో ఒకరికి ఓటువేసే పొరపాటు చేయకూడదు. పార్టీ యొక్క అభ్యర్థి యొక్క ఆలోచనా విధానం, భావనల ఉత్కృష్టతను సరిగ్గా అంచనా వేయాలి. జాతి భవిష్యత్తును నిర్మించే బాధ్యతను మనం ఎవరికి ఇవ్వాలి అని బాగా ఆలోచించి ఓటు వేయాలి. ప్రభుత్వంలో తగు సంస్కరణ రావాలంటే, ఓటర్లను సంస్కరించడం అవసరం.

### విద్యా విధానాన్ని సంస్కరించాలి

విద్యాలయాలు వ్యక్తిత్వాలను తీర్చిదిద్దే కర్మాగారాలు. విద్యాలయాలలోని వాతావరణం, అధ్యాపకుల వ్యక్తిత్వాలు, పాఠ్య ప్రణాళిక, సువ్యవస్థ ఇవన్నీ విద్యార్థుల మనస్సులను ప్రభావితం చేస్తాయి. విద్యార్థుల భవిష్యత్తును చాలావరకు రూపుదిద్దుతాయి. విద్యార్థులు శీలవంతులుగా, కార్యశూరులుగా, నాగరికులుగా, సేవానిరతులుగా, చక్కని పౌరులుగా తయారయ్యేందుకు అనువుగా విద్యావిధానాన్ని సంస్కరించేందుకై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. నైతిక బోధన విద్యలో అంతర్భాగం కావాలి. నైతిక, సాంస్కృతిక భావనలతో విద్యాలయాల వాతావరణం నిండిపోవాలి. ఇందు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

ఐశ్వర్యవంతుడుగా ఎదగాలనుకొన్నవానికి ప్రాణాయామ ప్రక్రియ తప్పనిసరి.

## దురాచారాల నిర్మూలన

సాంఘిక దురాచారాలు నైతిక నేరాలకన్నా మరింత హాని కలిగిస్తాయి. మానసిక బలహీనతవల్ల వాటిని అనుసరిస్తాం. కాని వాటివల్ల సమాజానికి జరిగే అపకారం ఇంతా అంతా కాదు. కనుక, ఈ దురాచారాలను నిర్మూలిస్తూ శాసనాలు అమలు జరగాలి. స్వర్ణ నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలుచేస్తే, నగలపై వ్యామోహం కొద్ది వారాలలో నశిస్తుంది. వరకట్నం, బాల్య వివాహాలు, వేశ్యావృత్తి మున్నగువానిపై చట్టాలు ఉన్నాయి. కాని వాటి అమలు నామమాత్రంగా ఉంది. దానివల్ల న్యాయం, చట్టం నవ్వులపాలు అవుతున్నాయి.

కనుక, ఆయా చట్టాలను త్వరితగతిని, కఠినంగా అమలు చేయాలి. ఆ చట్టాలను కూడా మరింత కఠినం చేయాలి.

## చౌకగా, త్వరగా, సరళంగా న్యాయం

నేడు న్యాయం పొందడం కష్టంగా ఉంది. జాప్యాలు హెచ్చు. ఖర్చులు విపరీతం. పేదలు, అమాయకులు న్యాయాన్ని పొందలేక పోతున్నారు. దుర్మార్గులు ధనబలంతో న్యాయాన్ని తారుమారు చేయగలుగుతున్నారు. న్యాయవ్యవస్థలోని ఈ లోపాలను తొలగించాలి. వ్యక్తికి తేలికగా, త్వరగా, చౌకగా న్యాయం అందాలి. ఆ విధంగా న్యాయ వ్యవస్థను సంస్కరించాలి. న్యాయ శాఖలోని ఉద్యోగులకు ప్రజలను ఇబ్బందిపెట్టే అధికారాలు ఉండకూడదు. అప్పుడు లంచగొండితనం సహజంగా అంతమవుతుంది.

## నేరాలపట్ల కాఠిన్యం

ప్రభుత్వం నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలి. కొద్దిపాటి శిక్ష, కారాగారాలలో మితిమీరిన సౌకర్యాలు అందడం వల్ల ఖైదీలు సంస్కరించబడరు. నిర్భయులుగా తయారై తిరిగి వస్తారు. కారాగారాలలో సంస్కరించే వాతావరణం ఉన్నదా? కారాగారాలలో ఇబ్బందులు లేకపోతే, నేరస్థులు వాటికి జంకకుండా మరిన్ని నేరాలు చేస్తూపోతారు. రష్యా మున్నగు దేశాలలో నేరస్థులకు కఠిన శిక్షలు అమలు జరుగుతున్నాయి. ఆ దేశాలలో ప్రజలు నేరం చేయడానికి భయపడుతున్నారు. ఈ భయం తగ్గితే, తొలగితే ఆ నేరాలు తప్పక పెరుగుతాయి. కనుక, కొద్దిపాటి శిక్షణ విధించే చట్టాలు, కారాగారాలలో మితిమీరిన సౌకర్యాలు శీల నిర్మాణం దృష్ట్యా హాని కలిగిస్తాయి. ఈ వాస్తవాన్ని గుర్తించేటట్లు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

చట్టం నుండి తప్పించుకునే సమాజ వ్యతిరేక గూండా శక్తుల నేర ప్రవృత్తిని నిరోధించడానికై ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని నిర్మించాలి. ఉన్నత ఆదర్శాలు కలిగి, పరీక్షలో నిలిచిన వ్యక్తులే దానిలో గూఢచారులుగా ఉండి వాస్తవిక పరిస్థితులపై నిఘా ఉంచాలి. ఈ యంత్రాంగం చేసిన దర్యాప్తు ఆధారంగా గూండా శక్తులను నిర్వీర్యం చేయాలి. దౌర్జన్యం, ధనం, చాతుర్యం ఉపయోగించి నేడు నేరస్థులు చట్టం నుండి తప్పించుకుంటున్నారు. ఈ అవకాశం ఉండకూడదు. న్యాయస్థానాల ద్వారానేకాక, వాస్తవిక పరిస్థితిని దర్యాప్తు చేసే ఉన్నతస్థాయి దర్యాప్తు సంఘం సూచనలు ఆధారంగా కూడా శిక్ష విధించే ఏర్పాటు ఉండాలి.

## అధికారుల నిజాయితీ

నేర నిరోధక శాఖ అధికారులను నియమించేముందు వారి నిజాయితీని, విశ్వసనీయతని దీర్ఘకాలం పరీక్షించవలసి ఉంటుంది. నేరాన్ని నిరోధించటంలో వారి భావన, ప్రతిభ ఎలాంటివో కూడా పరీక్షించాలి. అనుభవంలేని కుర్రవాళ్ళను నేరనిరోధక శాఖ పదవులలో సరాసరి నియమించడం, వారి శీలాన్ని గురించి రహస్య దర్యాప్తు జరగకపోవడంలాంటివి పరిపాలనలో అవినీతిని సృష్టిస్తాయి. విద్యార్హత, యోగ్యతలతో పాటు అనుభవానికి, శీలానికి ప్రాధాన్యం ఇచ్చి, ఆయా పాత్రతలన్నీ కలిగిన వారినే అవినీతి నిరోధానికి అవకాశం ఉన్న ఉద్యోగాలలో నియమించాలి. నేరం చేసిన అధికారులకు మామూలు శిక్షకన్నా ఇరవై రెట్లు శిక్ష వేసే ఏర్పాటు చట్టంలో ఉండాలి. అధికారులలో అవినీతి అంతం కానంతవరకూ ప్రజలలో అవినీతి అంతం కావడం కష్టం.

## ఆర్థిక అసమానత తగ్గాలి

ఆర్థిక అసమానతలపై, దుబారా ఖర్చులపై అదుపు ఉండాలి. ప్రధానంగా ఆర్థిక కారణాలవల్లనే నేరాలు పెరుగుతున్నాయి. కనుక, తన బ్రతుకుదెరువు చక్కగా సాగేందుకు అవసరమైనన్ని ధన సంపాదన సాధనాలు ప్రతివ్యక్తికి అందాలి. అధిక వినియోగంపై, అధికంగా కూడబెట్టడంపై పరిమితులు విధించినప్పుడే ఇది సాధ్యపడుతుంది. బట్టల మిల్లులలో వస్త్రాల డిజైన్‌ల సంఖ్య తగ్గితే, వస్త్రాల ఖర్చు తగ్గుతుంది. అలాగే, అవసర వస్తువుల సంఖ్యను, వైవిధ్యాన్ని పరిమితం చేయాలి. ఉత్పత్తికి ఒక జాతీయ స్థాయిని నిర్ణయించాలి. దానిలో కొద్ది తేడాలు ఉండవచ్చు. కాని ఆకాశానికి భూమికి, ఏనుగుకు దోమకు ఉన్నంత తేడా ఉండకూడదు.

సామూహికత, సమతల ఆధారాలుగా సమాజాన్ని పునర్నిర్మాణం చేయాలి. అందువల్ల నేరాలు సహజంగానే బాగా తగ్గిపోతాయి.

★★★

ప్రాణాయామం చేయుట వలన విషయం అర్థం కాకపోవడమంటూ ఉండదు.

బోధకథ

# భగవానుని సన్నిధిలో...

జేతవనం అంతట అలౌకికమైన ఒక సుగంధం వ్యాపించి ఉంది. అపురూపమైన ఆ కమల గంధం బుద్ధభగవానుని దివ్య దేహం నుండి ప్రవహిస్తోంది. నిరంతర తపోసాధన భగవానుని దేహాన్ని అన్ని విధాలా దివ్యంగా చేసింది. ఆయన ఎక్కడ ఉంటే ఆ స్థలం సువాసనతో నిండిపోతుంది. వెలుగుల వెల్లువ ఆ స్థలాన్ని ఎల్లప్పుడూ ఆవరించి ఉంటుంది. విలక్షణమైన ఆ వెలుగులో భగవానుని తపస్సు, జ్ఞానముల రశ్మి మెరుస్తూ ఉంటుంది. దాని సంపర్కంలోకి వచ్చిన ప్రతి వ్యక్తి శాశ్వతంగా ఆయన వాడు అయిపోతాడు. అతడు కోరుకున్నా, కోరుకోకపోయినా భగవానుని ప్రేమ పాశంలో బందీ అయిపోతాడు. ప్రభువు తనవాడు, ఆయనను మించిన శ్రేయోభిలాషి మరొకరు లేరు అనే సత్యం అతడికి సహజంగా అనుభవం అవుతుంది.

భగవానుని ఈ సహజ కరుణ, వారి అపరిమిత ప్రేమ, ఆయన అపురూప వాత్సల్యం వారి వ్యక్తిత్వం నుండి సుగంధంగా, వెలుగుల వెల్లువగా ప్రవహిస్తూ ఉంటుంది. బుద్ధ భగవానుడు తన వ్యక్తిత్వంతో, తన వేయి చేతులతో లక్షలాది వరాలను పంచుతుంటారు. వారి ఉనికి ఆశీస్సుల వానగా, కృపా వర్షంగా వ్యక్తం అవుతూ ఉంటుంది. అందులో తడిసిన వారి వ్యక్తిత్వాలు ధన్యములు అవుతాయి. అయినా కొందరు దురదృష్టవంతుల చెడు సంస్కారాలు ఈ ఆశీస్సులు, ఈ దయామృతం వారికి అందకుండా చేస్తున్నాయి. వారి దుష్ట ప్రవృత్తులు అందుకు అవరోధాలుగా నిలుస్తున్నాయి. తమ వంచనయే వారిని బుద్ధ భగవానుని కృపకు దూరం చేస్తోంది. ఒక్కోసారి ఈ పరిస్థితి అతి దారుణంగా, అతి దుష్కరంగా పరిణమిస్తుంది. వారు భగవానుని ఉనికిని చూసి అసూయ చెందుతూ ఉంటారు.

తథాగత భగవానుని పేరు ఈ సంకుచిత బుద్ధులను భయ భ్రాంతులను చేస్తుంది. ఆయన అస్తిత్వం మానవ జీవనంలో ఆ మూలాగ్ర విప్లవానికి మారుపేరు. తమ జీవితంలోని క్షుద్రత్వాలను వదలలేక వాటిని అంటిపెట్టుకుని ఉండే జనం భయభీతులై, భగవానునికి దూరంగా ఉండడమే మంచిదని భావిస్తున్నారు. అంతే కాదు. తమ పిల్లలను కూడా ఆయనకు దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నారు. బుద్ధుని గాలి కూడా తమకు సోకకుండా జాగ్రత్త పడవలసిందిగా ఇలాంటి జనం తమ పిల్లలను కట్టడి చేశారు. బుద్ధునికి కాని, ఆయన భిక్షువులకు కాని ఎన్నడూ ప్రణామం చేయము అని తమ పిల్లల చేత ఒట్లు వేయించుకున్నారు.

అయినా జేతవనం నుండి వెలువడుతున్న సుగంధం ఆ పరిసరాలలో నివసించే పిల్లల లేత మనసులలో వారికి తెలియకుండానే ప్రవేశించింది. కల్లాకపటం లేని వారి హృదయాలు ప్రభువు వెలుగుతో అప్రయత్నంగానే నిండిపోయాయి. ఏదో అదృశ్య చైతన్యం తమను జేతవనానికి ఆహ్వానిస్తున్నదని వారికి తరచుగా అనిపించేది. అయితే తమ తల్లిండ్రుల కట్టడి వారిని నిస్సహాయులను చేసింది. జేతవనంలోకి వెళ్ళవద్దని మన తల్లిదండ్రులు మనపై ఆంక్ష విధించారు. నిజమే. కాని దాని పరిసరాలకు వెళ్ళవద్దని వారు చెప్పలేదు కదా. ఆ చుట్టుప్రక్కల ఆడుకుంటే తప్పేముంది? అని ఒకరోజు ఆ పిల్లలలో ఒకడు తన మిత్రులకు సూచించాడు. పిల్లలకు ఆ మాట నచ్చింది. వారంతా జేతవనం బయట ఆడుకోవడం మొదలుపెట్టారు. అలా ఆడగా ఆడగా వారికి దాహం వేసింది. అలసట కలిగింది. ఈ దాహంలో ఈ అలుపులో వారు తమ పెద్దల మాట మరచి పోయారు. మంచినీళ్ళకోసం వెదుకుతూ వారు జేతవనంలోకి ప్రవేశించారు. అదృష్టం కలసి వచ్చి వారలా ప్రవేశించడంతోనే వారికి భగవానుని దర్శనం లభించింది. భగవానుడు వారికి తన చేతులతో మంచినీళ్ళు ఇచ్చారు. ఎంతో ఆప్యాయంగా వారి చేత మిఠాయిలు తినిపించారు. భగవానుని సమీపించడంతో అలౌకికమైన ఆ వెలుగు, ఆ సువాసనా ఆయన నుండే వెలువడు తున్నదని వారు గ్రహించారు. కరుణావతారం అయిన తథాగతుని కరుణ, ప్రేమ, వాత్సల్యం వారందరినీ ముగ్ధులను చేశాయి.

ప్రభువు వచనాలు వారికి ఎంతో తృప్తినిచ్చాయి. తథాగతుడు క్షణకాలం పాటు చూపిన ప్రేమ తమ తల్లిదండ్రులు సంవత్సరాల తరబడి చూపిన ప్రేమ కన్నా మిన్న అని వారు అనుభూతి పొందారు. వారంతా ఆనందంతో తన్మయులైనారు. ప్రేమతో పులకించిపోయారు. అలాంటి ప్రేమ వారికి మున్నెన్నడూ తెలిసినది కాదు. సూదంటు రాయి వంటి ఆ ఆకర్షణ వారెన్నడూ ఊహించినది కాదు. అలాంటి అద్భుత ఆకర్షణ, అలాంటి అపూర్వ సౌందర్యం, అలాంటి అపూర్వ ఉత్సవహేల వారెన్నడూ చూచి ఎరుగరు. వారంతా తమ ఆటపాటలు మరచిపోయి రోజంతా భగవానుని దగ్గర ఉండిపోయారు. వారి ఆంతరిక చేతన భగవానుని సుగంధంలో తనను తాను మరచిపోయింది.

**క్రమశిక్షణాపరుడు కానిదే సంకల్పవంతుడు కాలేడు.**

భగవానుని కరుణ రసంలో వారు తడిసిపోయారు. తథాగతుని అలౌకికత వారి పసి హృదయాలను చూరగొన్నది.

అలా భగవానుని ప్రేమ వారికొక వ్యసనంగా మారింది. వారు రోజూ ఏదోవిధంగా ప్రభువు వద్దకు చేరసాగారు. క్రమక్రమంగా వారు భగవానుని వద్ద ధ్యానంలో కూర్చొనసాగారు. అమాయకమైన వారి శ్రద్ధ చూడముచ్చట అయింది. ప్రభువుకు అంకితం కాసాగాయి వారి మనస్సులు, వారి ప్రాణాలు. ఎలాంటి పరిస్థితి ఏర్పడిందంటే వారు ప్రభువు వద్ద ఉన్నా, ఇంటిలో ఉన్నా వారి భావ చైతన్యం ప్రభువు చుట్టూ పరిభ్రమిస్తూ ఉండేది.

చివరికి వీరి ఉన్మత్త స్థితి వీరి తల్లితండ్రుల దృష్టికి వచ్చింది. వారు కోపంతో ఊగిపోయారు. వారి క్రోధం కట్టలు త్రెంచుకుంది. తాము ఎంతో గారాబంగా పెంచిన తమ పిల్లలను వారు చావబాదారు. కుల పురోహితులు ఆ పిల్లలకు నచ్చచెప్పారు. వారిని సముదాయించారు. వారిని భయపెట్టారు. నయానా, భయానా చెప్పి చూచారు. ఆ చిన్న పిల్లల మీద సామ దాన భేద దండ ఉపాయాలను ప్రయోగించారు. అయినా వారి హృదయాల లోతులలోకి చేరుకున్న భగవానుని అలౌకిక ప్రేమ ఏ మాత్రం తగ్గలేదు. వారి నిశ్చల హృదయాలపై పడిన బుద్ధుని ముద్ర ఏ మాత్రం చెక్కుచెదరలేదు.

పిల్లల తల్లిదండ్రులు ఏడుపులు, పెడబొబ్బలు సాగించారు. వారి కోపతాపాలు పెరిగిపోయాయి. భ్రష్టుడైన గౌతముడు అమాయకులైన తమ పిల్లలను కూడా భ్రష్టు పట్టించాడని వారు అడిగిన వారికి, అడగని వారికి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. ఈ కోపం పెరిగి పెరిగి వారు గంగవెర్రులు ఎత్తిపోయారు. తమ పిల్లలను వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒకరోజున తమ పిల్లలను అప్పగించవేయడానికై బుద్ధుని వద్దకు వెళ్ళారు. అలుక, కోపం, ఆక్రోశం నిండిన మనస్సులతో వారు జేతవనంలో అడుగు పెట్టగానే ప్రభువు వెలుగు, ప్రేమ, సుగంధం వారిని క్రమ్ముకున్నాయి. భగవానుని సన్నిధిలో వారి జీకటి జీవితాలలో జ్యోతులు వెలిగాయి. ఆశ్చర్యంలో మునిగిన ఆ తల్లితండ్రులందరికి భగవానుడు ఈ ధర్మ వచనాలను వినిపించారు.

**అవజ్జే వజ్జమతినో వజ్జే చావజ్జదస్సినో ।**
**మిచ్ఛాదిట్ఠిసమాదానా సత్తా గచ్ఛంతి దుగ్గతి ॥**
**వజ్జంచ వజ్జతో త్రత్వా అవజ్జం చ అవజ్జతో ।**
**సమ్మాదిట్టి సమాదానా సత్తా గచ్ఛంతి సుగ్గతిం ॥**

అనగా –

అదోషంలో (దోషం లేనిచోట) దోషదృష్టి ఉన్నవారు, దోషంలో అదోష దృష్టి కలిగిన వారు మిథ్యా దృష్టిని అలవరచుకుని దుర్గతి పొందుతారు.

దోషాన్ని దోషంగా, అదోషాన్ని (దోషం లేనిది) అదోషంగా తెలుసుకున్న వ్యక్తులు సమ్యక్ దృష్టిని కలిగి సుగతిని పొందుతారు.

ఈ చిన్న సూత్రాలు రెండింటిని ఇచ్చి, ప్రభువు వారికి సమ్యక్ దృష్టిని ప్రసాదించారు. బుద్ధ భగవానుని వద్దకు చేరినప్పుడు మన ఆంతరిక భావనలు ఎలా ఆయనవే అవుతాయో వారికి అనుభవం అయింది.

## శ్రీ గాయత్రీ శతకం

**77. *వాసుదేవ, ప్రజాపతి, వాయువాది***
***సురలిరువది నలుగురితో వరలుచున్న***
***రాజమంత్రమున్ పఠియింప రక్షజేయు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:– గాయత్రీ మంత్రములో గల 24 అక్షరాలు 24 దేవతల శక్తిబీజాలు. అవి : అగ్ని, ప్రజాపతి, చంద్ర, ఈశాన, సావిత్రి, ఆదిత్య, బృహస్పతి, మిత్రావరుణ, భగ, ఈశ్వర, గణేశ, త్వష్టా, పూషా, ఇంద్రాగ్ని, వాయు, వామదేవ, మైత్రావరణ, వైశ్వదేవ, మాతృక, విష్ణు, వసుగుణములు, రుద్రగణములు, కుబేర, అశ్వనీకుమారులు. ఇట్టి మంత్రమును నిత్యం స్మరిస్తే సాధకుని ఎల్లవేళలా రక్షిస్తుంది విశ్వజనయిత్రి.*

**78. *రామకృష్ణాది అవతార నామములను***
***అరయనిరువది నాలుగు అమరియుండి***
***కొలుచువారికి సద్బుద్ధి గూర్చుచుండు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:– గాయత్రీ మంత్రములో గల 24 అక్షరాలలో దేవదేవుని 24 అవతారములున్నవి. అవి : నారాయణ, హంస, యజ్ఞపురుష, మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, నారద, ధన్వంతరి, సనత్కుమార, దత్తాత్రేయ, కపిల, ఋషభదేవ, హయగ్రీవ, మోహిని, హరి, ప్రభు, రామ, కృష్ణ, వ్యాస, బుద్ధ, నిష్కళంక ప్రజ్ఞ. ఇట్టి దేవిని నిత్యం కొలుచువారికి సద్బుద్ధిని కలిగిస్తుంది.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**మీలోని లోటుపాట్లతోపాటు ఉన్న అర్హతలను గుర్తించండి.**

స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేకం

# మానవజాతి పాలన, సభ్యతకు జన్మస్థలి భరతభూమి

ఆర్యుల ప్రప్రథమ నివాసస్థలి రూపంలో భారతభూమి మరియు దాని ప్రాచీన వైదిక సభ్యత యొక్క ప్రామాణికత విషయంలో అందరు ఏకాభిప్రాయమును కలిగి ఉన్నారు అన్నది సత్యము. జ్ఞాన-విజ్ఞానములకు చెందిన విభిన్న ధారలుకూడా ఈ తథ్యమునే సత్యమని ప్రామాణీకరిస్తున్నాయి. దీని ప్రాచీనతకు చెందిన ప్రమాణాలు ఖగోళవిద్యలో అనగా జ్యోతిర్విద్యలో కూడా లభ్యమౌతాయి. డేవిడ్‌ఫరాలె రచించిన 'గాడ్ సేవ్స్ కింగ్స్' పుస్తకంలో వైదిక సంక్రాంతి (equinox) లేదా విషన్/సాయన అంతరిక్ష సంఘటనల వర్ణనలు వస్తాయి. వాటి కాలవ్యవధి క్రీ.పూ. 4000 నుండి 6000 మధ్య అని చెబుతారు. భారతీయ జ్యోతిర్విద్వాంసుడు కె.జి. సిద్ధార్థకృష్ణ యజుర్వేదంలో క్రీ.పూ. 8500 కాలంలో రమారమి ఒక సోలిస్టైస్ (solistice) సంభవించినదని స్పష్టంగా చెప్పిన సంగతిని గుర్తించారు. ఋగ్వేదం అంతకంటే ప్రాచీనమైనది అని ఈ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. బ్రాహ్మణములు, సూత్రములు దీని తరువాత క్రీ.పూ. 3000 సంవత్సముల క్రితము రచించబడినవి అని చెప్తారు.

గణితవిజ్ఞానం ద్వారా కూడా వైదికసభ్యత యొక్క పురాతనత వెల్లడౌతున్నది. 'పాలిటిక్స్ ఆఫ్ హిస్టరి' అను పుస్తకంలో రాజా రామ్‌గారు, సైడెన్‌వర్గ్ అను అమెరికా గణితశాస్త్రవేత్త ప్రాచీనకాలం నాటి ఈజిప్ట్, బాబిలోనియా మరియు గ్రీకుదేశాల జ్యామితీయ సులభసూత్రాలు భారతీయ గణితము నుండే తీసుకొనబడ్డాయి అని చెప్పారు. ఈజిప్ట్ మరియు బాబిలోనియా సామ్రాజ్యాలలో జ్యామితులు అను సులభసూత్రాల రచన క్రీ.పూ. 2000 సంవత్సరములోనే చేశారు. అనగా సులభసూత్రాల రచన క్రీ.పూ. 2000 సంవత్సరాల కంటే ముందరే జరిగినది అనే విషయము తేటతెల్లమౌతున్నది. ఆ కాలంలో వికసించిన సింధు-సరస్వతి సభ్యతల అద్భుత వ్యవస్థలోను మరియు పూజామందిరాలలోను జ్యామితీయరేఖా గణితపు ఆనవాళ్ళు లభించాయి.

ధాతువిజ్ఞానము ద్వారా కూడా వైదికయుగపు ప్రాచీనతా ప్రమాణాలు లభిస్తున్నాయి. ఒక అమెరికా దేశస్థునికి 1956 లో ఢిల్లీలో ఒక ప్రాచీన నాణెము దొరికింది. అది క్రీ.పూ. 3,700 నుండి 3,800 సంవత్సరముల క్రిందటిది అని అనేక ప్రయోగాల ఫలితాలు ఋజువుచేస్తున్నాయి. దీనిమీద ఒక తేజస్వియైన ఋషి ముఖకమలం ముద్రించబడి ఉన్నది.

భారతీయ పరంపరలో వేదాలు అతి పురాతనమైనవి. మాక్స్ ముల్లర్ అర్ధ, అసంపూర్ణ తథ్యముల ఆధారంగా వీటిని కేవలము క్రీ.పూ. 1200 సంవత్సరముల నాటివని చెప్పాడు. అయితే సింధు-సరస్వతి సభ్యతల అసందిగ్ధమైన వైదిక చరిత్ర వీటికంటే కనీసము క్రీ.పూ. 4,000 సంవత్సరములదని నిర్ధారించారు. కొంతమంది సాహితీవేత్తలు వీటిని క్రీ.పూ. 5,000 సంవత్సరముల నాటివని వ్రాక్కుచ్చారు. జ్యోతిర్విజ్ఞానము వీటిని క్రీ.పూ. 9,000 సంవత్సరముల కంటే పురాతనమైనవని చెప్తున్నది.

భారతీయుల ప్రాచీనతకు సంబంధించి వాల్టేయర్ ఇలా చెప్పాడు. 'మా పూర్వులు అడవులలో ఆటవిక జీవితమును గడుపుతున్నప్పుడే భారతీయులు సభ్య జీవితమును గడిపారు.'

కానీ మన సభ్యత ఋగ్వేదకాలం కంటే పురాతనమైనది. ఎందుకంటే ఋగ్వేదమంత్రధారలో ప్రాచీన ఋషులు పితృదేవతల రూపంలో వర్ణించబడ్డారు. మహర్షి అరవిందుని అభిప్రాయమును అనుసరించి 'మన ఋషులు వ్రాసిన సంహితలు నిజానికి ఋగ్వేద కాలం యొక్క అంతిమ సమయమునకు ప్రాతినిధ్యం వహిస్తాయి తప్ప, ఆది-మధ్యమ కాలాలకు కాదు.' వేదవ్యాస మహర్షి ద్వారా సంకలనము చేయబడిన బృహత్‌గ్రంథాల సంగ్రహము అధిక సమృద్ధి, సంపన్నత కల ఆర్యుల మౌఖిక జ్ఞానమునకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది. విశ్వంలో మన అతి ప్రాచీన పరంపరలో 6,000 నుండి 8,000 సంవత్సరములు లేక అంతకంటే చాలా సంవత్సరముల ముందు నుండి జ్ఞానం మౌఖిక రూపంలో (ఒకరి నుండి మరొకరికి) శ్రుతి-స్మృతులుగా ఒక తరం నుండి మరో తరమునకు ప్రవహిస్తూ వస్తున్నది.

విజ్ఞానశాస్త్రము ప్రకారము ఆదిమానవుని నుండి మానవ సమాజము ఒక సరళరేఖ వలె వృద్ధిచెందుతూ వస్తున్నది. కానీ శ్రీఅరవిందుల అభిప్రాయమును అనుసరించి 'ఫిజీద్వీపవాసుల నుండి ఆరంభమైన మానవ సభ్యత నేటి హెకల్ మరియు రాక్‌ఫెల్లర్ వరకు సాగినదని భావిస్తూ, పురాతన భారతీయ

**సాధువులు ప్రతీకారం తీర్చుకోరు, కాని గుణపాఠం చెప్తారు.**

సంస్కృతిని అర్ధవికసిత సభ్యత కల ఆదిమానవులుగా నిర్ణయిస్తారు అన్నది యూరోపియన్ పండితుల ఒక అవగాహన, ఊహ తప్ప మరేమీ కాదు. జ్ఞానయాత్ర తన సమగ్రరూపంలో ముందుకు సాగుతూనే ఉన్నది అన్నది నేటి ఆధునిక విజ్ఞానవేత్తల అంధ విశ్వాసము. వికసించిన సభ్యత యొక్క ఒక గొప్ప వైదికయుగం ఉండేదని, అది దేశకాల పరిస్థితులను అనుసరించి నశించి పోయినదని వారు గుర్తించాలి. అయితే ఈనాడు మనము గర్విస్తున్న భౌతిక సుఖ సాధనాలు ఆనాడు వారి దగ్గర ఉండి ఉండకపోవచ్చు. కానీ ఆ వైదిక కాలం నాటి జనుల వద్ద ఈనాటి భౌతిక సుఖసాధనాలకు మించిన మరింత గొప్ప శ్రేష్ఠమైన విషయము ఒకటుంది. ఈ సంకేతాలు బహుశః ఆధ్యాత్మిక సంపద దిశగా సూచిస్తున్నాయేమో! ఆ వికసించిన సభ్యత మీద కాంతులను ప్రసరింపజేస్తూ వివిధ రంగాలలో ప్రాచీన భారత వాసులు అందిపుచ్చుకున్న ఉపలబ్ధులు మరియు సమస్త ప్రపంచముమీదా అవి చూపించిన ప్రభావమును గురించి ఆలోచించవలసినదే'

బాబిలోనియా మరియు గ్రీసుదేశవాసులు గణితజ్ఞానమును భారతదేశము నుండే నేర్చుకున్నారు. భారతీయులు క్రీ.పూ. 3,000 సంవత్సరముల కంటే ముందే గణితశాస్త్రం ద్వారా ఎంతో ఉత్తమమైన లాభాలను, ఫలితాలను అందిపుచ్చుకున్నారు. భారతదేశంలో జ్యోతిష్యశాస్త్రము కూడా అతి ప్రాచీనకాలంనుండే వృద్ధిచెందుతూ వస్తున్నది. అయితే పాశ్చాత్యులు క్రీ.పూ. కొన్ని సంవత్సరముల ముందర ఇది వృద్ధిచెందినదని భావిస్తున్నారు. భారతీయ విద్యావేత్త సుభాష్‌కాక్ ఋగ్వేద ఋక్కుల గురించి పరిశోధనలు చేసి అనేక కొంగ్రొత్త విషయములను ఆవిష్కరించారు. 'ఆస్ట్రోలాజికల్ కోడ్ ఆఫ్ ఋగ్వేద' అనే తన పుస్తకంలో 'ఋషులకు సూర్య-చంద్రుల మధ్య దూరము సూర్యుని వ్యాసము కన్నా 108 రెట్లు ఎక్కువని తెలుసు. వారు బుధ, శుక్ర, కుజ, గురువనే గ్రహాల పరిమాణంతో సుపరిచితులే' అని వర్ణించారు. ఈజిప్ట్, గ్రీస్, బాబిలోనియావాసులకంటే కొన్ని వేల సంవత్సరములకు పూర్వమే భారతీయ ఋషులకు సౌరసంవత్సర కాల అవధి గురించి తెలుసు. ఆ కాలమును 365 లేక 366 రోజులుగా ఋషులు నిర్ధారించారు. వేల సంవత్సరముల పరిణామ క్రమంలో భాష క్షేత్రంలో సింధు-సరస్వతి లిపి ఒకవైపు, మరోవైపు బ్రాహ్మీలిపి వికసించింది అని నిరూపించబడినది. ఈవిధంగా ఈ లిపి ఖచ్చితంగా ఇతర లిపులన్నింటి ఉత్పత్తికి మూల హేతువుగా నిలుస్తున్నది అని స్పష్టమౌతున్నది.

ఈ ప్రకారంగా గణితమైనా లేదా జ్యోతిర్విజ్ఞానమైనా, భాష-లిపిలైనా లేక సున్నా అయినా, దశాంశమాన జ్ఞానమైనా, నేడు అందరికి ఆమోదయోగ్యమైన అరబ్బు (అరబ్ = వంద కోట్లు; ఖరబ్ = పదివేల కోట్లు) సంఖ్యలు అయినా లేక వర్ణమాల జ్ఞానమైనా ఏదైనాసరే అన్నీ భరతభూమి నుండే పుట్టినవే! యూరప్‌కు చెందిన 18 వ శతాబ్దము నాటి పండితులు, మేధావులు ఆర్షగ్రంథాల లోతుల లోలోపల దాగి ఉన్న జ్ఞానవిజ్ఞాన సమృద్ధిని కాంచి రోమాంచితులైనారు, ఆశ్చర్యచకితులైనారు. ఈ సందర్భమును పురస్కరించుకుని జర్మన్ విద్వాంసుడు డోహమ్ **"భారతదేశం మానవజాతికి శాసకురాలు, సభ్యతకు జన్మస్థలి"** అని చెప్పాడు. విలియమ్ మైకిన్టరో 'చరిత్ర అంతా భారతదేశమును జ్ఞాన విజ్ఞానములకు, కళలకు తల్లిగా చెప్తున్నది' అని వెల్లడించాడు. ఫ్రాన్స్‌కు చెందిన ప్రకృతి విజ్ఞానవేత్త పియరీ భరతభూమిలో అతి పురాతన సుదూర అవశేషాలు లభ్యమవుతాయని చెప్పారు. విదేశాల నుండి అనేకమంది ఇక్కడికి వచ్చి తమ జ్ఞానతృష్ణను తీర్చుకున్నారు. భరతభూమి జగద్గురువుగా సమస్త విశ్వమును తన ధర్మ జ్ఞానకాంతులతో ప్రకాశింపజేసినది. ఈజిప్ట్ మరియు గ్రీసు దేశాలు భారతదేశంనుండి జ్ఞానము ఆర్జించి ఈ దేశమునకు ఋణపడి ఉన్నాయి.'

1773 లో ఫ్రేగ్‌మేట్స్ హిస్టోరిక్యూస్ సర్ ఇన్దే అను పేరుగల పుస్తకమును రచించిన వాల్టేయర్ అందులో ఇలా వ్రాశాడు - '2500 సంవత్సరములకు పూర్వం పైథాగరస్ సామోస్ నుండి గంగానది ఒడ్డుకు జ్యామితీయ గణితమును అభ్యసించేందుకు వెళ్ళాడు. ఒకవేళ భారతీయుల విజ్ఞానము యొక్క ఖ్యాతి యూరప్‌లో చాలా కాలం నుండి వ్యాపించి ఉండి ఉండకపోతే అతను ఇంత సుదీర్ఘ యాత్రను చేసి ఉండేవాడు కాదు. భారతీయ విద్యాలయాలలో అంకగణితము, జ్యామితీయ గణితము మరియు జ్యోతిర్విద్యను బోధించేవారు అని మేము ఎప్పటినుండో అభిప్రాయపడుతున్నాము. అనాదికాలంనుండే వారికి భూమధ్య రేఖ గురించి తెలుసు, సంక్రమణము గురించి తెలుసు." భరత భూమిలో ఎన్నో సంవత్సరములు జీవించిన ఫ్రాన్స్‌కు చెందిన ఖగోళ విద్వాంసుడు లెజెంటిల్ 'భారతీయులు ఇంతటి జ్ఞానము నార్జించటానికి ఎంతో కాలమును వెచ్చించి ఉంటారు! ఈ జ్ఞానం గురించి చైనావాసులకు కూడా ఎటువంటి ఆకళింపూ లేదు' అని భారతీయ విజ్ఞానమును కాంచి, దానిని ప్రశంసించాడు. అదే సమయములో ఆశ్చర్యమునకూ లోనయ్యాడు. ఈ విజ్ఞానము గురించి ఈజిప్ట్‌వాసులకు మరియు గ్రీకులకూ ఏమీ తెలియదు.

**ఆధ్యాత్మికత ధైర్యవంతుల వల్లనే ఆచరింపబడుతుంది - పిరికివాళ్ళ వల్ల కాదు.**

జ్యోతిర్విద్య, ఖగోళవిజ్ఞానము, పునర్జన్మ మొదలైనవన్నీ మన ఈ గంగాతీరం నుండి పుట్టి అంతటా వ్యాపించాయి అని నా దృఢ విశ్వాసము. ఈ ఉపలబ్ధులన్నీ ఆర్యుల మౌలికతను సుస్పష్టంగా వెల్లడిస్తున్నాయి. అంతేతప్ప వారు విదేశీ సభ్యతను అందిపుచ్చుకుని అనుకరించారు అనే విషయమునకు ఇక్కడ తావులేదు.

'ద ఇన్వెజన్ దట్ నెవ్వర్ వజ్' అను పుస్తకమును వ్రాసిన మైకెల్ డెనినో ఆర్యులు పరుల సభ్యతను అందిపుచ్చుకున్నారు అను సిద్ధాంతమును ఆధారసహితంగా ఖండిస్తూ, సింధు-సరస్వతి సభ్యతలను విస్తృతంగా వెలుగులోకి తెస్తూ భారతీయ సభ్యత యొక్క ప్రాచీనతను, భిన్నత్వంలో ఏకత్వం ప్రస్తావిస్తూ ఇలా అన్నాడు- 'భారతీయ ఇతిహాసము యుగయుగాలుగా నిరంతరము ఉనికిని కలిగి ఉన్నది. క్రీ.పూ. 4,000 సంవత్సరముల క్రిందటే వైదికయుగం తన ప్రౌఢావస్థలో ఉన్నది. మొగ్గ పువ్వుగా వికసించినట్లు సింధు-సరస్వతి సభ్యతలు వైదికయుగం స్వాభావిక రూపము నుండి పూర్తిగా వికసించి, పల్లవించిన దశకు చేరుకున్నాయి. సరస్వతీనది ఎండిపోయిన తరువాత ఇది గంగా సభ్యత రూపంలో ప్రకటితమైనది. భౌగోళిక మరియు దేశకాల పరిస్థితుల మార్పుల మధ్య ఏవిధమైన సుస్పష్ట విభజనరేఖ లేదు. ఆర్యులు-ద్రవిడుల మధ్య కూడా భాష, సభ్యత మరియు ఇష్టదేవతల మధ్య ఏవిధమైన స్పష్టమైన విభజనా లేదు. సింధు-సరస్వతి భాగాలలో కొన్ని 4,000 సంవత్సరముల వరకు నిరంతరము వృద్ధిచెందుతూనే ఉన్నాయి. అప్పుడప్పుడూ అక్కడక్కడా తలెత్తిన ప్రకృతి ప్రకోపాలుతప్ప యుద్ధాలు లేదా ఆకస్మికమైన అడ్డంకులు వచ్చిన చిహ్నాలేమీ లేవు. దీనికి సంబంధించిన అన్వేషణలు కూడా ఈ తథ్యమునే బలపరుస్తున్నాయి. శ్రీఅరవిందులు 'ది ఫౌండేషన్ ఆఫ్ ఇండియన్ కల్చర్' అనే పుస్తకంలో ఇలా వ్రాశారు, 'భారతదేశంలో అతి పురాతనకాలం నుండే ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ఏకత్వము పూర్ణత్వమును సాధించినది. హిమాలయాలు మరియు రెండు సముద్రాల మధ్య వెల్లివిరిసిన మానవజాతి యొక్క మానవత్వము కూడా జీవనానికి ప్రాణంగా నిలిచింది.'

భారతభూమికి తనదైన ఒకానొక గౌరవాన్వితమైన గతమున్నది. దీని జ్ఞానవిజ్ఞాన ఉపలబ్ధులు స్వయంగా అద్వితీయమైనవి. దీని వెలుగులో విశ్వంలోని ఇతర సభ్యతలు కూడా ప్రకాశించాయి. ఇది ఖండించలేని సత్యం. **ఈనాడు సమస్త మానవజాతి ఘోర అంధకారము, అవిశ్వాసంలో పడి దారితప్పి తిరుగుతున్నది. మనం ఆత్మ-విస్మృతి కారణంగా దీన, హీన, దుఃఖ పతన, పరాభవ స్థితిలో పడి విలవిలలాడుతున్నాము. మనం మన లోపల విరాజమానమై ఉన్న శ్రేష్ఠత, దివ్యతల పక్షం వహించే ఆర్యత్వమును జాగృతము చేసుకొనవలసిన సమయము ఆసన్నమైనది. మనము కోల్పోయిన వర్చస్సును తిరిగి సాధించుకొని కేవలము మన దేశమునకు గౌరవమును సంపాదించి పెట్టడమే కాకుండా, వేలాది సంవత్సరములుగా మన భుజ స్కంధములమీద మోసిన ఈ భారమును ఇప్పుడు మనం మోస్తూ విశ్వ-కళ్యాణ కర్తవ్యమునుకూడా నిభాయించవలసి ఉన్నది. మన భూమికి తిరిగి పూర్వ వైభవమును చేకూర్చిపెట్టాలి. ఇదే మనందరి తక్షణ కర్తవ్యము, లక్ష్యము!!**

*- అఖండజ్యోతి, ఏప్రిల్ 2001*
*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## తాజ్‌మహల్‌ను మించిన మట్టి దిబ్బ

*షాజహాన్ గారాల పట్టి జహనారాకు, ఔరంగజేబు కుమార్తె జేమున్నీసాకు పిత్రార్జితంగా అంతులేని సంపద లభించింది. కాని రాబోయే రోజుల్లో ధనం కొరకు కుటుంబాలలో జరుగనున్న హత్యాకాండలను, కుతంత్రాలను గుర్తించి దుఃఖితులై తమ అంతిమ సమయంలో తమ సంపద యావత్తు పారమార్థిక కార్యక్రమాలకు వినియోగించి సూఫీ సంప్రదాయంలో చేరిపోయారు. చెడు కర్మలు ఆచరించే దుష్టులు, దుర్మార్గులు అయిన రాజులు చనిపోయిన తర్వాత కీర్తిమంతులు కావాలని ముందుగానే విలువైన సమాధులు కట్టించుకునే విషయం వీరికి ఎంతగానో బాధించింది. వీరిద్దరు కొద్దిరోజుల తేడాలో మరణించారు. తమను ఖననం చేయడానికి తమచోటును తామే నిర్ణయించుకుని దాని మీద కేవలం గడ్డి తప్ప మరే విలువైనవి ఉండకూడదని ఆదేశించారు. ఈ గోరీలు మట్టికుప్ప రూపంలో హజరత్ నిజాముద్దీన్ సమాధి ప్రక్కన ఇప్పటికీ ఉన్నాయి.*

*రాజవైభవం కంటే సత్ప్రయోజనానికి వినియోగించే సంపద సార్థకమైనది. ఆదర్శవాదానికి ప్రేరణనిచ్చే ఈ చిన్నమట్టి దిబ్బ తాజ్‌మహల్ కంటే అనేక రెట్లు ఉత్కృష్టమైనదని అనడానికి ఏ మాత్రం సందేహం లేదు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

**గురువుతో బాంధవ్యాన్ని ఏర్పరుచుకునేది జీవాత్మేకాని, అతని ధనం, ఐశ్వర్యం కాదు.**

ప్రగతిశీల స్వావలంబనం-1

# గ్రామాభివృద్ధి

గ్రామంలో ఉన్న చిన్న పిల్లలకు ముందుగా అధిక ప్రాధాన్యత ఇచ్చి వారి అవసరాలను తీర్చడానికి ప్రయత్నించాలి. ఎందుకంటే వారు బలహీనులుగా, అసమర్థులుగా ఉన్నందున వారి వికాసం దృష్టిలో ఉంచుకొని వారికి కావలసిన అవసరాలను ముందుగా తీర్చి తరువాత పెద్దలను గమనించవలసి ఉంటుంది. అలాగే రోగులు, అంగవిహీనులుగా ఉన్నవారిని కూడా ముందుగానే గమనించి వారికి అవసరమయిన వస్తువులను అందించడానికి ప్రయత్నం జరగాలి. ఎందుకంటే అభాగ్యులకు ముందుగా సేవను అందించి తరువాత గ్రామములోని పెద్దవారిని స్వావలంబ దిశలో బలోపేతం చేసి వారిని వారి కాళ్ళ మీద నిలబడటానికి కావలసిన సహాయ సహకారాలను అందించవలసి ఉంటుంది.

గ్రామాలలో నివసించే పేదవారు అక్షరజ్ఞానం లేక, పేదరికంతో, అపరిశుభ్రతతో, మూఢాచారాలతో మునిగి ఉంటారు. పల్లెలలో 80 శాతం ప్రజలు సరియైన తిండి, వసతులు లేక కనీస అవసరాలు తీరక నానా బాధలు పడుతుంటారు. కుటుంబ నిర్వహణకు కావలసిన వస్తు సామగ్రి కొరత బాగా ఉంటుంది. సంపన్న గ్రామాలలో ఉన్నవారు గాని, పట్టణ వాసులు గాని, లేక సంస్కర్తలు గాని పూనుకొని వారిని పైకి తీసుకు రావడానికి ప్రయత్నించకపోవుట వలన వారి జీవనానికి కావలసిన అవసరాలు తీరకుండా పోతున్నవి. విద్య, వైద్య సదుపాయాలే కాదు. కనీసం త్రాగటానికి మంచినీరు కూడా కరువైపోతుంది. కేవలం వ్యవసాయమే వారి ఏకైక ఆధారం. అదీకాక చిన్న కమతాల వ్యవసాయంతో సంవత్సరమంతా వారికి పని కూడా దొరకదు. వ్యవసాయ కూలీలకుగాని, రైతులకు గాని పొలం నాట్లు సమయంలోను పంటకోతలప్పుడు తప్ప మిగిలిన రోజులలో ఏ పనిలేక సోమరిగా రోజులు దొర్లించవలసి వస్తుంది. అలాంటప్పుడు వారిలో నిరాశా నిస్పృహలతో పాటు అనేక దుర్గుణాలు కూడా చోటు చేసుకుంటాయి. జీవించటానికి కావలసిన ఉపాధులు అందనంత వరకు గ్రామ వికాసం అనేది సాధ్యపడే విషయం కాదు. పేదవారి కడుపులు నిండకపోతే వారికి ప్రగతి గురించి ఎన్ని ఉపన్యాసాలు ఇస్తే ఏమి ప్రయోజనం? అసలే లేవలేని స్థితిలో ఉంటే వారు నిలబడాలనుకోవటం జరిగే పని కాదు. చిన్నపిల్లలలో సరియైన పోషకాహారం లభించనందున రోగులుగా, బలహీనులుగా ఉండి పోతున్నారు. అలాంటప్పుడు న్యాయబద్ధంగా, కరుణతో, మానవత్వంతో వారికి అవసరమయిన చేయూత అందించటం సభ్య సమాజం యొక్క కనీస కర్తవ్యంగా భావించవలసి ఉంటుంది. ప్రకృతి యొక్క నియమము ఏమంటే గోతుల మయమయిన భూమిని తనంతట తానే పూడ్చుతుంది. వర్షం కురిసినపుడు చుట్టు ప్రక్కల ఉన్న మట్టివచ్చి నీటితో కలసి ఆ కందకాలను పూడ్చుట మనం నిత్యం గమనిస్తూనే ఉంటాము. ఎత్తు పల్లాలతో కూడిన భూమి వ్యవసాయానికి పనికిరాదు. ఎప్పటికయిన సమతలంగా ఉంటేనే పంట పండుతుంది. అలాగే సమాజంలో ఒక వర్గం పేదవారిగా మిగిలిపోతే మరొక వర్గం ధనికులుగా రూపాంతరం చెందితే వారి మధ్య అగాధం ఉన్నట్లే కదా. అందువలన బీదవర్గాన్ని పైకి తీసుకొని వచ్చే ప్రయత్నాలు సమాజం ద్వారానే జరగాలి. ప్రభుత్వం వారి ఉన్నతిని ప్రణాళికల ద్వారా చేపడితే ధనిక పేద వర్గాల మధ్య కొంతలో కొంతయినా సమానత్వం పొందే అవకాశం ఉంటుంది. పల్లె ప్రజలను పేదరికం నుండి విడిపించటానికి మొదట ఈ కార్యక్రమాన్ని చేపట్టవలసి ఉంటుంది. దీనిలో పట్టణాలలోని ద్వేషాలు, దుర్భావనల యొక్క వాసనలు కూడా తాకకుండా చూడాలి. ఎవరయితే తమ కాళ్ళ మీద తాము నిలబడతారో వారు తమ పురుషార్థంలో తమ అవసరాలను తామే సమకూర్చు కొన్నప్పుడు ఇతరుల సహాయ సహకారాలు అవసరం ఉండదు. వెనుకబడిన వారిని పైకి లేపి అసమానతల నుండి సమానత్వం వైపు మారేలాగా పని చేయాల్సి ఉంటుంది.

గ్రామాల ప్రజలను అభివృద్ధిలోకి తేవటానికి పట్టణాల సమృద్ధి మీద అసూయ అనుమానాలతో కళంకాలు వేయటం జరుగుతున్నాయి. కాని కావలసినది వెనుకబడిన వర్గం వారి విషయంలోనే ఆలోచించవలసి ఉంటుంది. వానిని ఏ విధంగా పైకి తీసుకొని రావాల్సి ఉంటుందనే దాని మీదనే ప్రణాళికలు వేయాల్సి ఉంటుంది. మన శరీరంలో అనారోగ్యం వస్తే లేక ఏదైనా ఒక భాగం రోగగ్రస్తం అయితే ముందుగా ఆ అనారోగ్యం నుండి బయట పడటానికి ఆ అంగం యొక్క పరిస్థితిని బాగు చేయించుకొని మొత్తం శరీరం సంపూర్ణం ఆరోగ్యానికి కావలసిన శ్రద్ధ ఎలా తీసుకుంటామో అలాగే సమాజంలోని ఒక వెనుకబడిన వర్గాన్ని పై వర్గానికో చేరేలాగా చేయూతనందించి వారికి కావలసిన అన్ని అవసరాలను తీర్చటానికి అన్ని వర్గాల వారు మరియు

**లోకసేవచేయు వ్యక్తులు, స్వయంగా తమ పట్ల కఠినంగా, ఇతరుల పట్ల సరళంగా వ్యవహరించాలి.**

ప్రభుత్వం వారు సరియైన ప్రణాళికల ద్వారా చర్యలు తీసుకోవలసి ఉంటుంది. దాదాపుగా 80% ఉన్న గ్రామ ప్రజల యొక్క స్థితిగతులు బాగు చేయని పక్షంలో ఉన్నత వర్గాల వారి ఎక్కిరింతలు, నిందలపాలు కావలసి ఉంటుంది. వారి నిష్ఠూరాలు భరించవలసి ఉంటుంది. ఎందువలనంటే గ్రామాలు అభ్యుదయం చెందకపోతే పట్టణాలలో, ఫ్యాక్టరీలలో పనిచేసేవారు లేక ఇతర రకాలయిన సేవలు అందించే వారి సంపదలను చూసి ఈర్ష్య చెందే అవకాశం ఉంది. దాని వలన వర్గ పోరాటాలు జరిగే అవకాశం ఉంది. పక్షవాతం వస్తే దాని నివారణ కొరకు ముందుగా చర్యలు తీసుకొని ప్రాణాంతకం కాకుండా ఎలాగ చూసుకుంటామో అలాగే సమాజంలోని 80% గ్రామ ప్రజలకు ఉన్న ఇబ్బందులను తీర్చటం అనేది చూచుకోవాలి. గ్రామవాసులు, పట్టణవాసుల మధ్య ఈ అంతరాన్ని దూరం చేయకపోతే తారతమ్యాలు తారుమారయి పోయి ప్రభుత్వానికి ఎంతో భారం అవటం ఖాయం. అంతేగాక సమాజం అల్లకల్లోలంలో కూరుకు పోయే ప్రమాదం కూడా ఉంటుంది. కాబట్టి ఆ అంతరాన్ని పూడ్చుటకు అన్ని మార్గాలను అన్వేషించవలసి ఉంటుంది.

పట్టణ వాసుల రంగేళి జీవితాన్ని చూసి పల్లెవాసులు వారి విలాసవంతమయిన జీవిత ప్రత్యేకతలు గమనించి అసూయ చెంది, వారిలాగే తమకు లేదని పేరాశకు లోనవుతారు. గుడిసెలలో, పూరిళ్ళలో అసహ్యకరమయిన, దుర్గంధముతో కూడిన ఆవాసాలు పెరగటం, దానికి తోడు అధిక జనాభా పెరుగుదలను చూస్తాము. ఈ అధిక జనాభా పెరుగుదల వలన చుట్టుప్రక్కల మురికి కూపాలు తయారయి అందులో నివసించేవారు వ్యాధిగ్రస్థులవుతారు. అంతేకాకుండా మురికివాసులు జన సంఖ్య రోజురోజుకీ పెరగటం వలన వారిలో రకరకాలైన మానసిక వ్యధలతో దొంగలుగా, రౌడీలుగా సమాజంలో చీడపురుగులుగా మారడానికి ఎక్కువ అవకాశం ఉన్నది. మురికి కూపాలు జబ్బులకి తల్లి లాంటిది. అది ఎప్పుడూ పెరుగుతూనే ఉంటుంది. ఆ పెరుగుదలని ఎవరూ ఆపలేరు. పట్నవాసుల యొక్క విలాసాలు, జల్సాలు వెనుకబడిన వర్గం వారు కూడా పొందాలని తాపత్రయ పడటం ఒక ఖరీదైన వ్యసనముగా మారుతుంది. అప్పుడు పట్నాలలో ఉన్న జనసంఖ్య విపరీతంగా పెరుగుతుంది. ఆ పెరుగుదల ఆపటం కోసం చిన్న చిన్న ప్రయత్నాలు జరుగుతున్నప్పటికి కూడా పూర్తి సఫలత పొందలేక పోతున్నాము. ప్రతి పట్టణంలో జన సంఖ్య విపరీతంగా పెరుగుతుందని జనాభా లెక్కల ద్వారా మనకు అర్థం అవుతుంది. ఈ జనాభివృద్ధితోపాటు ప్రభుత్వం మరియు అనధికార క్షేత్రాల మీద ఒత్తిడి అదే నిష్పత్తితో పెరుగుతుంది. వీటన్నిటి వలన పెరుగుతున్న జనాభాకు త్రాగునీరు పంపిణీ అస్తవ్యస్థం అవుతుంది. రోడ్లు కూడా క్రిక్కిరిసిపోయి అనేక ప్రమాదాలు జరగటం రోజురోజుకీ ఎక్కువ అవుతున్నవి. ఈ పెరుగుతున్న జనాభా మందు మత్తులో జోగుతూ మానసికమైన బాధలు మర్చిపోడానికి ప్రయత్నిస్తూ మృగతృష్ణ లాంటి ఊహాలోకాలలో తేలిపోతుంటారు. రంగేళి జీవితం యొక్క తెరతొలగించి చూస్తే నరకం లాంటి దుర్గంధ జీవితాలు కనిపిస్తూ ఉంటాయి. సినిమా హాళ్ళు, వేశ్యా గృహాలు, హోటళ్ళు, వినోద విలాసాలతో కూడినవి ప్రగతి అనే భ్రమలో ఉంటున్నారు. దౌర్భాగ్య జీవితాలు చూడటానికి రోగగ్రస్తమైన పుండులాగా బయటికి కనిపించనప్పటికి లోన బాధాకరమైన చీముతో నిండి పగలటానికి సిద్ధంగా ఉండే పుండులాగా పట్టణాల భారీ పెరుగుదల అవాంఛనీయ సంఘటనల అవకాశం ఉన్నది. వాటిని త్వరగా అరికట్టడానికి రకరకాలైన చర్చలు ద్వారా మార్గాల కొరకు ప్రయత్నిస్తున్నారు.

ఇలాంటి అవాంఛనీయ పరిస్థితులు పట్టణాల పెరుగుదలకు ఎందుకు కారణం అవుతుంది అని ఆలోచిస్తే, గ్రామాలలో ఉన్న పేద ప్రజలు పట్టణాలకి వలస వచ్చి కూలీ నాలీ చేసుకుంటూ, కనీస అవసరాలు తీర్చుకుంటూ ఉండటానికి పుష్కలమైన అవకాశాలు ఉన్నందున, ఉల్లాసభరిత జీవితం గడపాలనే కోర్కెలు పట్టణాల పెరుగుదలకి కారణం అవుతుంది. దేశం యొక్క అభివృద్ధి కుంటుపడటానికి కారణంపైన పేర్కొన్న పరిస్థితులే.

గ్రామము అభివృద్ధి కార్యక్రమంలో 80% పేద ప్రజల కష్టాలను దూరం చెయ్యాలన్న, పట్టణాల జనాభా ఒత్తిడిని తగ్గించాలన్నా, సరియైన చర్యలు తీసుకుంటేనే తప్ప పెరుగుతున్న జనాభా యొక్క ఒత్తిడిని ప్రభుత్వం అరికట్టలేదు. ఈ అంతరాన్ని తగ్గించే ఒకే ఒక మార్గం ఏమిటనగా గ్రామాభివృద్ధితోపాటు పట్టణాల మీద పడిన ఒత్తిడిని తగ్గించాలంటే, ఈ రెండు క్షేత్రాలలో వ్యూహాత్మక చర్యలు తీసుకోవాలి.

ప్రకృతి సహకారముతో పాటు మానవుని సహృదయత సహాయ సహకారాలతో గ్రామము, పట్టణాల యొక్క అంతరాన్ని తగ్గించి, సమానత్వానికి కావలసిన చర్యల ద్వారా మనం ఈ కార్యాన్ని సాధించవచ్చు.

దేశ ప్రగతి కొరకు అనేక రకాలైన ఆలోచనలతో పాటు అనేక ప్రణాళికల మీద ఎన్నో చర్చలతోపాటు వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఆర్థిక వనరుల పెరుగుదల, ప్రచురణ విభాగం, ఉద్యోగస్థుల సంఖ్య ప్రగతికి సూచనలుగా అనుకోవలసి

**అజ్ఞానాన్ని, అభావాన్ని, నిరాసక్తిని తొలగించుకుంటే దుఃఖాన్ని దూరం చేసుకొనగలం.**

ఉంటుంది. రాజకీయవాదుల దృష్టిలో సరిహద్దుల యొక్క రక్షణ; అంతరాష్ట్ర సంబంధాలు ఉంటే, సామాన్య మానవుల దృష్టిలో అభివృద్ధి గురించి ఆలోచనలు ఉంటే, మఠాధిపతుల దృక్పథంలో పుణ్యం పెరగటానికి, పాపం తగ్గటానికి ప్రతిపాదనలు చేస్తూ ఈశ్వరుని మీద విశ్వాసంతో ఉంటేనే దేశ ప్రగతి సంభవ మవుతుందని అంటారు. వైజ్ఞానికులు మాత్రము పెరుగుతున్న జనాభా అన్ని అనర్థాలకు మూలకారణమని వారి వాదన. ఈ జనాభా పెరుగుదలను అరికట్టనిచో ఎలాంటి ప్రగతికి ఆస్కారము లేదు. సామ్యవాదములు ఈ అన్ని కష్టాలకి మూలము గ్రామ, పట్టణాల మీద ఉన్న వ్యత్యాసకు కారణం అని అంటున్నారు. ఈ విధమైన వాదోపవాదాలు ఎన్ని జరిగినప్పటికి విదేశాల యొక్క స్థితి ఎలా ఉన్నప్పటికి **భారతదేశంలో పల్లె ప్రజల అభివృద్ధి పైన మాత్రమే ప్రగతి సూత్రం నిర్ధారించబడి ఉంది. పట్టణాలలో ధనశక్తి కేంద్రీకృతమై ఉంటే గ్రామాలలో జనశక్తి కేంద్రీకృతమై ఉంది. 80 శాతం గ్రామ ప్రజల యొక్క అభివృద్ధి సంపూర్ణ దేశం యొక్క అభివృద్ధి అవుతుంది.** వెనుకబడిన ఈ వర్గం ఉపేక్షతకి గురయినప్పటికీ ప్రభుత్వం నిలబడటానికి ప్రధాన పాత్ర పోషించటం జరుగుతుంది. 80% ఓట్ల బలం ద్వారా ప్రజాతంత్ర పాలనలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. వారి అభివృద్ధి దేశం యొక్క అభివృద్ధిగా మారుతుంది. ఈ నిరుపేద గ్రామ ప్రజలు ధనవంతుల ఆధిపత్యంలో అణగతొక్కబడ్డారు. కాని సమస్త వెనుకబడిన వర్గం అభివృద్ధి ఏదైతే ఉందో అదే దేశాభివృద్ధికి మూల కారణం అవుతుంది. ఈ పేదవారు వెనుకబడిన వర్గంగానే మిగిలిపోతే దేశం యొక్క ప్రగతికూడా కుంటుబడుతుంది. ఆ విధంగానే దేశం యొక్క ప్రగతి గ్రామ అభివృద్ధితోనే ప్రారంభం అవుతుంది.

పెరుగుతున్న జనసంఖ్య యొక్క దరిద్రత అనేక సమస్యలకు మూలకారణము అవుతుంది. ప్రతి వ్యక్తికి పనితోపాటు ఆపన్న హస్తం దొరికినట్లయితే జనసంఖ్య పెరుగుదలలోని పరిణామాల గురించి పెద్దగా ఆలోచింపవలసిన పని ఉండదు. జనాభా పెరుగుదల వలన తనకి తన ప్రక్కవారికి అసౌకర్యం కలగాలని ఎవరూ కోరుకోరు. **జపాన్ దేశం చాలా చిన్నది అయినప్పటికీ ప్రజలందరూ కూడా దీక్షతో ప్రభుత్వం ద్వారా నియమించిన పనులలో ప్రతిపని నిస్వార్థంగా చేసినందున ఆ దేశం ప్రగతి మార్గాన పయనిస్తున్నది.** అలాగే ఇంగ్లండ్, ఇజ్రాయెల్, జర్మనీ దేశంలోని ఉత్పాదన పెంచటంలో ఎంతో సఫలత పొందాయి. అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరాయి. దీనికి విరుద్ధంగా విశాలమైన ఆఫ్రికా ఖండములోని ప్రజలు బీదరికంలో జీవించటం మనం చూస్తున్నాము. భారతదేశం గ్రామాల సమాహారంతో నిండి ఉన్నది. **గ్రామ జీవనానికి సౌకర్యవంతమైన పరిస్థితులు ఏర్పడి ప్రజలందరికి సంవత్సరము పొడుగునా చేతి నిండాపని దొరికే విధంగా దేశ పాలకులు ప్రణాళికలు రచించి వారి అభివృద్ధికి పాటుపడటం వలన మాత్రమే దేశ ప్రగతి ఆధారపడి ఉంటుంది.** దీనివలన పట్టణ అభివృద్ధి మీద ఎలాంటి ప్రతి బంధకాలు ఉండవు. ఇందువలన సంపూర్ణ గ్రామ వికాసంతో పాటు దేశం అభివృద్ధిలో పయనిస్తుందని మనం విశ్వసించవచ్చు.

– *అనువాదం :* చెన్నకేశవరావు

## బీదరికానికి మించిన తల్లి లేదు

*నాకు బీదవానిగా జన్మనిచ్చిన ఆ పరమాత్మకు కృతజ్ఞత తెలుపుకుంటున్నాను. బీదరికం జీవితంలోని అవసరాల యొక్క నిజమైన ప్రాధాన్యతను నాకు తెలిపింది. ఈ తల్లి నేర్పించిన విద్యవల్ల ఎన్నో అమూల్యమైన విషయాలు నేర్చుకున్నాను. అజ్ఞానమనే అంధకారంలో నన్ను వదలేయకుండా సత్యమనే వెలుగులో నిలబెట్టింది. బీదరికం నిజానికి స్వర్గలోకపు అప్సరస, తను ప్రేమించేవారి నరాల్లో ఆనందసాగరాన్ని ప్రవహింపజేస్తుంది. అటువంటివారి వెన్నుముక నిటారుగా, బాహువులు దృఢంగా మారిపోతాయి. బీదరికం కృప చూపించిన మనిషికి సంజీవనీ ఔషధం వంటి బహుమానాన్ని అందిస్తుంది. దానితో మనిషి కష్టాల్లో సుఖాన్ని, కోలాహలంలో ప్రశాంతతని అనుభవిస్తాడు. అతనికి ప్రపంచమంతా ఎంతో పవిత్రంగా, అందంగా, ఉల్లాసంగా కనిపిస్తుంది.*

*మానవ జీవితం కలహాలతో, క్లేశాలతో, పీడలతో నిండి ఉంటుంది. దుఃఖాలకు అంతే ఉండదు. అయినా మనము ఈ జీవితాన్ని ప్రేమిస్తాము. నిజానికి మనము బాధలను కూడా ప్రేమిస్తాము, ఎందుకంటే అవి చాలా వరకు సుఖాలతో పోలి ఉంటాయి. ఒక్కోసారి సుఖాలతో పాటు కలిసే వస్తాయి.*

*బీదరికాన్ని బాధగా భావించినా కూడా అది తల్లిలాగా మనలను లాలిస్తుంది. ప్రపంచంలోని సుఖాలన్నీ మనలను మురిపిస్తున్నప్పటికీ ఆ తల్లి వడి ఎప్పటికీ మనలను ఆదరించడానికి సంసిద్ధంగా ఉంటుంది. అటువంటి చక్కని తల్లిని మనమెందుకు ప్రేమించకూడదు?*

*నేను నా బీదరికపు జీవితాన్ని చాలా ప్రేమించాను. ఆ తల్లి వడిలో లభించినన్ని రత్నాలు మరోచోట లభించే అవకాశాలు చాలా తక్కువ.*

*– మహాత్మ అనాతొలే ఫ్రాన్స్*

**కుటుంబంలో కలహానికి బదులు ప్రేమ అంకురాన్ని నాటండి.**

# సింహవాహినియైన భవానీమాత సాధన ద్వారా మహాభాగులు కాగలరు

ఆదిశక్తి లీలాకథలోని 700 శ్లోకాలు ఈ సృష్టిసూత్రములోనే ఇమిడి ఉన్నాయి. అఖిలసృష్టికి చెందిన ఆరోహ, అవరోహణము లన్నింటిలోను, ప్రతి ఒక్క సంఘటనాక్రమములోను అంతెందుకు జీవితము, జగత్తుకు చెందిన ప్రతి కణములో కూడ ఈ దివ్యగాథ ధ్వని ప్రతిధ్వనులను వినగలము. ఆదిశక్తి జగన్మాత గాయత్రి విజ్ఞానమూర్తి. ఆమె వేదమాత, జ్ఞానదాయిని కూడా. ఆమెలో భావాలను లయము చెయ్యడమనే ఉపాసన ద్వారా లభించే ఆత్మీయ సాన్నిధ్యములో ఆమె విరాట్ స్వరూపము మనకు బోధపడుతుంది. ఆమెలోనే ఆలోచనలను లయము చెయ్యడమనే సాధన ద్వారా ఆమె యొక్క లీల రేఖామాత్రంగా కనపడుతుంది. మనస్సును కేంద్రీకరించి భగవతితో తాదాత్మ్యము చెందగలిగిన వారే మహామాయయైన గాయత్రి లీలలను చూడగలరు. ఆమె లీలలను దర్శించగలిగినవారు ఆమెను ఆరాధించడముతో తమను తాము మార్పుచేసుకొనగలరు. వారే వేదమాతను సకలరూపాల లోనూ చూసి ఆమెను సేవించగలరు.

ఈవిధమైన ఉపాసన, సాధన, ఆరాధనలతో కూడిన త్రివేణిలో నిత్యము స్నానం చేసే సాధకులు, త్రిపదా గాయత్రి రహస్యములను తెలుసుకొనగలుగుతారు. త్రిపదా గాయత్రి మూడు చరణములు వాస్తవానికి శ్రీదుర్గాసప్తశతి యొక్క మూడు చరిత్రలే అనే సత్యమును కూడా వారే అనుభూతిచెందగలుగుతారు. గాయత్రీ మహామంత్రములోని 24 అక్షరములు, శ్రీదుర్గాసప్తశతి యొక్క 700 శ్లోకాలలో ఇమిడి ఉన్నవనే విషయమును కూడా వారు గ్రహించగలరు. వారు తమ జీవితములో కష్టకాలం వచ్చినప్పుడు, క్లిష్టమైన క్షణాలలోను, వరదాయిని అయిన వేదమాత గాయత్రి తన భక్తులను దుర్గమమైన కష్టమునుండి రక్షించటానికి దుర్గ రూపమును ధరిస్తుందని కూడా వారు అనుభూతి చెందగలరు. పాలు నీరును విడదీయగలిగే విచక్షణా జ్ఞానం కలిగిన హంసను తన వాహనముగా చేసుకున్న హంస వాహినియైన గాయత్రీమాత ధర్మాచరణలో నిష్ఠను కలిగిన ధర్మమయమైన సింహమును వాహనముగా చేసుకొని సింహ వాహిని దుర్గగా రూపుదాల్చి, ధర్మమునకు కష్టమును కలిగించే ఆసురీ శక్తులను నాశనము చేయగలదు. ఈ జగత్తుపైన, జీవితము పైనా ఆపదలను కలిగించే క్రూరకర్మలతో వినాశనమును కలిగించే దుష్టశక్తులను ఆమెయే నిర్మూలించి వేయగలదు.

గతంలోకి వెళితే క్రీ.శ 1965, క్రీ.శ 1971 సంవత్సరము లలో పాకిస్తాన్ మన దేశము పైన ఆక్రమణ జరిపింది. అప్పుడు యుగద్రష్ట, యుగావతారస్వరూపులైన గురుదేవులు గాయత్రీ పరివార్‌కి చెందిన తన స్వజనులు, సంతానము మొదలగు వారందరినీ గాయత్రీమాతను దుర్గాస్వరూపములో ఆహ్వానించమని ప్రబోధించారు. అదే సమయములో గాయత్రీ మహామంత్రమును 'క్లీం' బీజముతో సంపుటీకరణం చేసి జపించమని కూడ సూచించారు. పరమపూజ్యగురుదేవులు ఆనాడు చేసిన మార్గ దర్శనము ఇప్పుడు కూడ అన్నివిధాలా ఆమోద యోగ్యమైనది. ఆ రోజులలో వారు చెప్పినది అప్పటి అఖండజ్యోతి సంచికలో చదువవచ్చు. ప్రస్తుతకాలములో కూడా దేశము, ప్రపంచము అనేక రకాల సమస్యల నెదుర్కొంటున్నది. వాటన్నింటిని సమూలంగా నశింపజెయ్యటానికి వరదాయిని, హంసవాహిని అయిన గాయత్రీ మాత తపస్సును స్వీకరించి సింహవాహినిగా మారవలసి వచ్చినా ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఆమె పుత్రులు, పుత్రికలు, సేవకులు, సంతానము, భక్తజనము అయిన మనమందరం ఆమెకు వాహనములమే!

వివేకపూర్ణమైన జీవనాన్ని గడుపుతూ సంపూర్ణమైన జ్ఞానమును, మోక్షమును ఆ తల్లినుండి మనం కోరుకున్నట్లయితే మన స్వరూపమే హంసవలె ఉంటుంది. అలాకాక క్లిష్టమైన, వ్యతిరేకపరిస్థితులతో పోరాడుతూ ధర్మంపట్ల స్థిరమైన విశ్వాసమును నిలుపుకొని ధర్మమునే ఆచరిస్తూ, దుష్కరమైన, దుర్ధర్షమైన తపస్సును సాగిస్తూ ధర్మం యొక్క విజయము కోసము కఠినమైన ఘర్షణకులోనై మహాసంగ్రామ మొనరిస్తూ ఉన్నట్లయితే కనుక మనం సింహరూపులమౌతాము. అప్పుడు ఆదిశక్తి వేదమాత సింహాలమైన మనలను స్వీకరించి సింహవాహినియై అపరిమితమైన సాహసమును, అనంతమైన శౌర్యమును, మహా విజయము అనే వరదానమును మనకు అనుగ్రహిస్తుంది. ఆ విజయము ఎవరో ఒక వ్యక్తికి మాత్రమే చెందదు. ఇది ధర్మమునకు లభించిన విజయం

వివేకమును ప్రసాదించే వరదాయిని యైన గాయత్రీమాతను శౌర్యసాహసములను, కష్టములను ఎదుర్కొనగలిగి మంచి శక్తి సామర్థ్యములను ప్రసాదించమని కోరినవారికి ఆదిశక్తి గాయత్రీ మాత సింహవాహినియై దర్శనమిస్తుంది. అనంత రూపాలను

**లోక సేవకుడు ఎల్లప్పుడూ నిరాడంబరంగా ఉండాలి.**

కలిగి ఉన్నప్పటికి ఆమె ఒక్కరే! గాయత్రీ మహా మంత్రము యొక్క 24 అక్షరములలో ఆమె 24 రూపములలో దర్శనమిస్తుంది. యుగద్రష్ట, యుగఋషియైన పరమ పూజ్య గురుదేవులు భారతదేశము యొక్క మొట్టమొదటి శక్తిపీఠ రూపములో 'బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్'ను స్థాపించేటప్పుడు విశ్వమాత 24 రూపములను ప్రతిష్ఠించారు.

ఇక్కడ ఆమె తన మూలరూపములో హంసవాహినిగా ఉంటూనే మహాసంకటములను నివారించటానికిగాను సింహ వాహినియైన భవానిగా కూడా అవుతున్నది. రూపములు ఎన్ని అయినప్పటికి తన సంతానమునకు ఆమె తల్లిమాత్రమే! వరదాయినియైన ఆ తల్లియొక్క సాధకులలో అత్యంత శ్రేష్ఠుడైన మార్కండేయ మహర్షి ఆమె దయను సంపూర్ణముగా అనుభూతి చెందాడు. సత్యయుగంలో మార్కండేయమహర్షి పొందిన ఆ అనుభూతిని తన శిష్యులకు సంతానమును ప్రసాదించటానికి గాను, కలికల్మషనాశకుడు, కల్కిరూపధారియై భగవంతుడైన మహాకాలుడు, జగన్మాతయైన భగవతితో సహా ఈ యుగములోనే వేంచేసి ఉన్నాడు. ఆ మహాశక్తిమంతుడు ఆ మహాశక్తి వారిరువురి లోకయాత్ర ప్రత్యక్షంగా లేనప్పటికి పరోక్షంగా ఆమె లీలాగాథ ఇప్పుడు కూడ జరుగుతూనే ఉన్నది. మధుకైటభులను, మహిషాసురుని సంహరించటానికి ఆమె ఇప్పుడు కూడా పరమ శివునితో కలిసి సన్నద్ధమై ఉన్నది. శుంభనిశుంభులను వారి సమస్త సేనాపతులను ఇప్పుడు కూడా నిర్జించటానికి ఆమె దృఢ సంకల్పంతో ఉన్నది.

వాస్తవానికి ఈ లీలాగాథ ఆమెదే! అంతర్దృష్టి, యోగదృష్టితో పాటు, ఆధ్యాత్మికశక్తి కలిగినవారు ఈ సత్యమును వీక్షించగలరు, వినగలరు, అర్థము చేసుకొనగలరు. శబ్దములు ఎలా ఉన్నప్పటికి యథార్థమేమిటంటే అదృశ్యంలో జరుగుతూ ఉన్న యుగ పరివర్తనకు చెందిన సత్యములే శబ్దరూపములో వెలువడు తున్నాయి అనే విషయమును ఇతరులకు కూడా అర్థమయ్యే విధంగా చెప్పవలెను. ఈ సత్యమనేది ఒక నాణెమైతే దానికి యుగప్రత్యావర్తన కారకమైన సృష్టిసత్యము ఒక వైపు ఉంటే, రెండవవైపు ఉన్న సత్యము సాధకులు. ఆదిశక్తి వేదమాత గాయత్రిని ఆరాధించే సాధకుల యొక్క అంతశ్చేతనలో ఈ సత్యములు వెల్లడౌతున్నవి. అందుచేత భ్రమలను తొలగించుకొని, ధైర్యంగా ఉంటూ ఆదిశక్తి గాయత్రి యొక్క రహస్యమయ చరిత్రను పఠించండి. ప్రస్తుతకాలంలో ఆమె మనకు ప్రసాదిస్తున్న చక్కని దృష్టితో వీక్షించండి. ప్రాచీనకాలంలో ఆమె దయతోనే మార్కండేయమహర్షికి ఇటువంటి దృష్టి లభించినది.

దీనిని పొందిన తరువాతనే మార్కండేయమహర్షి శ్రీదుర్గా సప్తశతి యొక్క ప్రథమచరిత్ర, మొదటి అధ్యాయములో, మొదటి శ్లోకంలో 'ఎనిమిదవ మనువుగా చెప్పబడే సూర్యపుత్రుడైన సావర్ణి యొక్క జన్మవృత్తాంతమును విపులంగా చెప్పి నాకు వినిపించ వలసినది' అన్నారు.

మార్కండేయమహర్షి చెప్పిన కథనాన్ని భక్తుడైన ఒక కవి ఈ క్రిందివిధంగా వ్రాశాడు.

**సూర్యపుత్ర సావర్ణి ఆఠవేఀ హోంగే జగమే మను విఖ్యాత ।**
**జన్మకథా విస్తారసహిత మై కహతా ఉన్‌కీ సునియే తాత ॥**

ఋషి యొక్క ఈ కథనమును ఆదిశక్తి లీలాగాథ యొక్క గత సంచికలో వివరంగా చెప్పడమైనది. దీని తరువాత రాబోయే మంత్రమయమైన గాథను మంత్రోచ్చారణ చేస్తూ సర్వశ్రేష్ఠుడైన మార్కండేయమహర్షి ఈ క్రిందివిధంగా చెప్తున్నారు.

**మహా మాయానుభావేన యథా మన్వంతరాధిపః ।**
**స బభూవ మహాభాగః సావర్ణిస్తనయో రవేః ॥ (1/1/3)**

అనగా మహామాయ యొక్క అనుగ్రహముతో మహాభాగుడైన ఆ సావర్ణి మన్వంతరానికి అధిపతియైన విధానమును ఇప్పుడు మీకు వినిపిస్తున్నాను' అని అర్థము. భక్తుడైన కవి దీనిని ఈ క్రిందివిధంగా అనువదించాడు.

**మన్వంతర్ కే అధిపతికైసే హుయే సునో వే సూర్యకుమార ।**
**ఆదిశక్తికీ అనుకంపాసే మహాభాగ సావర్ణి ఉదార ॥**

ఆదిశక్తి యొక్క సంతానమైన సాధకులకు ఈ గాథ లోతైన భావముతో పూరించబడిన మంత్రము వంటిది. ఈ మంత్రములో ఋషి, జగన్మాత యొక్క సాధనలో తత్పరుడైన వ్యక్తి మహా భాగుడౌతాడు' అనే సత్యమును స్పష్టంగా వెల్లడించారు. **ఆధ్యాత్మిక శాస్త్రములను అనుసరించి 1) ఐశ్వర్యము, 2) వీర్యము, 3) యశము, 4) శ్రీ, 5) జ్ఞానము, 6) వైరాగ్యము ఈ ఆరు భగములని చెప్పబడతాయి. ఈ ఆరింటిని సంపూర్ణంగా పొందగలిగిన వ్యక్తిని మహాభాగ అంటారు.** ఈ మంత్రములో 'మన్వంతర బభూవ' అనగా మన్వంతరమునకు అధిపతి అయ్యెను అని అర్థము. అయితే అసలు కథలోని సత్యమేమిటంటే రెండవ మన్వంతరములో సురథుడు, రాబోయే ఎనిమిదవ మన్వంతరానికి అధిపతి కాగలిగినట్టి వరమును పొంది ఉన్నాడు. అందుచే 'మన్వంతరమునకు అధిపతి అయ్యే అధికారమును పొందాడు' అని పైన చెప్పబడిన మంత్రమునకు భావార్థము తీసుకొనవచ్చు.

**బలహీన మనస్సు కలిగిన వ్యక్తికి, ప్రతి పనీ చాలా కష్టంగా అనిపిస్తుంది.**

ఈ కారణముగానే కొంతమంది వ్యాఖ్యానవేత్తలు, 'బభూవ' అనే శబ్దమునకు 'భవిష్యత్తులో జరుగుతుంది' అనే అర్థమును కూడా తీసుకున్నారు. సంస్కృతభాషా మర్మజ్ఞుల అభిప్రాయమును అనుసరించి **'భావిని భూత్వారోషం'** అని చెప్పబడింది. ఈ మంత్రము యొక్క సాధన 'ఆదిశక్తి యెడల చేయబడిన సమర్థ వంతమైన సాధన, సాధకునకు షడైశ్వర్యములను 'సమకూర్చ గలదు' అని సూచిస్తున్నది. ధైర్యపూర్వకంగా సాధన చెయ్యటం వలన సాధకుడు సమస్తమైన భౌతిక, ఆధ్యాత్మిక సంపదలకు అధికారి కాగలడు. దీనితోపాటు శ్లోకం యొక్క మంత్రపూర్వకమైన సత్యము, సాధనావిధానము ఈ క్రింద ఇవ్వబడినది.

### సాధనా విధానము :

**వినియోగము : ఓం అస్య "శ్రీమహామాయానుభావేన" ఇతి సప్తశతీ తృతీయ మన్త్రస్య శ్రీమార్కండేయ ఋషిః, భగవాన్ శ్రీసూర్య నారాయణదేవతా, క్లీం బీజం, జ్యోతిః శక్తిః, ఛిన్నమస్తా మహావిద్యా, రజోగుణః శ్రోత్రజ్ఞానేన్ద్రియం, శాన్త రసః, వాక్ కర్మేన్ద్రియం, ప్రశ్నస్వరం, భూతత్త్వం, విద్యాకళా, హ్రీం ఉత్కీలనం, సంజ్ఞోచిన్ముద్రా, మమజ్ఞాన భక్తి వైరాగ్య క్షేమ స్థైర్యాయురారోగ్య మభివృద్ధ్యర్థం శ్రీఆదిశక్తి మాతా గాయత్రీ రూపేణా యోగమాయా భగవతీ మహాదుర్గా ప్రసాద సిద్ధ్యర్థం చ నమో-యుత ప్రణవ-వాగ్బీజ-స్వబీజ లోమ విలోమ పుటితోక్త తృతీయ మన్త్ర జపే వినియోగః ॥**

### న్యాసః

| | |
|---|---|
| కరన్యాసము | షడంగన్యాసము |
| ఓం ఏం క్లీం అంగుష్ఠాభ్యాం నమః | హృదయాయనమః |
| ఏం నమోనమః తర్జనీభ్యాం నమః | శిరసేస్వాహా |
| మహామాయానుభావేన మధ్యమాభ్యాం నమః | శిఖాయై వషట్ |
| యథామన్వన్తరాధిపః అనామికాభ్యాం నమః | కవచాయహుమ్ |
| స బభూవమహాభాగః కనిష్ఠికాభ్యాం నమః | నేత్రత్రయాయ వౌషట్ |
| సావర్ణిస్తనయోరవేః కరతలకరపృష్ఠాభ్యాం నమః | అస్త్రాయఫట్ |

### ధ్యానం

**భాస్వద్-రత్నాఢ్య-మౌలిః స్ఫురధర-రుచా రఞ్జితశ్చారు కేశో ।**
**భాస్వాన్యో దివ్యతేజాః కర కమలయుతః స్వర్ణవర్ణాప్రభాభిః ॥**
**విశ్వాకాశావకాశో గ్రహ-గణ సహితో భాతి యశ్చోదయాద్రౌ ।**
**సర్వానన్ద-ప్రదాతా హరి-హర-నమితః పాతు మాం విశ్వ-చక్షుః ॥**
**విశ్వాద్యం విశ్వవన్ద్యం నిఖిలభయహరం పఞ్చవక్త్రం త్రినేత్రమ్॥**

### మంత్రం

**ఓం ఏం క్లీం నమః మహామాయానుభావేన, యథా మన్వన్తరాధిపః ।**
**సబభూవమహాభాగః సావర్ణిస్తనయో రవేః నమో క్లీం ఏం ఓం॥**

**1000 జపాత్ సిద్ధి-శర్కరాతిల ఘృతేన దశాంశ హోమః**

పంచదార, నువ్వులు, నెయ్యిని కలిపి అందులో పదవవంతు హోమము, గాయత్రీమహామంత్ర జపం 1000 చెయ్యాలి. గాయత్రీ విధానమును అనుసరించి అందులో పదవవంతు హోమము.

గాయత్రీమహామంత్రజప 10,000 గాయత్రి విధానేన దశాంశ హోమః।

10 మాలల గాయత్రి, 1 మాల సప్తశతీమంత్రము. ఈ విధంగా పదిదినముల విధానం తరువాత ప్రతి ఒక్కదానికి దశాంశముతో హోమము చేయాలి

**ఆధ్యాత్మిక ఫలశృతి :** సాధనలో ఎదురయ్యే విఘ్నములు తొలగుట, ఆధ్యాత్మిక ఐశ్వర్యము చేకూరుట.

**లౌకిక ఫలశృతి :** లౌకిక సంపదలు, ఉన్నత పదవులు ప్రాప్తించుట.

ఆదిశక్తి జగన్మాత గాయత్రీమాత సాధకుల సముఖంలో ఈవిధంగా అనేక ఆధ్యాత్మిక రహస్యార్థములు వెల్లడౌతుంటాయి. సాధనలోని గూఢమైన సత్యమును తెలిసినవారికి 'ఎల్లవేళలా సంపూర్ణంగా, నిష్కామపూర్వకంగా చేసిన సాధనయే సర్వోత్తమమైన' అన్న సత్యమును తప్పనిసరిగా తెలుసుకొన వలయును. సాధన నిష్కామంగా చేసినట్లయితే చిత్తశుద్ధితోపాటు అంతశ్చేతనలో అనేక ఆయామములు ప్రకటీకృతము కాగలవు. ప్రాపంచికమైన సమస్యలలో చిక్కుకుని కష్టాలతో బాధపడుతుండే వారికి గాయత్రీసాధనతోపాటు సప్తశతీ సాధనకూడా కలిసి చేసుకొనటం వలన బాధలనుండి కొంతవరకు ఉపశమనము కలుగుతుంది. తత్ఫలితముగా అతడు సహజముగానే తన మనోరథమును నెరవేర్చుకొనగలుగుతాడు.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 2009*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**డబ్బు సార్థకత లోకకల్యాణంలో ఉన్నది.**



## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-2

# భారత భాగ్య విధాత

భారతదేశ చరిత్రలోనే కాక విశ్వంలో కూడా 20వ శతాబ్దంలో అనగా గతించిన నూరు సంవత్సరాల కాలంలో ఎన్నో ఒడిదుడుకులతో కూడిన వినూత్నమైన మార్పులు సంభవించాయి. 1905లో బెంగాలు విభజనకు తీవ్రంగా స్పందించిన భారతీయ ప్రజలలో దేశభక్తి భావాలు వెల్లువెత్తాయి. విస్తృతార్థంలో ఇది భారతదేశంలో బ్రిటీష్‌వారి పరిపాలనలో ఎటువంటి మార్పులను తేలేకపోయినది. అటు పిమ్మట ఆరు సంవత్సరాల తదుపరి, 1911లో బెంగాలు విభజనను ప్రభుత్వం రద్దుగావించినప్పటికి, భారతీయులలో చెలరేగిన స్వాతంత్ర్య భావాగ్నిని ఇది చల్లార్చక పోగా, రాను రాను దాని తీవ్రతను పెంచింది. నిజంగా బెంగాలు విభజన భారతీయ యువకులలోని మనోభావాలను తీవ్రంగా ప్రభావితం గావించింది. దీనితో భారతీయులంతా ఏకమై, ఒకే త్రాటిపై నిలచి రౌలట్ చట్టాన్ని వ్యతిరేకించుట, జలియన్ వాలాబాగ్ హత్యోందంతాన్ని నిరసించుట, సహాయ నిరాకరణ ఉద్యమం, పౌర వ్యతిరేక ఉద్యమాలు, సత్యాగ్రహ ఉద్యమాలు సైమన్ కమీషన్ రాకను బహిష్కరించుట, క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టుట జరిగింది. వీటన్నింటి ఫలితంగా ఆగస్టు 15, 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది.

భారతదేశం నిజంగా స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నదా? అన్న ప్రశ్నకు దివ్య దృష్టిగల సిద్ధ పురుషులు సమాధానాన్ని చూచాయగా అందించారు. వీరి ప్రకారం "భారతదేశ స్వాతంత్ర్య ప్రకటన అనేది ఋషుల విస్తృత దివ్య ప్రణాళికలో ఒక అంశం. దీని ద్వారా ప్రపంచం ఆధ్యాత్మిక యుగంలోనికి ప్రవేశించనున్నది. ఈ నూతన యుగ ఆగమనానికి భారతదేశం ఒక విశిష్టమైన పాత్రను పోషిస్తూ విశ్వానికి ఒక విశిష్ట సందేశాన్ని అందించవలసి ఉన్నది. విశ్వ మానవజాతికి భారతావని ఒక నూతన దిశానిర్దేశాన్ని అందించ గలిగిన సత్తాను కలిగి ఉన్నది". భారతదేశ స్వాతంత్ర్యం, దైవీ ప్రణాళికలో భాగమైనచో, అసలు భారతదేశం బానిస దేశంగా ఎలా మారింది? అనేది మరో పెద్ద ప్రశ్న. దీనికి సమాధానంగా మహర్షి అరవిందులవారు 1908 ఏప్రిల్‌లో విపులంగా తన వందేమాతరం పత్రికలో ఈ విధంగా వ్రాశారు. దాని సారాంశం "బ్రిటీషు వారి భారతదేశ పరిపాలన పూర్తియైనది. కాని మరికొంత కాలం భారతదేశాన్ని పాలించాలనేది దైవీశక్తుల సంకల్పం. బ్రిటీషువారు అత్యంత సునాయాసంగా భారతదేశాన్ని ఆక్రమించుట ప్రపంచ ప్రజానీకాన్ని నిజంగా ఆశ్చర్యంలో ముంచెత్తింది. బ్రిటీషువారు తమ తెలివిని ఉపయోగించి వారి శక్తితో అత్యంత సునాయాసంగా దేశాన్ని ఆక్రమించారని ప్రజలు తలంచారు. నిజంగా ఈ భావాన్ని బాగా ప్రచారంలోనికి తెచ్చి తద్వారా బ్రిటీషు వారు ఎంతో లాభించారు. భారతదేశాన్ని ఏనాడు బ్రిటన్ జయించలేదు. కొద్దిమందిని వదలివేస్తే ఇంగ్లాండు కొరకు పనిచేసినవారు మామూలు మనుష్యులే. భగవదనుగ్రహం లేనిచో చరిత్రలో కాని మరోచోట కాని వారు గుర్తింపు పొందేవారు కాదు. భారతదేశ ఓటమిని, బ్రిటీషువారి తెలివికి, శక్తియుక్తులకు ప్రతీకగా ఎంచరాదు. మరియు భారతీయుల బలహీనతగా కూడా దీనిని భావించరాదు. ఇది చరిత్రలో ఊహకందని, ఆశ్చర్యాన్ని కల్గించే సంఘటన. ఒక గొప్ప పనిని ఎటువంటి ప్రత్యేక తెలివితేటలు లేని ఒక సంస్థకు అప్పగించి, దాని విజయానికై ఒక దైవీశక్తి పాటుపడుటగా దీనిని వర్ణింపవచ్చును".

"అట్లే ఆ లక్ష్యం నెరవేరగానే, అప్పటివరకు బ్రిటీషు ప్రభుత్వానికి అండగా నిలచి, వత్తాసు పలికిన, ఆ దైవీశక్తి ఇక ఎంతోకాలము బ్రిటీషువారికి తన సహాయ సహకారముల అందించక నిలిపివేయక తప్పదు. భారతదేశానికి అవసరమున్నంత మేరకు బ్రిటీషు పాలన ఇచ్చుట ఉండి, ఆ తదుపరి ఇండియాను విడచిపెట్టుట తప్పదు. ఎందువలన అనగా బ్రిటీషు వారి ఇండియా పాలన, వారి స్వశక్తితో సంపాదించింది కాదు మరియు దాని స్వశక్తిపై ఆధారపడి మనుగడ సాగించుట లేదు. బ్రిటీషువారు సహకరించినా, సహకరించకపోయినా భారతదేశం తన లక్ష్యాన్ని సాధించి తీరుతుంది".

20వ శతాబ్ది ప్రథమ దశకంలో, బెంగాలు విభజనవేళ తప్పించి, భారతదేశంలో, స్వాతంత్ర్య పోరాట చైతన్యం ఎన్నడూ కన్పించలేదు. కాని బెంగాలు విభజనకు మాత్రం వ్యతిరేకత చాలా తీవ్రంగా కన్పించింది. ఈ వ్యతిరేకత భారతదేశ స్వాతంత్ర్యాన్ని సాధించేటంత తీవ్రస్థాయిలో లేదు. శ్రీ అరవిందుని యోగ విద్యలోనికి ప్రవేశింపచేసిన యోగి విష్ణు భాస్కరలేలే, బెంగాలు విభజనను వ్యతిరేకిస్తూ ఉన్న ఉద్యమకారులనందరిని భగవంతుని చేతిలోని ఆయుధాలని వర్ణించారు. అట్లే భారతదేశం తన స్వాతంత్ర్యాన్ని దైవీశక్తుల ప్రేరణతో పొందునని సెలవిచ్చారు.

**మాతృశక్తి రోదిస్తున్నంతకాలం సమాజం బాగుపడదు.**

**భగవంతుడు ఎన్నుకొనిన దేశము :**

"ఈ క్రింద తెలియజేయబడిన విషయాలు ఋషి లేలే సందేశముతో సరిపోలుతుంది". 1972వ సంవత్సరములో పరమ పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యులవారు, ఆరు మాసములు ఆధ్యాత్మిక దైవీశక్తులతో కూడి ఉన్న హిమాలయ ప్రాంతాలలో నివసించి తిరిగి శాంతికుంజ్ చేరుకున్నారు. వారి నివాసంలోని మొదటి అంతస్తులో ప్రస్తుతం గురుదేవుల మరియు మాతాజీల పాదుకలున్న చోట విశ్రమించి ఉన్నారు. అట్టి సమయంలో భారతదేశ విశిష్టతల గురించి ప్రపంచానికి తర్కానికి తావులేని రీతిలో తెలియజెప్పుట ఎలా అనేదానిపై చర్చ జరుగుచున్నది. దీనికి కావలసిన యదార్థాలను ప్రోగుచేసుకోవాలి. ఈ నిజాల పరిశోధనా ఫలితాలను తదుపరి కాలంలో "సమస్త విశ్వకో భారత్ కా అజస్ర అనుదాన్ (హిందీ)" అనే పుస్తకంలో ముద్రించడమైనది. గురుదేవులైన శ్రీరామశర్మ ఆచార్యులవారు తమ ఉపన్యాసాలలో, వ్యాసాలలో భారతదేశం దైవీశక్తుల ఆలవాలము అని వివరించుట జరిగింది.

ఒక పరిజనుడు గురుదేవులను ఇలా ప్రశ్నించాడు. "భగవంతుడు భారతదేశానికే తనను తాను ఎందుకు అనుసంధానించుకొన్నాడు? ఇచ్చటే ఎందుకు పుట్టుచున్నాడు? ప్రాచీన సంస్కృతికి, నాగరికతకు మనమే అసలు వారసులమని ఎట్లు చెప్పగలం? శక్తికి, జ్ఞానానికి, నైపుణ్యానికి, వ్యవస్థ నిర్మాణానికి ఇతరులకు తీసిపోమని మనకు మనం భావించినచో, శతాబ్దాల తరబడి బానిసలుగా ఎందుకున్నాం? నిజంగా మనం శక్తివంతులం, ధైర్యశాలురమైనచో, మనపై దండయాత్ర చేసిన వారు ఎన్నటికి విజయాన్ని సాధించి ఉండేవారు కాదు".

భారత ప్రజలపై నమ్మకం లేక కాదు, మరియు వారిని నిందించుటకై పై ప్రశ్నలను పరిజనుడు సంధించలేదు. కేవలం తన కుతూహలంతో పై ప్రశ్నలను సంధించాడు. గురుదేవులు హిమాలయ యాత్ర నుండి తిరిగి శాంతికుంజ్ చేరుకున్నట్లు అప్పటికి ఎక్కువమందికి తెలియదు. రోజూ 4 నుండి 6 గురు గురుదేవుల దర్శించుటకై వారు శాంతికుంజ్ వచ్చేవారు. ఆ రోజులలో మాతాజీ గదిని ఆనుకుని ఉన్న గదిలో గురుదేవులు పనిచేసుకుంటూ ఉండేవారు. పరిజనుని పై ప్రశ్నలకు గురుదేవులు క్లుప్తంగా ఈ రీతిలో జవాబు ఇచ్చారు. "భగవంతుడు ఎన్నుకొనిన దేశం భారతదేశం. భగవంతుడు 24 సార్లు భౌతిక రూపంలో ఈ దేశంలో జన్మ తీసికొని సత్యాన్ని మరియు దైవత్వాన్ని ప్రతిష్ఠించాడని నీకు తెలియదా? దేశములో ఉన్న భారతీయ ఋషులను, మునులను, యోగులను లెక్కించుట సాధ్యపడదు. అట్లే దేశము వెలుపల ఉన్న మునులను లెక్కించినచో, వారి సంఖ్య భారతదేశంలోని మునులతో సరితూగజాలదు. ఈ దేశములో ఉన్న అనేక రకములైన ఆధ్యాత్మిక సంస్థలు, ఆలోచనా రీతులు, వైవిధ్యాలు విధి విధానాలు, ప్రపంచంలో మరే దేశంలో కానరావు. వీటన్నింటి మధ్య ఉన్న సంఘీభావము, ఐకమత్యం మనకు విచిత్రంగా కన్పిస్తుంది. కాని ఇదే విధమైన వైవిధ్యాలతో కూడి ఉన్న ఆధ్యాత్మిక సంస్థలు మరో దేశంలో ఉన్నచో వాని మధ్య తప్పక బేధభావాలు నెలకొని పరస్పర దూషణలకు నిందలకు తప్పక దిగి ఉండేవారు. భారతదేశ వాతావరణంలో వైవిధ్యాలు కన్పిస్తాయి. ప్రకృతి పరంగా వైవిధ్యాలున్నాయి. ఋతువులు, కాలాల మధ్య వైవిధ్యాలున్నాయి. దీనిని బట్టి భారతదేశం భగవంతుడు ఎన్నుకొనిన దేశంగా మనం గుర్తించలేమా? ఇచ్చట భగవంతుడు మానవ ప్రకృతిపై కొత్త కొత్త ప్రయోగాలు చేస్తున్నాడు".

తదుపరి కొంతసేపు గురుదేవులు, పరిజనుని వైపు తన దృష్టిని సారించారు. మాటల ద్వారా చెప్పిన దానికన్నా మించిన జ్ఞానాన్ని తన దృష్టి ద్వారా పరిజనునికి అందించారు. పరిజనుడు తన అనుభవాన్ని ఈ క్రింది రీతిలో తెలిపారు. "ఈ సంఘటన, నా చిన్ననాటి బాల్యస్మృతులను జ్ఞప్తికి తెచ్చింది. చిక్కుముడితో కూడిన ప్రశ్న నాకు ఎదురయితే మా నాన్నగారి సహాయాన్ని అడిగేవాడను. మా నాన్న నా సమస్యకు ప్రామాణిక గ్రంథాలను ఉటంకిస్తూ అంకెలతో కూడిన సమాధానాన్ని ఇవ్వక, కేవలం కొన్ని మూల సూత్రాలను తెలిపి నా వంక ప్రేమతో చూచెడివారు. అప్పుడు నేను వేసిన ప్రశ్నను, సమాధానాన్ని కూడా మరచిపోయేవాడిని. నాన్నగారి జవాబు విని, వారి ప్రేమాస్పద చూపులనందుకొనగనే నా మనస్సు సంతృప్తితో నిండెడిది. నా ప్రశ్నకు సమాధానం లభించినట్లు అనిపించేది. తాళం వేసిన పెట్టె వంటిది పుస్తకం. తాళం చెవితో, తాళం తీసి సమాధానాన్ని పొందాలి. గురుదేవుల కొద్దిపాటి సమాధానం, ప్రేమాస్పదమైన చూపులు నా బాల్య స్మృతులను జ్ఞప్తికి తెచ్చాయి.

"తర్కం ద్వారా సమాధానం కావాలన్నా అది కూడా ఉన్నది" అన్నారు గురుదేవులు. "ప్రపంచము గుండ్రని చక్రం వంటిది. చక్రం తిరుగుచున్నప్పుడు చక్రంలో ఉన్న చువ్వలు కొన్ని పైకి పోతే కొన్ని క్రిందికి వస్తాయి. భారతదేశానికిదే జరిగింది. ఏ జాతి కలకాలం ఉచ్ఛస్థితిలో ఉండదు. వెలుగు తరువాత చీకటిలా ఉన్నతి వెనుక పతనం కూడా ఉంటుంది. కొద్ది వందల సంవత్సరాల బానిసత్వాన్ని ఓటమిగా చూడాలేకాని పతనంగా లెక్కించరాదు. అనేక జాతులు కొన్ని వందల సంవత్సరాల విదేశీ

**సౌభాగ్యము ఎప్పుడూ మరుగపరచరాదు. కావున బొట్టు పెట్టుకొనుట మానరాదు.**

పాలన వలన నిర్వీర్యమైనాయి. ప్రాచీన గ్రీకు నాగరికత, ఈజిప్టు, ఇరాన్ మరియు రోమన్ నాగరికతలు మనుగడ సాగించలేక పోయాయి. వారి అసలైన నాగరికత ఏనాడో అంతరించిపోయింది. ఈ దేశాల సంస్కృతి వెల్లివిరిసిన కాలం కన్నా ఎక్కువ రోజులు భారతదేశం విదేశీయుల పాలనలో ఉన్నది. అయినప్పటికి ఈ రోజు దాని కాళ్ళపై అది నిలబడి ఉన్నది. దీనిని భారతదేశ పతనం అందామా? లేక బ్రతకాలనే సంకల్పానికి ఋజువుగా తీసుకుందామా? నిజాలను పరిగణనలోనికి తీసికొన్నచో, ఒక బలీయమైన శక్తి దాన్ని ఒకటిగా నిలిపి, అజేయంగా ఉంచిందనేది సుస్పష్టము.

డిశంబర్ 1971లో జరిగిన సంఘటనను ఋషిసత్తా యొక్క కృపకు మచ్చుతునకగా లెక్కించవచ్చును. ఆ రోజులలో భారత పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం జరుగుతున్నది. ఈ యుద్ధానికి ముందున్న దేశ పరిస్థితులందరికి తెలిసినవే. వేలాది శరణార్థులు అప్పటి తూర్పు పాకిస్తాన్ సరిహద్దుల దాటి భారతదేశంలోనికి నిత్యం ప్రవేశిస్తున్నారు, పాకిస్తాన్ పాలకులు పెట్టే చిత్రహింసలు భరింపలేకపోతున్నారు. తూర్పు పాకిస్తాన్‌లో ఉన్న ప్రకృతి వనరులను అచ్చటి వారికందనివ్వకుండా పశ్చిమ పాకిస్తాన్‌కు తరలించి వేస్తున్నారు. దీనిని తూర్పు పాకిస్తాన్ ప్రజలు అప్పటికి 20 సంవత్సరాల నుండి భరిస్తూ ఇక భరింపజాలక, ఎదిరింప నారంభించిరి. వారి న్యాయబద్ధమైన హక్కుల సాధనకై పోరాటం చేయగా దీనికి పశ్చిమ పాకిస్తాన్ పాలకులు ప్రతిస్పందించి, వారి కోర్కెలు తీర్చకపోగా వారిపై బల ప్రయోగం గావించి, ప్రజా ఉద్యమాన్ని అణచుట ప్రారంభించారు. దీనితో తూర్పు పాకిస్తాన్ ప్రజలు పాలకులపై తిరుగుబాటును ప్రకటించారు. రక్తపాతం జరిగి ప్రజల తిరుగుబాటు ఉవ్వెత్తున లేచి తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా ఒక నూతన దేశంగా అవతరించింది.

**దైవీ సత్తా జోక్యము :**

భారతదేశంపై కూడా తూర్పు పాకిస్తాన్‌లోని అంతర్యుద్ధ ఛాయలు ప్రభావాన్ని చూపాయి. తూర్పు పాకిస్తాన్‌లోని ప్రజలు, తిరుగుబాటుదార్లు, ప్రభుత్వ దమనకాండను, అణచివేతను తట్టుకొనజాలక భారతదేశంలోనికి శరణార్థులుగా చేరుట ప్రారంభమైనది. వీరి సంఖ్య క్రమక్రమంగా వందలు, వేలు, లక్షలు దాటి కోట్లకు చేరింది. వీరిని పోషించే భారం, భారతదేశంపై పడింది. దీనితో భారత ప్రభుత్వం తన ప్రజలపై ప్రత్యేక పన్నును విధించి శరణార్థుల పోషణ భారాన్ని తలకెత్తుకుంది.

తూర్పు పాకిస్తాన్‌లోని ప్రజల తిరుగుబాటును క్రూరంగా అణచుటతో సంతృప్తి చెందక పాకిస్తాన్ ప్రభుత్వం భారతదేశంపై దండయాత్రకు పూనుకొన్నది. దీనికి పూర్వమే జులై 1971 నుండి భారతదేశ తూర్పు మరియు పశ్చిమ సరిహద్దులలో పాకిస్తాన్ సైన్యం ఒత్తిడిని పెంచుతూ కొన్ని వారాల వ్యవధిలో దానిని సంపూర్ణ యుద్ధంగా మార్చింది. ఆనాడు ప్రపంచంలోని శక్తివంతమైన దేశాలు పాకిస్తాన్ పక్షాన నిలబడ్డాయనే సూచనలు కన్పించాయి. రెండు సరిహద్దులలో భీషణ సమరం ప్రారంభమైంది. మొదటి రెండు, మూడు దినాలలోనే పాకిస్తాన్‌తో సైన్యం యుద్ధరంగంలో వెనుకంజ వేసే స్థితి ఏర్పడింది. పాకిస్తాన్ స్నేహంగా ఉన్న దేశాలు ఐక్యరాజ్య సమితిలోని భద్రతా సమితిలో అమెరికా నాయకత్వాన ఈ అంశాన్ని లేవనెత్తుటకు ప్రయత్నాలు ప్రారంభించాయి. భారతసైన్యం తూర్పు పాకిస్తాన్‌లోనికి చొచ్చుకొని పోయింది. అప్పుడు భారతదేశంపై నైతికమైన ఒత్తిడిని పెంచే లక్ష్యంగా ఆదేశాలు పని ప్రారంభించాయి.

అమెరికా ఇంతటితో ఆగక తన సప్తమ నౌకాదళాన్ని హిందూ మహాసముద్రంలో ప్రవేశించి, భారతదేశ సముద్రజలాలలోనికి ప్రవేశించవలసిందిగా ఆజ్ఞను జారిచేసింది. ఆ రోజులలో అమెరికా ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన నౌకాదళంగా పేరుగాంచింది. ఇది యుద్ధ విమానాలు, ఫిరంగులు, మిసైల్స్, మందుగుండుతో కూడిన అత్యంత భీతిగొల్పెడి నావికాదళంగా పేరు గాంచింది. దీని ప్రవేశంతో యుద్ధరంగ దిశ మారే పరిస్థితి ఉత్పన్నమైంది. ఆనాడు శక్తివంతమైన సప్తమ నౌకాదళాన్ని ఎదిరించి, నిలబడ గలిగిన శక్తి భారతనౌకాదళానికి లేదు. భారత పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం తీవ్రమై, వారం పది రోజులలో, భారతదేశాన్ని విజయం వరించనుండగా అమెరికా సప్తమ నౌకాదళ ప్రవేశంతో యుద్ధ భూమి పరిస్థితులు ఒక్కసారిగా తారుమారయ్యే పరిస్థితి నెలకొన్నది. ఈ దశలో డిసెంబర్ 7, 1971 ఉదయాన అనూహ్యంగా అమెరికా సప్తమ నౌకాదళం తన దిశను మార్చుకొని భారతీయ సముద్ర తీరజలాల నుండి దూరంగా వెళ్ళుచున్నట్లు వార్త వచ్చింది.

“ఏమి జరిగింది? రాత్రికి రాత్రే పరిస్థితులలో మార్పెలా వచ్చింది? రాజకీయ మంతనాలు జరుగలేదు. ప్రపంచదేశాల ఒత్తిడిలేదు”. అమెరికా పెంటగన్ యుద్ధనీతిని తెలిసిన పండితులు కూడా, ఇంత దూరం వచ్చి పనిని పూర్తి చేయకుండా అనూహ్యంగా సప్తమ నౌకాదళం వెనుదిరుగుటలో గల రహస్యాన్ని, ఉద్దేశ్యాన్ని చెప్పజాలకపోయారు. పెంటగాన్ చరిత్రలో ఇట్టి సంఘటన అనగా తన నిర్ణయాన్ని మార్చుకొనుట ఏనాడు జరుగలేదు. నౌకాదళాన్ని ఒకసారి ముందుకు వెళ్ళమని ఆదేశించి కొలది సమయంలోనే వెనుదిరిగి రమ్మని ఆదేశించిన సంఘటన

**శవయాత్ర ఎప్పుడైనా ఎదురైతే దానితోపాటు నాలుగు అడుగులు వెయ్యాలి.**

అమెరికా దేశ చరిత్రలో లేక మరో దేశ చరిత్రలో జరిగి ఉండలేదు. యుద్ధ ప్రకటన లేక దానిని నిలిపి వేసే అధికారం కేవలం అమెరికా దేశ అధ్యక్షునికే ఉంటుంది. ఆనాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, సప్తమ నౌకా దళాన్ని వెనుదిరుగమని ఆజ్ఞాపించుటలో గల కారణం ఏమిటి అన్నది నేటికి కూడా యుద్ధనీతి విశ్లేషకులు సమాధానాన్ని కనుగొనజాలక పోయారు.

ఏదైనా దైవీశక్తి దీనిలో జోక్యం చేసికొన్నదా? భగవంతునిపై విశ్వాసమున్నవారిలో దీనిని తెలిసికోవాలనే ఉత్సాహముంటుంది. డిసెంబర్ 7, 1971 వేకువఝామున, అమెరికా సప్తమ నౌకాదళం హిందూ మహాసముద్రాన్ని దాటి, బంగాళాఖాతంలోనికి ప్రవేశించుచున్నట్లు, ఇప్పటి ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని రాజనాథ్‌గావ్ లోని మోహన్ దేవంగన్ అనుపేరుగల సాధకుడు కలగన్నాడు. శ్రీలంక సరిహద్దులు దాటి క్షణక్షణం సప్తమ నౌకాదళం దాని వేగాన్ని పెంచుకుంటున్నది. ఆ సమయంలో సప్తమ నౌకాదళం ఉన్న ప్రాంతాన్ని సాధకుడు కలలో గుర్తింపసాధ్యపడలేదు. కాని రామేశ్వరం వద్దనున్న రామేశ్వరం సేతువు (బ్రిడ్జి) వద్ద యుద్ధ నౌక ఉన్నట్లు కలలో కన్పించింది. ఆ ప్రదేశంలో కొన్ని రాళ్ళు నీటిలో తేలుతూ ఉన్నాయి. వానిపై "రామ" అనే అక్షరాలు చెక్కి ఉన్నాయి. కలలో ఈ దృశ్యాన్ని వీక్షించుచున్న సాధకుడు, ఒక నౌక ఆ రాళ్ళను దాటుటను చూచాడు. వెనువెంటనే ఆకాశం నుండి మెరుపు మెరవగా, పిడికిలి బిగించిన ఒక చేయి సముద్రపు నీటిలో నుండి పైకి వచ్చింది. మొదట పిడికిలి పైకి వచ్చింది. తరువాత మోచేయి వరకు పైకి ఎదిగి, ఆ చేయి ఆకాశాన్ని తాకినట్లున్నది. అప్పుడు పిడికిలి తెరచుకున్నది. అరచేయి విప్పారింది. నెమ్మదిగా అచ్చట ఉన్న యుద్ధ నౌకను కప్పి వేసింది. తరువాతి క్షణంలో అంతా మామూలు స్థితి ఏర్పడింది. సముద్రం ప్రశాంతంగా ఉంది. "విచార క్రాంతి అభియాన్" లోని కాగడాను ధరించిన చేయిలా సాధకునికి కలలోని చేయి కన్పించింది. (ఇదే గాయత్రీ పరివార్ గుర్తు)

శాంతికుంజ్‌లోని అఖండదీపం చెంత జపం చేయుచున్న కన్యలు కూడా రమారమి ఇదే దృశ్యాన్ని తమ జపంలో వీక్షించుట జరిగింది. సప్తమ నౌకాదళం వెనుదిరిగి వెళ్ళుచున్న వార్త వెలువడడానికి కొద్ది సమయం ముందు వందనీయ మాతాజీ ప్రాతఃకాలమందే తమను దర్శించి నమస్కరించవచ్చిన సాధకులనుద్దేశించి "ఒక గొప్ప ప్రమాదం తప్పింది. ఇప్పుడు దేశం యుద్ధాన్ని గెలిచి తీరుతుంది. ప్రపంచంలోని ఏ శక్తి భారతదేశాన్ని ఓడింపజాలదు. యుద్ధం పరిసమాప్తం కాగానే దీనిని మీరు చూస్తారు. రోజురోజుకు దేశం పురోగమిస్తుంది. ప్రపంచానికి దిశానిర్దేశనం చేయగల బాధ్యతను తీసికొంటుంది. అంతటి శక్తివంతమవుతుంది." అని ప్రవచించారు.

"తదుపరి పది రోజులకు భారతదేశం యుద్ధాన్ని గెలిచింది. వర్ధమాన దేశాలలో, ముఖ్యంగా ఎదుగుతున్న దేశాలలో ఒకటై ఉండి కూడా, భయంకరమైన పెను సవాళ్ళను ఎదుర్కొని భారతావని విజయపథంలో సాగిపోవుట, ఏ ఒక్కదేశం దానిని ఓడింపజాలదు అనేదానికి తార్కాణం".

**పరిస్థితులు మారుట ప్రారంభమైంది :**

భారతదేశ చరిత్రలో 1911వ సంవత్సరం ఒక గొప్ప విశిష్టతను సంతరించుకొంది. అంతకు ఆరు సంవత్సరాల పూర్వం లార్డ్ కర్జన్ బెంగాలును విభజించాడు. బెంగాలు విభజన ప్రజలలో కోపాన్ని రగిల్చింది, దీనితో బ్రిటీషు వారినే కాక, వారి దేశంలో తయారైన బట్టలు మున్నగువానిని దేశ ప్రజలు బహిష్కరించారు. తదుపరి "వందేమాతరం" అనే నినాదం దేశమంతా మార్మోగింది. దేశభక్తి పెల్లుబికి, మాతృదేశం పట్ల భక్తి శ్రద్ధలు పెరిగి, దేశమాత అనే భావన వ్యాప్తి జెందింది. దీనితో దేశమాతను బ్రిటీషువారి సంకెళ్ళ నుండి విడిపించాలనే ఆందోళన వ్యాపించింది. బ్రిటీషు వారి బానిసత్వం నుండి బయట పడాలనే సంకల్పం బలపడ సాగింది. ప్రభుత్వం ప్రజల సహాయ నిరాకరణ ఉద్యమాన్ని సహించజాలకపోయింది. దీనితో, ప్రజల ఉద్యమాన్ని అణచి వేయుట ప్రారంభించింది. ఉద్యమంలో పాల్గొన్న వారికి జరిమానాతోపాటు ప్రభుత్వం సౌకర్యాల నిలిపివేసి, ఉద్యోగాల నుండి తొలగించింది. అయినా ఉద్యమం ఆగలేదు. పై పెచ్చు ప్రజలు ఉద్యమాన్ని తీవ్రం చేయుట జరిగింది. ఆయుధాలతో తిరుగుబాటు ప్రారంభమైంది. ప్రప్రథమంగా బ్రిటీషు పాలనకు బహిరంగంగా ప్రజలు తిరుగుబాటు చేశారని రమేష్ చంద్ర ముజుమ్‌దార్ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. ఆ రోజులలో అనేక ప్రజా సంఘాలు రహస్యంగా దేశమంతటా ఏర్పడ్డాయి. వీని లక్ష్యం బ్రిటీషు పాలనను అంతంగావించుట. బెంగాలులో మాత్రమేకాక గల దూర ప్రాంతాలైన పంజాబ్ మరియు మద్రాసు ప్రాంతాలలో కూడా బ్రిటీషు పాలనకు బహిరంగంగా వ్యతిరేకత బయలుదేరింది. ప్రభుత్వ తీవ్ర అణచివేత చర్యలు ఉద్యమ తీవ్రతను ఏ మాత్రం తగ్గించలేకపోయాయి. దీనితో ప్రభుత్వానికి బెంగాలు విభజనను రద్దు చెయ్యక తప్పలేదు. డిసెంబర్ 1911 ఢిల్లీ దర్బారులో జార్జి ఐదవ చక్రవర్తి మరియు ఇంగ్లాండు రాణి బెంగాలు విభజనను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిరి.

(సశేషం)

*– అనువాదం : ఎ. వేణుగోపాలరెడ్డి*

**సర్జను హృదయాన్ని కోస్తాడు - భగవంతుడు దానిని కలుపుతాడు.**

యువతకు ప్రత్యేకం

# ఐశ్వర్యం - 4

సైన్యం అన్ని పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటుంది. అలాగే ఐశ్వర్యవంతులు కావాలనుకున్నవారు అన్ని పరిస్థితులకు తయారయి ఉండాలి. అవసరము వచ్చినప్పుడు చూద్దామంటే కుదరదు.

మేము వంటిల్లు, బాతురూములు కడిగి గొప్పవాళ్ళం అయ్యామని చెప్పింది ఎవరు? పూజ్య గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య ఆయన ఆత్మకథలో వ్రాసుకున్నారు. మీరెక్కడ ఉన్నారో అక్కడ నీట్‌గా, శుభ్రంగా ఉండాలి. అన్ని వస్తువులు చక్కగా సర్ది ఉంచాలి. మీ వస్తువులు, మీ గది చక్కగా సర్దుకుంటే చాలు. ఇంకోళ్ళ ఇంటికి వెళ్ళి వాళ్ళకు చెప్పనక్కరలేదు. అక్కడ సర్దిపెట్టాల్సిన పనిలేదు.

ఇంకోటి ఏమిటంటే ఏదైనా ఒక అవకాశం రావాలనుకుంటే ఆ అవకాశానికి కావలసినటువంటి పరిస్థితులు మీరే సృష్టించుకోవాలి. టీచర్ కావాలనుకుంటే చెప్పడం మొదలుపెట్టు. ఇంజనీరు కావాలి, ఇంజనీరింగ్ గురించి ఆలోచించుతుండాలి. ఇదంతా చేస్తాం కాని నా బట్టలు అమ్మ ఉతకాలి. నా పక్క అమ్మ వేయాలి. నా ఆహారం అమ్మపెట్టాలి. కుదరదు. **మీరు ఎదగాలంటే మీరు ఇంట్లో వాళ్ళకి చేసిపెట్టాలి తప్ప, ఇంట్లో వాళ్ళ చేత చేయించుకోకూడదు.** కొంతమంది సోషల్ సర్వీసు చేస్తామని బయలు దేరుతుంటారు. ఇంట్లో వాళ్ళకి చేయండి. చేయదలుచుకున్న సేవ ఇంట్లో వాళ్ళకి చేయండి. బయటి వాళ్ళకు ఎందుకు చేయడం? "ఇంట్లో వాళ్ళు నాకు థాంక్స్ చెప్పరండి!" వాళ్ళు థ్యాంక్స్ చెప్పాలని చేస్తున్నారా లేక మీరు గొప్పవాళ్ళు కావాలని చేస్తున్నారా? మీ ఇంట్లో మొత్తం బాధ్యతలను తీసుకోగలగాలి. చివరకు ఎలాంటి పరిస్థితి రావాలంటే మీరు ఎక్కడికయినా రెండు గంటలు బయటకు వెళితే ఇంకెలాగా మావాడు లేకపోతే అని విలవిలలాడిపోవాలి. ఇంట్లో అందరిని మీ మీద ఆధారపడేటట్లు చేసుకోవాలి. అది ఐశ్వర్యానికి, విశాలత్వానికి మొదటి మెట్టు.

ఐశ్వర్యం కావాలంటే ముందు వృధా చేయకుండా ఉండాలి. కొందరు ఉదయం దంతాలను బ్రష్ చేసుకుంటూ ఉంటారు. కాని నీళ్ళు అలా పోతుంటాయి. పంపు కట్టేయరు. చిన్న మందు పేరు వ్రాయాలి. పెద్ద కాగితం చించుతారు. ఇలాంటి వారు ఐశ్వర్యవంతులు కాలేరు. ఇవి చిన్న చిన్న విషయాలే కాని పెద్ద మహత్తు కలవి. నీకు కనిపిస్తున్న వృధాను, నీవు అదుపుచేయగల వృధాను వెంటనే అదుపుచేయాలి.

ఇంకొక ముఖ్యమైన విషయం ఇల్లు చాలా శుభ్రంగా ఉండాలి. నువ్వు తుడుస్తుంటావు. నీ చెల్లెలో తమ్ముడో పాడుచేస్తుంటాడు. అప్పుడేమి చేయాలి. తమ్ముడినో, చెల్లెలినో ఉతికేయాలి. అలా చేస్తే నువ్వు ఐశ్వర్యవంతుడివి కాలేవు. రోజు కొంత టైము కేటాయించి చేసుకుంటూపోవడమే. పండుగలు వచ్చినప్పుడు ఇంటికి వెల్లవేయిస్తారు. పెళ్ళిళ్ళలో ఇల్లు చాలా శుభ్రంగా ఉంచుతారు. ఎందుకంటే అలాంటి పరిస్థితులు ఐశ్వర్యానికి చిహ్నాలు.

గురుదేవులు గాంధీగారి ఆశ్రమంలో ఏమేమి చేశారో "సాఫల్యమునకు స్వర్ణిమ సూత్రాలు" అని ఆయన ఆత్మకథలో వ్రాశారు. అది చదువుకోండి. అభ్యాసం చేయండి, లావెట్రీలు శుభ్రం చెయ్యండి కట్టెలు కొట్టడం నుంచి మొదలు పెట్టారాయన. అందువల్లనే ఆయన అంత గొప్పవాడయ్యాడు. అందుచేత అవి చిన్న చిన్న పనులని మాత్రం అనుకోకండి. అందుచేత ఇంటి బాధ్యతలు మొత్తం తీసేసుకుంటే ఇంకా మంచిది. బాధ్యత ఎవడు తీసుకుంటాడో వాడినే పిలుస్తుంటాము. పెళ్ళిళ్ళలో ఒక్కొక్కసారి మీరు చూస్తుంటారు. వారికి ఆ పనులు చేయమని ఎవరు చెప్పలేదు. వాళ్ళు చేస్తుంటారు. అది వారి ప్రవృత్తి. వాళ్ళు అలాగే చేసుకుంటూ చాలా గొప్పవాళ్ళవుతారు. కాని అలా జరగదు. కారణం ఏమిటంటే కొందరు అంటారు. "నీకు బుద్ధుందా పెళ్ళి వాళ్ళది. నువ్వెందుకురా పిచ్చివాడిలాగా తిరుగుతున్నావు". వాడికి వచ్చినా అవకాశాన్ని వీరు పోగొట్టేస్తుంటారు. ఈ మాట మన ఇంట్లో వాళ్ళే చెప్తారు. చాలా జాగ్రత్తగా ఉండాలి.

ప్రపంచంలో చాలా మంది "నాకు రోగంగా ఉన్నది, నాకు బాధగా ఉన్నది, నన్నెవరు ప్రేమించడం లేదు, పెళ్ళికి వెళ్తే మర్యాద ఇవ్వడం లేదు" అంటుంటారు. కాని ఎందుకు ఇలా ఉన్నది, నేనెందుకు మారలేను? అనుకునేవాడు గ్యారెంటీగా మారిపోతాడు. ఎవరిని అడుక్కోకు. గురువుగారిని కూడా అడుక్కోకు. బీదవాడు అడుక్కుంటాడు. ధనవంతుడు అడుక్కోడు. అడుక్కునే వాడికి ఏమి ఇస్తాం. ఇస్తే ఇస్తాం లేదా పొమ్మంటాం. ధనవంతుడి దగ్గరకు వెళ్ళేటప్పుడు ఖరీదైన వస్తువులు బహుమతిగా తీసుకెళ్తారు. ఆ మానసిక స్థితి మీరు తెచ్చుకోవాలి. నటన కాదు కానీ నటిస్తుంటే ఆ మానసిక స్థితి వచ్చేస్తుంది. నటులు ఉన్నారు. వాళ్ళకి కోపం రావడం లేదు. కళ్ళు పెద్దవి చేసి, హా హు అని అరుస్తున్నాడను

**ఈర్ష్యా, ద్వేషం అంతరిస్తే యోగ్యత, తీక్షణత వెలుగులోకి వస్తాయి.**

కోండి, వాడికి లోపల కోపం ఉన్నా లేకపోయినా బయటకు కోపం ఉన్నటువంటి భావాలు (feelings) వచ్చేస్తాయి. అదే చేసుకోవాలి. మీరు ఐశ్వర్యవంతులు కావాలంటే చేయవలసినది అంతే. ఇలా చేతలలో ఇలా రిచ్‌నెస్ (ఐశ్వర్యం) కనిపిస్తూ ఉండాలి. కాని ధనవంతులుగా కనిపించడానికి పది రూపాయలు అవసరమైన చోట వంద రూపాయలు ఖర్చు పెట్టావనుకో. నువ్వు ఐశ్వర్యవంతుడివి కాలేవు. మళ్ళీ కామన్ సెన్స్ ఉండాలి. ఎంత ఖర్చు పెట్టాలో అంతే ఖర్చు పెట్టాలి. చిల్లర ఉంచేసుకో అని మిడిల్ క్లాస్ వాడు అంటాడు తప్ప రిచ్‌మేన్ (ధనవంతుడు) అనడు. చిల్లర తే అంటాడు. ధనవంతులు ఎలా ప్రవర్తిస్తారో గమనించండి. చిల్లర ఉంచేసుకోవడం అడుక్కునే వాళ్ళ లక్షణం. వాడు ఉంచేసుకోమన్నాక వీడు ఉంచేసుకుంటే వీడు ఖచ్చితంగా ఏ హోటల్ బేరరో అయి ఉంటాడు. వాడికి టిప్ తీసుకునే అలవాటు ఉంటుంది. "నువ్వు ఇవ్వవలసినది ఇవ్వు గాని ఎక్కువ ఎందుకు ఇస్తున్నావు" ఆ మానసిక స్థితి రావాలి.

ఇంతకు ముందు చెప్పినట్లు లోతైన శ్వాస (deep breathing) అలవాటు అయిపోవాలి. మీ శ్వాస ఎంత లోతుగా ఉంటుందో మీ ఆరోగ్యం అంత బాగుంటుంది. మీరు మంచి ధనవంతుడిని గమనించండి. వాణ్ణి చంపేసి, వీణ్ణి చంపేసి, కల్తీలు చేసి అలా వచ్చినటువంటి ఐశ్వర్యం వృథా. అదేమి ఎక్కువ రోజులు ఉండదు.

ఐదు సంవత్సరాలకు ఎన్నిక అవుతారు. వందరోజులు అయ్యేసరికి అదో ఘన విజయం. సినిమా వాళ్ళు శతదినోత్సవం చేసుకోవడం మానేశారు. రాజకీయ నాయకులు చేసుకుంటున్నారు. ఎందుకంటే లోతైన శ్వాస లేదు. మరి నెహ్రూలాంటివాళ్ళు. నామినేషన్ పడేసి ఊరుకునేవారు. వాళ్ళు నిలబడ్డారంటే గెలుపే. అనుమానమే లేదు. ఎందుకంటే డీప్ బ్రీతింగ్ (లోతైన శ్వాస).

లోతైన శ్వాస తీసుకుంటే ఐశ్వర్యం వస్తుందా? రాదు. మంచి జ్ఞానం కావాలి. విపరీతమైన జ్ఞానం కావాలి. టీచరవ్వాలా? బెస్టు టీచర్ అయ్యేలాగా ప్రయత్నించాలి. ఇంజనీరింగ్ స్టూడెంటువా? బెస్ట్ స్టూడెంట్ అయ్యేందుకు ప్రయత్నించాలి. నువ్వు ఎక్కడ ఉన్నావో అక్కడ బెస్టు (best) గా ఉంటే చాలు. జ్ఞానం లేకుండా నువ్వు అభివృద్ధి చెందలేవు. మీరు ఎన్నుకున్న, మీరు ఏ క్షేత్రంలో (field) ఉన్నారో అక్కడ అవసరమైన జ్ఞానం మొత్తం ఉండాలి. బట్టల షాపు పెడితే బట్టలను గురించిన జ్ఞానం ఉండాలి. చాలా తక్కువ మంది మాత్రమే పుట్టుకతో ఐశ్వర్యవంతులు. కాని ఎక్కువ మంది ఏమిలేని స్థితి నుండి ఎదిగి ఐశ్వర్యవంతులు అయిన వారే. ఈ మాట వినడానికి బాగానే ఉంటుంది. కాని చెయ్యడానికి కష్టమవుతుంది. మీరు లోతైన శ్వాసను మరవకండి. అలా 24 గంటలు చేయగలగాలి. మీ శ్వాస తీసుకునే విధానం మారిపోతే మీ జీవితాలు మారిపోతాయి. లక్ష్మీదేవి ఫోటో చూచి ఉంటారు. లక్ష్మీదేవికి అటో ఏనుగు ఉంటుంది, ఇటో ఏనుగు ఉంటుంది. ఏనుగు లోతైన శ్వాసకు గుర్తు. లోతైన శ్వాసలేకుండా మీరు ఐశ్వర్యవంతులు కాలేరు.

లోతైన శ్వాస తీసుకుంటుంటే ఎన్నాళ్ళలో ఐశ్వర్యవంతులం అవుతాము? లోతైన శ్వాస మీకు పునాది (foundation) ఏర్పరుస్తుంది. మీరు తగిన జ్ఞానం సంపాయించుకోవలసినదే. మీరు ఏ రంగంలో రాణించదలచుకున్నారో నిర్ణయించుకోండి. బిజినెస్‌లో రాణించదలచుకుంటే మీకు నచ్చిన ఒక వ్యాపారవేత్తను ఎన్నుకోండి. రాక్‌ఫెల్లర్, బిర్లా, టాటా, అంబాని, ఇంకా ముందు లక్ష్యాన్ని సాధించిన వ్యక్తి పేరు వ్రాసుకోండి. హాజి మస్తాన్ పేరు వ్రాసుకోకండి. వ్రాసుకుంటే మీరు స్మగ్లర్ అవ్వాలి. మనకొద్దు. ఎందుకు ఆ గొడవంతా. స్వయంగా జీవించి ఎంతో ఎత్తుకు ఎదిగిన వ్యక్తుల పేర్లు వ్రాసుకోండి. వ్రాసుకున్న తరువాత వాడు ఎలా గొప్పవాడయ్యాడు అన్నది పట్టుకోండి.

లోతైన శ్వాస చప్పుడు లేకుండా జరుగుతూ ఉండాలి. ఇది అలవాటు అయిపోవాలి. లేకపోతే ఎన్నిసార్లు ప్రాణాయామం చేసినా ఉపయోగం లేదు. రోజుకు 144, 288, 588 కాదు 21,600 సార్లు చెయ్యాలి. రోజుకి 21,600 సార్లు గాలి పీలుస్తామని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. నిమిషానికి 15 సార్లు, 16 సార్లు శ్వాస తీసుకుంటుంటారు. అలా లెక్కవేస్తే 15×60×24 = 21,600 అవుతుంది. **నువ్వు నిమిషానికి 3 సార్లు పీల్చుకునే టటువంటి వంటి స్థితి వస్తే మల్టీ మిలియనీర్ అవుతారని శాస్త్రాలు చెబుతున్నాయి.** అంటే శ్వాస తీసుకునే వంటి రేటు బాగా తగ్గాలి. ఐదోవంతుకి తగ్గాలి. అభ్యాసం (practice) చేసుకుంటుంటే వచ్చేస్తుంది. అందుచేత బస్సులో ప్రయాణం చేస్తున్న, రైలులో ప్రయాణం చేస్తున్న, చదువుకుంటున్నా, వంట చేస్తున్నా, టి.వి. చూస్తున్నా ఇలా చేసుకోవచ్చు. ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే వెన్నెముక (backbone) తిన్నగా ఉండాలి (straight). ఇలా ఉండటానికి స్టూలు మీద కూర్చోవచ్చు. వెనకాతల ఆనుకునేందుకు ఏమి పెట్టుకోకండి. ఇలా ఉండడం వల్ల మీరు చేసే ప్రయత్నాలకు పూర్తి లాభం వస్తుంది. లోతైన శ్వాస, వెన్నెముక తిన్నగా ఉండటం మీకు సహజమైపోవాలి.

మీరు ఒక ఆదర్శాన్ని ఎన్నుకోండి. మీరు ఆ ఆదర్శవంతమైన స్థితికి వెళ్ళిపోతే మీరు ఎలా జీవిస్తారు? మీ టైమ్ టేబుల్ ఎలా ఉంటుంది? మీరు ఎన్ని గంటలకు నిద్ర లేస్తారు? మీరు ఎవరితో మాట్లాడతారు? ఊహించుకోండి. దీనిని విజువలైజేషన్ టెక్నిక్

**లోతైన సముద్రంలోకి వెళితే కాని ముత్యాలు లభించవు.**

అంటాం (visualisation technique), ప్రతీది ఊహాజనితమే. కొన్ని వందల మంది మనిషి ఎగరగలడేమోనని ఆలోచించారు. వాళ్ళందరి ఆలోచన రైట్ బ్రదర్స్‌లో ఊపిరి పోసుకుంది. కాని రైట్ బ్రదర్స్ మాత్రమే మేము ఎగరాలి అని ఆలోచించి ఉంటే అది జరిగి ఉండేది కాదు. మీకు ఆ రహస్యం తెలిసినప్పుడు పిచ్చివాళ్ళలాగా మళ్ళీ కొత్తగా ఆలోచించడం ఎందుకు? అందువల్ల అలా ఎదిగిన వాళ్ళను చూడండి. మీరు ఎవరిని ఎన్నుకున్నారో వాళ్ళని అనుసరించాలి. మీరు ఎదిగారు. ఆ స్థితికి వెళ్ళిపోయారు. వెళ్ళిపోయాక మీ టైమ్ టేబుల్ ఎలా ఉంటుందో ఊహించండి. ఆ స్థితిలో మీకు బాధ్యతలు పెరుగుతాయి. ప్రొద్దున లేచినప్పటి నుండి పడుకునే లోపల మీరు ఏమి చేయబోతున్నారు? మీరు ఊహించడమే. అంతకంటే ఏమి చేయక్కరలేదు.

మీరు గుర్తుంచుకోవలసినది పనికిరానటువంటి వ్యక్తి ఎవరు లేరు. ఇతరులను ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి. అలా ఉపయోగించుకున్న వారందరు గొప్పవారు అయిపోయారు. దీనితోపాటు మీరు వాళ్ళకి ఉపయోగపడాలి. అంతే తప్ప నేను ఇంకొకవాళ్ళకి ఉపయోగపడను. అంటే కుదరదు.

ఒక ఫ్యాక్టరీ ఉంటుంది. దానిలో మంచి మంచి బిల్డింగులు ఉంటాయి. ఆ ఫ్యాక్టరి చుట్టూ పూరి గుడిసెలు ఉంటాయి. పూరి గుడిసెలు అక్కడ ఉండటానికి కారణం ఆ ఫ్యాక్టరియే. మరి గుడిసెలలో ఉన్న కార్మికులకు ఫ్యాక్టరి మేనేజ్‌మెంట్ ఇస్తే ఫ్యాక్టరి మూతపడుతుంది. అందుచేత ఫ్యాక్టరి నడపాలంటే తెలివితేటలు ఉన్నవారు కావాలి. అందుచేత మీరందరు కాపిటలిస్టు (capitalist) అవ్వాలి. పెట్టుబడిదారులు కావాలి. కాదండి మేము సోషలిస్టులం. అందరు సమానమే. అందరు సమానం కాదు. కాలేరు. ఎవరి తెలివితేటలు వారివి.

కొంతమంది సేవ పేరుతో కాళ్ళు తుడుచుకునే పట్టా (door mat) లాగా తయారవుతారు. ఎవరైన వచ్చి కాళ్ళను తుడుచుకుని పోవచ్చు. వాళ్ళ మట్టి అంతా మన నెత్తిన పోసుకుని "అబ్బో మేము ఎంత మంచి వాళ్ళమో! మేము ఎంత సేవ చేస్తున్నామో అనుకుంటూ ఉంటారు. అది పరమ మూర్ఖత్వం. నువ్వు ఇతరులకు ఉపయోగపడాలి. కాని ఇలా కాదు. మీ లక్ష్యం గుర్తుండాలి. మీ ప్రవర్తన లక్ష్యానికి అనుగుణంగా ఉండాలి.

"బిజినెస్ చేస్తాం మాష్టారు" ఏం బిజినెస్ చేస్తారు? ఎలా చేస్తారు? ఏం చేస్తారు? ఏమి చేస్తే పైకి వస్తారు? ప్రక్కవాడు ఏది పెడితే అది పెట్టేస్తారు. కుదరదు, మీకంటూ స్వంత ఆలోచనలు ఉండాలి. దానికి జ్ఞానం కావాలి. "వాడికి తెలుసండి. వాడిని అడిగితే చెప్పలేదండి" ఎందుకు చెప్తాడు. వాడేమన్నా పిచ్చివాడా మీకు చెప్పటానికి, చెప్పించుకోవాలి. అంటే ముందు నువ్వు ఉపయోగపడాలి. అంటే నీ దగ్గర ఉన్నదేదో వాడికి ఉపయోగపడేది అయుండాలి. అమ్మనిగాని, నాన్ననుగాని ఇంట్లోవాళ్ళనుగాని, బయటవాళ్ళను కాని వేదాంతాలు అక్కరలేదు. కావలసినది ఏమంటే నువ్వు వాళ్ళకు ఎలా ఉపయోగపడగలవు? వాళ్ళను ఎలా ఉపయోగించుకోగలవు?

A rich man always exploits a poor man. అంటే ధనవంతుడు బీదవాళ్ళను పిండుతుంటాడు. అది ఎప్పుడు గుర్తుంచుకోవాలి. బీదవాళ్ళ బాధ కూడా అదే. ఎవరికి పడితే వారికి ఉపయోగపడకూడదు. ఎవరికి ఉపయోగపడాలో వారికి మాత్రమే ఉపయోగపడాలి. పనికి వచ్చేవారికి ఉపయోగపడండి. అందువల్ల ఉపయోగించుకోవాలి, ఉపయోగపడాలి. రెండూ సమానంగా ఉండాలి. నువ్వు 100% ఇంకొకడికి ఉపయోగపడు ఎదుటివాడు నీకు 100% ఉపయోగపడతాడు. మీ చుట్టు ప్రక్కల ఉన్నవారిని ఎలా ఉపయోగించదలచుకున్నారో వ్రాసుకోండి.


అదేదో సినిమా వచ్చింది. పేరు గుర్తులేదు. వాడు ఎవరినో కలుసుకోవాలి. అతను రోజు ఉదయం మార్నింగ్ వాక్ చేస్తాడు. వీడు ఉదయం 9 గంటలకు నిద్ర లేచే రకం. కాని వాడిని కలవాలంటే ఆ మార్నింగ్ వాక్ సమయంలోనే కలవాలి. మిగిలిన టైంలో దొరకడు. చాలా బిజీగా ఉంటాడు. అందువల్ల హీరో మార్నింగ్ వాక్ అలవాటు చేసుకుంటాడు. వాడు ఎక్కడ నడుస్తుండేవాడో వీడు అక్కడే నడిచేవాడు. వాడికంటే సీరియస్‌గా, సైంటిఫిక్‌గా చివరికి ఆ మార్నింగ్ వాక్‌లో ఇష్టం ఉన్న ఆ కోటీశ్వరుడికి వాకింగ్‌లో వాడికి తెలియని మెలకువలు ఏవో వీడు చెప్తాడు. అంటే ఉపయోగపడ్డాడు. తరువాత వాడు వీడికి ఉపయోగపడతాడు. ఇటువంటి ఆలోచనలను పట్టుకోవాలి. **మీరు మారితే మీ పరిస్థితులు మారతాయి.** తప్ప ఎవరి ఆశీర్వాదం వల్ల పరిస్థితులు మారవు. సహాయం చేయటం తప్పని చెప్పటం లేదు. కాని అది ఇప్పుడు చేయకండి. నువ్వు ఎంత మందికి సహాయం చేయగలవు. ప్రపంచంలో ఉన్న వాళ్ళందరికి చేయలేరు. మీకు ఎలాగు ఒక లక్ష్యం ఉన్నది. ఆ లక్ష్యం దగ్గరకు మిమ్ములను తీసుకెళ్ళగలరు అనుకునే వారికి సహాయం చేయడం మొదలుపెట్టండి. మెల్లమెల్లగా మీకు సహాయం రావడం మొదలవుతుంది.

*– డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు*
*యువతకు ఇచ్చిన ఉపన్యాసముల నుండి*

(మాష్టారు గారి ఉపన్యాసములు సి.డి.లు కావలసిన వారు సంప్రదించండి ఫోన్: 9441901275)

**నీవు ఇతరులను మంచిగా ఉండమని చెప్పేముందు నీవు ముందు మంచిగా జీవించు.**

# తిలకధారణ వెనుక గల విజ్ఞానం, దర్శనం



హైందవ పరంపరలో నుదుటిన తిలకము లేదా కుంకుమను పెట్టుకొనుట అనే ప్రక్రియ ధార్మికకార్యములలో జోడించబడినది. ప్రతి శుభసందర్భములోను అలా చేయుట ప్రసన్నత, సాత్వికత, సఫలతలకు చిహ్నంగా భావించబడుతుంది. ఏదైనా గొప్ప కార్య ఆరంభంలోను లేదా విజయదుందుభి మ్రోగించటానికి బయలు దేరుతున్నప్పుడు నుదుటిన కుంకుమ, చందనము, పసుపు లేదా తిలకమును దిద్దుతారు. ఉపాసనలోని షట్కర్మలలో ఇదొక అభిన్న అంగము. తీర్థక్షేత్రాలలో దైవ దర్శనమునకు వెళ్ళినప్పుడు అక్కడ నుదుటిన కుంకుమను అద్ది ఆశీర్వదిస్తారు. పండుగలు, పర్వదినములలోను, బంధువులు వస్తున్నప్పుడు వారికి కుంకుమను పెట్టి స్వాగతిస్తారు. తర్వాత శుభకామనను వ్యక్తం చేస్తారు. ఇదొక సామాన్యమైన లాంఛన ప్రాయమైన కృత్యముగా కనిపించినప్పటికి దీని గొప్పతనము అసాధారణమైనది. దీనిలోని దార్శనిక మరియు వైజ్ఞానిక పక్షములను గురించి ఆలోచిస్తే ఆశ్చర్యమునకు లోనుకావలసినదే!

భారతీయ సంస్కృతిలో కర్మకాండలు, పరంపరలు, ఆచార వ్యవహారములను కూర్చిన మన ప్రాచీన ఋషులు ఏకకాలంలో వైజ్ఞానికులుగా, మహావిద్వాంసులుగా దర్శనమిస్తారు. ఇందువలన ఏదైనా సదాచారమును ఏర్పరుస్తున్న శుభసందర్భంలో వారు ఈ రెండు కోణములను దృష్టిలో పెట్టుకుని వాటి కూర్పు చేశారు తప్ప అందులో ఏ ఒక్క పక్షము ఎప్పుడు ఉపేక్షించబడి, నగణ్యముగా భావించబడలేదు. తద్వారా రెండు వర్గములను అనుసరించేవారు సంతుష్టులై, స్వీకరించిన మార్గముతోపాటు రెండవదానికి సమానమైన గౌరవము ఇచ్చేటట్టుగా తీర్చిదిద్దారు.

మొట్టమొదటగా వైజ్ఞానిక పక్షమును తీసుకుందాము. లలాటము మీద ఏ స్థానంలో అయితే తిలకము లేదా కుంకుమను పెట్టుకుంటామో ఆ స్థానము భ్రూమధ్యం లేక ఆజ్ఞాచక్ర స్థానమని పిలువబడుతుంది. శరీరశాస్త్ర దృష్టితో పరికించినప్పుడు పీనియల్ గ్రంథి ఉండే స్థానము ఇదే! ఆజ్ఞాచక్రమునకు వెలుగుతో లోతైన సంబంధమున్నది అని ప్రయోగాల ద్వారా నిరూపించబడినది. ఒక వ్యక్తి కళ్ళకు గంతలుకట్టి, శిరస్సును పూర్తిగా కప్పి అతని పీనియల్ గ్రంథిని ఉద్దీపనము (వెలుగుతో నింపితే) కావించి నట్లయితే అతనికి మస్తిష్కము లోపల ప్రకాశము గోచరించిన అనుభూతి వచ్చినట్లు ప్రయోగాల ద్వారా వెల్లడైనది. ధ్యానధారణల మాధ్యమంగా సాధకునికి ఆజ్ఞాచక్రంలో ప్రకాశ దర్శనమౌతుంది. ఆ వెలుగుకి ఏదో ఒకవిధంగా ఈ స్థూల అవయవముతో సంబంధముంటుంది అన్న విషయమును ఇది స్పష్టంగా చెబుతుంది. ఋషులకు ఈ విషయము స్పష్టంగా తెలుసు. కనుక పూజ, ఉపాసనల సమయములోనే కాదు, ప్రతి శుభకార్యములోను వారు తిలకధారణ గావించుకునే ఆచారమును ధార్మిక కర్మకాండలకు ఒక అభిన్న అంగముగా ఏర్పరిచినారు. **ఒక పద్ధతిగా ఇలా నుదుటిని స్పృశించుట చేత ఆజ్ఞాచక్రం జాగృతం అవుతుంది.** తద్వారా స్థూల, సూక్ష్మ అవయవ జాగరణ ప్రక్రియకు దోహదపడేవిధంగా తిలకధారణ విధానమును రూపొందించారు. ఈవిధంగా అతీంద్రియశక్తుల జాగరణ కొరకు సాధనా విజ్ఞానములో సునిశ్చితమైన విధివిధానములు, అభ్యాసములు చెప్పబడినవి. అయితే అటువంటి కఠిన అభ్యాసాలు అందరి మనస్సులకు నచ్చవు లేదా అందరి మనో ప్రవృత్తి ఆ దిశగా సాగదు. ఆ పరిస్థితులలో మనిషి దీర్ఘకాలం వరకు పరిణామ క్రమములో వెనుకబడిపోతూ, అర్థవికసితస్థితిలోనే ఉండిపోవల్సిన దేనా? అలా ఉండనవసరము లేదు. మానవత్వం, సమాజం పట్ల ఏ కొద్దిపాటి కర్తవ్యముగల వ్యక్తియైనా ఇతరుల వికాసం గురించి తప్పకుండా ఆలోచిస్తాడు. ఋషులు కరుణ, సంవేదనకు ప్రతిరూపులు. ఋషులు తిలకము, బొట్టు పెట్టుకోవడం ద్వారా సర్వసాధారణమైన అభిరుచిని ధార్మికత వైపుగా మరల్చుటకు, తద్వారా మానవుల ఆత్మిక ప్రగతిదిశలో ప్రథమ ద్వారము తెరచుకునేందుకు ఒక యోచన చేశారు. **వాస్తవానికి తిలకధారణ అనేది తృతీయనేత్ర జాగరణదిశగా ఆధాత్మిక జగత్తులో వేసే ఒక అడుగు.** ఏదో ఒక జన్మలో ఈ రూపంలో దీనికి గట్టి పునాది పడిన తరువాత రాబోయే జన్మలో దీనిమీద భవ్యమైన భవన నిర్మాణము ఆరంభమౌతుంది.

రెండు కనుబొమ్మల మధ్య స్థానము అధిక సంవేదనాశీలతను (Sensitive) కలిగి ఉంటుంది అనేది ఒక వైజ్ఞానిక తథ్యము. దీనిని పరీక్షించి నిజం తెలుసుకొనవచ్చును. ఒకవేళ మనం కనులు మూసుకుని ఉన్నప్పుడు ఎవరైనా ఒక వ్యక్తి మన భ్రూమధ్య స్థానానికి అతి సమీపంగా లలాటము వైపుకి ఉంగరపువ్రేలుని తీసుకొస్తున్నప్పుడు మనకు ఒకానొక విచిత్రానుభూతి కలుగుతుంది. తృతీయనేత్రము ఉన్నది అనేందుకు ఇదొక నిదర్శనము. మన వ్రేలును భృకుటి మధ్యకు తీసుకొస్తు మనం కూడా ఈ అనుభూతిని చెందగలము. ఇందువలన ఈ కేంద్రము మీద తిలకము లేదా కుంకుమ లేదా బొట్టును పెట్టుకుంటే, ఆజ్ఞా చక్రమునకు నియమితరూపంలో ఉత్తేజనము లభిస్తూ ఉంటుంది. ఈ అనుభూతి మనకు అంత స్పష్టంగా అనుభవంలోకి రాకపోయి నప్పటికి ఈ తృతీయనేత్ర జాగరణ ప్రక్రియ నిరంతరముగా కొనసాగుతూనే ఉంటుంది.

**జన్మ జన్మాంతరాల ప్రారబ్ధం మంచి చెడుల రూపంలో బహిర్గతమవుతుంది.**

తంత్రమార్గంలో బొట్టును కేవలము పరంపరాగతంగా వస్తున్న ఆచారముగానే ధరించరు. ఈ మార్గములో దీని ప్రయోజనం మరింత లోతుగా ఉంటుంది. నుదుటిన దిద్దుకున్న బొట్టు కులదేవత లేక తీవ్రఇచ్ఛకు ప్రతీక, సంపూర్ణశరీరము విస్మృతికి గురైనప్పటికి దీని స్మృతి సదా నిలిచి ఉండాలి! ఈ ధారణ కారణంగా మనస్సు సరిగ్గా ఎప్పుడూ ఈ కేంద్రబిందువుపైనే నిలిచి ఉంటుంది. తత్ఫలితంగా శరీరము అంతా వ్యాపించి ఉన్న చైతన్యము నెమ్మది నెమ్మదిగా ఆజ్ఞాచక్రం వద్ద ఏకత్రితమౌతూ ఉంటుంది. భూతద్దము ద్వారా సూర్యకిరణాలను కాగితము మీద ఒకచోటున కేంద్రీకరించినట్లుగా తిలకము లేదా బొట్టును నుదుటిన దాల్చుట అనేది మనస్సును ఆజ్ఞాచక్రం వద్ద ఏకాగ్రపరచుటకు దోహద పడుతుంది. సూర్యకిరణాలు భూతద్దము ద్వారా ఒక స్థానంలో ఏకత్రితమైనప్పుడు అగ్ని పుడుతుంది. ఇప్పటివరకు ఎండ(వేడి) రూపంలో సర్వత్రా ప్రసరిస్తున్న సూర్యకిరణములే ఒకచోటున ఏకత్రితమై అగ్నిని పుట్టిస్తాయి. అదే ప్రక్రియ ఇక్కడా జరుగుతుంది. చేతన శరీరమంతటా వ్యాపించి ఉన్నప్పుడు శరీర చర్యల నిమిత్తము అది ఉపయోగించబడుతూ ఉంటుంది. కానీ అదే చేతన ఆజ్ఞాచక్రం మీద తిలకధారణ మాధ్యమంగా ఏకత్రితమైనప్పుడు అది తృతీయనేత్ర జాగరణకు మార్గమును సులభతరం చేస్తుంది. అప్పుడు మనం స్థూలజగత్తునుండి విడిపడి మరో క్రొత్త లోకంలోకి అడుగుపెడతాము. ఆధ్యాత్మికభాషలో దానిని పారలౌకిక జగత్తు అంటారు. వైజ్ఞానిక భాషలో పరామానసికజగత్తు అని పిలుస్తారు.

యోగవిజ్ఞానానుసారము మేరుదండం మూలస్థానంనుండి 72,000 నాడులు బయలుదేరి శరీరములోని సమస్త భాగాలలో వ్యాపిస్తాయి. వీటిలో మూడు ప్రధానమైనవి. అవి ఇడ, పింగళ, సుషుమ్న. ఇవి మూడు మేరుదండ మార్గం గుండా ఊర్ధ్వముఖంగా సాగి మస్తిష్కములోని మూడు వేర్వేరు స్థానాలను స్పృశిస్తాయి. ఆ తరువాత అక్కడినుండి ఆ నాడీత్రయము తమలో తాము ఒక త్రాడువలె అల్లుకుని కపాల ప్రదేశమునుండి పైనుండి క్రిందికి సాగుతాయి. దీని తరువాత అవి భ్రూమధ్య స్థానము వద్ద విడిపోతాయి. సుషుమ్ననాడి ఆజ్ఞాచక్రము లేదా తృతీయనేత్ర ప్రదేశంలో తన యాత్రను ముగిస్తుంది. ఇడ, పింగళా నాడులు రెండు కళ్ళలో గల కర్ణికలను (कर्णिकाओं) స్పృశిస్తూ వాటి రక్తవాహకనాడుల రూపంలోకి మారిపోతాయి. రెండు కళ్ళ ద్వారా జాగృత, స్వప్నావస్థలతో ఈ రెండు నాడులు సంబంధాన్ని కలిగి ఉంటాయి. దీనికి వ్యతిరేకంగా సుషుమ్నానాడి తృతీయనేత్రం ద్వారా సుషుప్తి, తురీయస్థితి, తురీయాతీతస్థితులతో సంబంధము కలిగి ఉంటుంది. యోగిజనులు భ్రూమధ్యలో చిత్తమును ఏకాగ్రమొనర్చి సుషుమ్నా మార్గము గుండా సుషుప్తి, తురీయస్థితి, తురీయాతీత స్థితుల ద్వారా అంతర్జగత్తులోకి ప్రవేశిస్తారు. ఈ బిందువు వద్ద బొట్టు పెట్టుకున్నట్లయితే ఒకరకమైన మానసిక ఎరుక కలుగుతుంది. ఈ మానసిక అప్రమత్తతను ప్రారంభస్థితి అని చెప్పవచ్చును. అనగా సాధకులు ఏ పనినైతే నిరంతరము అభ్యసిస్తూ ఉంటారో అది కుంకుమను ధరించుట చేత చాలావరకు దానంతట అదే పూర్తవుతుంది. అంటే ఆ ప్రయోజనము దానంతట అదే కొంతవరకు నెరవేరుతుంది. ఈ ప్రకారంగా కుంకుమధారణ ఆత్మోత్కర్షకు ఒక ఆధారంగా నిలుస్తుంది, పట్టుకొమ్మగా ఉంటుంది. ఈ ఆధారము ముందుజన్మలలో మరింత బలపడుతూ సంస్కారంగా రూపుదిద్దుకుంటుంది. తిలకం ప్రతీక రూపంగా ఏ శుభారంభము జరిగిందో అది సాధన, అభ్యాస రూపంలో పరిపుష్టమౌతూంటుంది. లక్ష్యము పూర్తయ్యేంతవరకు ఈ క్రమము నడుస్తూనే ఉంటుంది. అనగా ఆజ్ఞాచక్ర జాగరణ జరిగేంతవరకు ఈ ప్రయాస, యాత్ర సాగుతూనే ఉంటుంది తప్ప మధ్యలో ఆగదు.

సాధనా విజ్ఞానమును బోధించు ఆచార్యులు పూర్వజన్మలలో చేసిన ఈ అభ్యాసాల గుర్తును నుదుటిన ఒక పైపైన ఒక చిన్న గుంటగా గుర్తించారు. ఒకవేళ సాధకుడు తన భ్రూమధ్య భాగమును ఉంగరము వ్రేలుతో తడిమి పరీక్షించి చూసినట్లయితే దానిని స్పష్టంగా అనుభూతిచెందుతాడు. గుంటకు రెండువైపులా రెండు 'గట్లు' స్పష్టంగా అనుభూతిలోకి వస్తాయి. దీనిని అద్దంలో చూసుకుంటే అవి ఒక అర్ధచంద్రాకారరూపంలో పైకి కనిపిస్తాయి. ఇదంతా వైజ్ఞానికపక్షము.

కుంకుమ ధరించుట అనే ప్రక్రియ తనలో తాను అనేక ప్రేరణాత్మక అంశాలను ఇముడ్చుకుని ఉన్నది. నుదిటిన తిలకము మరియు త్రిపుండమును (నుదిటిన అడ్డముగా దిద్దుకునే రేఖలు) చందనముతో దిద్దుకుంటారు. చందనము శీతల ప్రకృతి గలది. చల్లటి చందనమును నుదుటిన దాల్చినప్పుడు దాని వెనుక దాగి ఉన్న సత్యము ఒక్కటే, అదేమిటంటే ఆలోచనలకు కేంద్ర స్థానము మస్తిష్కరూపంలో కపాలము యొక్క లోతుల్లో విరాజమానమై ఉంటుంది. అది ఎప్పుడూ శాంతంగా ఉంటూ, శ్రేష్ఠమైన ఆలోచనలను సాగిస్తూండాలి. ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఉండాలంటే తనవలెనే ఇతరులకు కూడా ఆ శీతలత్వము, శాంతస్థితి మరియు ప్రసన్నతను ఇస్తూ ఉండాలి.

మానవజీవితంలో బొట్టుపెట్టుకొనుట అనే అంశము అతి మహత్వపూర్ణమైనది. ఏదైనా శుభకార్యం, గౌరవప్రదానం, సంతోషకరమైన సంఘటన జరుగుతున్నప్పుడు తప్పకుండా నుదుటిన బొట్టుపెట్టుకుంటాము. వివాహము జరుగుతున్నప్పుడు బొట్టుపెట్టుకుంటాము. యుద్ధానికి వెళ్తున్నప్పుడు వీరతిలకము దిద్దుతారు. యుద్ధంలో విజయమును వరించి తిరిగి వచ్చినప్పుడూ బొట్టును పెడతారు. అంటే ప్రతి శుభకార్యమును బొట్టు పెట్టుకొనుట అనే ప్రక్రియతో అనుసంధానించారు మన పెద్దలు. ఆ ఆనందము చిరస్మరణీయంగా నిలిచిపోవాలనే ఉద్దేశ్యంతో

**ప్రారబ్ధాన్ని ధైర్యంగా ఎదుర్కొనుటే తపస్సు.**

ఈ ప్రక్రియకు రూపకల్పన చేశారు. మానవీయ చిత్తమునకు ఒక విచిత్రమైన స్వభావముంది. అది సంతోషమును, ప్రసన్నతను, సుఖమును నిరంతరము గుర్తుంచుకోవాలను కుంటుంది. అయితే అదే సమయంలో అది కటువైన సంఘటనలను, దుఃఖములను మర్చిపోవాలనుకుంటుంది. ఇందువలన మనకు మన గత జీవితము సుఖమయంగా కనబడుతుంది. సాధారణంగా ముసలివారు 'బాల్యము సుఖకరమైనది, అందమైనది' అని అనటము మనం వింటూనే ఉంటాము. ఇలా అనటము స్వాభావికమే! కారణమేమిటంటే మనస్సు దుఃఖమును త్యజించి వేస్తుంది, సుఖపరంపరను గమనికలో ఉంచుకొంటుంది. కానీ బాల్యము సుఖప్రదమైనది అని ఏ బాలుడు ఎప్పుడూ అనడు. అతను పెద్దవాడు అవ్వాలని కోరుకుంటాడు. పెద్దవారివలె ఉండాలని, తిరుగాలని, వస్త్రములు ధరించాలని, తినాలని, మాట్లాడాలని కోరుకుంటూ ఉంటాడు. అలా చెయ్యటంలోనే అతనికి ఆనందము వెల్లివిరుస్తుంది. ఇందువలన పిల్లవాడు తరచు పెద్దవారిని అనుకరిస్తూ ఉంటాడు. ఎవరైనా పూజచేయటం చూస్తే వారు కూడా అలాగే చేస్తారు. ఎవరైనా హుక్కా పీల్చడం చూస్తే పిల్లలు దానినే అభినయిస్తారు. ఎందుకంటే పెద్దవారవటానికి ఇవే లక్షణములు అని వారికి తెలుసు. ఈ అనుకరణలోనే వారు ప్రసన్నతను అనుభూతిచెందుతారు. ఈ ప్రసన్నత యొక్క ప్రతీక రూపంలో నుదుటిన బొట్టు భాసిస్తూ ఉంటుంది.

బొట్టును పెట్టుకోవటంతో సుఖమును కలుపుట వలన భారతీయ సంస్కృతికి తనదైన ఒకానొక ప్రయోజనము ఉన్నది. కల్పనలో సుఖము వృద్ధిచెందితే దానితోపాటు బొట్టు పరిమాణం కూడా పెరగాలి. సుఖాలు గుర్తుకొచ్చినప్పుడు, దానితోపాటు బొట్టు పెట్టుకోవాలనే విషయము కూడా స్మరణలోకొస్తుంది. ఈ స్మరణ ప్రభావము మెల్లమెల్లగా ఆజ్ఞాచక్రంతో జోడించబడుతుంది. అలా జరిగినప్పుడు **తృతీయనేత్రమును జాగరణ చెయ్యటము కోసము "సుఖము" ఉపయోగపడుతుంది అనే విషయమును గ్రహించాలి. మనము ఈ సుఖ ధారా ప్రవాహమును ఆజ్ఞాచక్ర స్థానమును పదే పదే తట్టడానికి ఉపయోగిస్తాము.** ఇది ఎన్ని మార్గాలలో లభిస్తే అంత ఉపయోగకరము.

వివాహిత స్త్రీ పాపిట సింధూరం, నుదుటిన కుంకుమ ధరిస్తుంది. బొట్టు తిలకమునకు గుర్తు, అలాగే పాపిట సింధూరం కుంకుమకు ప్రతీక. అయితే ఇక్కడ ఇవి వివాహిత యొక్క సౌభాగ్యమునకు సూచికలుగా ఏర్పడినవి. అవి అఖండ సౌభాగ్య సూచికలు. వీటిలో సమర్పణా భావన దాగి ఉన్నది. భార్యభర్తకు సమర్పితయై ఉంటుంది. అప్పుడు ఆమె స్త్రీత్వమునకు ఏవిధమైన ఆపదా వాటిల్లదు. అందువలన పత్ని తన పతి జీవించి ఉన్నంత వరకు వాటిని ధరించాల్సి ఉంటుంది. పతి మరణించిన వెనువెంటనే వీటిని తొలగించే ఆచారమున్నది. ఇలా ఎందుకు చేస్తారంటే ఇప్పుడు ఆమెకు ఎవరిపట్లా సమర్పణాభావన ఉండుట అన్న ప్రశ్నే తలెత్తదు కనుక. ఆమె విధవ అయ్యిందని తత్కారణంగా ఆమె సౌభాగ్యప్రతీకలు తీసివేయబడ్డాయని అర్థమౌతుంది. అయితే ఈ ఆలోచన తప్పు. అసలు విషయము ఇది కాదు. దీని వెనుక బలమైన, గొప్ప ప్రయోజనమున్నది. ఆమె ఇప్పుడు ఎవరని అనుసరించాలి? నిజమేమిటంటే ఆమె ఇప్పుడు స్త్రీ వలె కాక, పురుషుని వలె జీవించాల్సి ఉంటుంది. ఒక విధవరాలి జీవితము ఒక పురుషుని జీవితముతో సమానమైనది అన్నదానిలో సందేహము లేదు. అందుచేత వైధవ్యము ప్రాప్తించినప్పుడు సౌభాగ్యచిహ్నాలను తొలగిస్తారు.

తిలకం కొరకు భిన్న భిన్న పదార్థములను ఉపయోగిస్తారు. తెలుపు మరియు రక్తచందనములు భక్తికి ప్రతీకలు. భక్తిమార్గంలో పయనించే సాధకులు, భజనబృందములవారు వీటిని దిద్దుకుంటారు. పసుపు గోరోచనములు జ్ఞాన వైరాగ్యములకు సంకేతములు. జ్ఞానులు, తత్త్వచింతకులు మరియు విరాగ హృదయులు వీటిని పెట్టుకుంటారు. కస్తూరి భక్తి, వైరాగ్య, జ్ఞాన, ప్రేమ, సౌందర్య, ఐశ్వర్యములన్నింటికీ గుర్తు. చరమస్థితి అందుకున్న యోగిజనులు దీనిని ధరిస్తారు.

**తిలకధారణ నిమిత్తము భిన్న భిన్న ఉద్దేశ్యముల కొరకు వేర్వేరు వ్రేళ్ళను ఉపయోగించే పద్ధతి వాడుకలో ఉంది. జ్ఞానోపలబ్ధికి ఉంగరపు వ్రేలును, ఐశ్వర్యము కొరకు మధ్యమవ్రేలును, ధనవైభవములు, సుఖశాంతుల కొరకు చూపుడువ్రేలును వాడుట తప్పనిసరి. ఉంగరపువ్రేలుతో ఎఱుపు లేదా శ్వేతచందనపు బొట్టును, మధ్యమవ్రేలుతో సింధూరము, చూపుడువ్రేలుతో కుంకుమపువ్వు, కస్తూరి, గోరోచనములతో బొట్టును దిద్దుకోవాలి. ఇలా బొట్టు పెట్టుకునేటప్పుడు క్రమంగా తూర్పు, ఉత్తర మరియు పశ్చిమదిశలవైపుకు తిరిగి నిలబడాలి అనేది నియమము. ఈ దిక్కుల వైపుకు తిరిగి బొట్టును దిద్దుకోవాలి అనేది తప్పక పాటించాలి.** బొటనవ్రేలుతో కూడా చందనపు బొట్టును పెట్టుకునే ఒక పరంపర ఉన్నది. అన్ని ధర్మాలు మరియు సంప్రదాయముల పట్ల సమానదృష్టికల వ్యక్తులు బొటనవ్రేలుతో నుదుటిన బొట్టు పెట్టుకుంటారు. కాపాలికులు నల్లబొట్టును ధరిస్తారు.

ఈ ప్రకారంగా తిలకము లేదా బొట్టు అనేది ఒక ధార్మిక ప్రతీకగా నిలుచుటయేకాక అందులో విజ్ఞానము మరియు దర్శనములు కూడా ఇమిడి ఉన్నాయి. దీనిని అర్థము చేసుకుని, అమలు చేయవల్సిన నియమాలను ఆచరణలో పెట్టినట్లయితే అది సార్థక ఫలితములను చేకూర్చిపెడుతుంది. ఇంతకు తక్కువలో ఫలితము హస్తగతము కాదు. ఆచరించి చక్కని ఫలితాలను అందిపుచ్చుకోండి!

*– అఖండజ్యోతి, ఆగస్టు 2011*
*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఆధ్యాత్మికత అంటేనే సర్వస్వం.**

మేడమ్ బ్లావెట్‌స్కీ జన్మదిన ప్రత్యేకం

# పరోక్ష జగత్తు - అనంతమైన అవకాశాల భాండాగారం

*పూజ్యగురుదేవుల రచనలలో మేడం బ్లావెట్‌స్కీ పేరు అనేకచోట్ల కనిపిస్తుంది. వారి ఆత్మకథ ముందు పేజీలలోనే ఈమె వ్రాసినవన్నీ అక్షర సత్యాలేనని కొనియాడారు. మరి వీరి గురించి కొంచెం తెలుసుకుందాం.*



మేడం హెలీనా పెట్రోవనా బ్లావెట్‌స్కీ. అత్యంత ప్రభావశాలి, ఉన్నత వ్యక్తిత్వం కల ఈమె ఆధ్యాత్మిక జగత్తుకు యజమానురాలు. ఆవిడ ఆధ్యాత్మిక శక్తులు, ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే గుణాలు చిరస్మరణీయాలు. వీరు 1831 ఆగస్టు 12వ తేదీన రష్యాలో జన్మించింది. బాల్యం నుండే ఆవిడ ఆత్మ, మృత్యువు వంటి విషయాల పట్ల, నిగూఢ విజ్ఞానాల పట్ల ఆసక్తిని చూపేది. వయసుతో పాటు ఈ అభిరుచి కూడా పెరిగింది. పారిస్‌కి (Paris) చెందిన ప్రఖ్యాత ఆధ్యాత్మిక వేత్త డేనియల్ డగ్లస్ హూమ్ గారి దగ్గర ఆధ్యాత్మిక శిక్షణను పొందింది. ఆవిడకి రెండు మూడు సార్లు ఒక పొడువైన భారతీయుని నీడ కనిపించింది, ఆయన టిబెట్‌కి చెందిన సాధువు అనుకునేది. టిబెట్‌కు చెందిన సూక్ష్మ శరీరధారులైన సాధువులతో సంపర్కం ఏర్పరుచుకుని నిజమైన జ్ఞానం పొందాలనే కోరిక ఆవిడను భారతదేశానికి రప్పించింది. పదేళ్ళు భారతదేశాన్ని పర్యటించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొంది తిరిగి రష్యా వెళ్ళింది. ప్రజల మానసిక ప్రశ్నలకు జవాబులు, రోగాలకు నివారణ, సమస్యలకు సమాధానాలు రాసివ్వడం ఆవిడకు పెద్ద పనికాదు.

ఒకసారి ఆవిడ జడ చైతన్య వస్తువుల బరువును పరివర్తన చేసే ప్రదర్శన ఇచ్చింది. ఆవిడ ఒక చిన్న బల్ల మీద దృష్టి సారించింది. చాలామంది కలిసి కూడా ఆ బల్లను జరపలేక పోయారు. ఆవిడ తన దృష్టి ఆ బల్లనుండి మళ్ళించగానే అది మామూలుగా తేలికగానే జరిగిపోయింది.

ఆవిడ తండ్రి ఈ అద్భుతాలను అర్థం పర్థం లేనివాటిగా లెక్కగట్టేవారు. ఆయన, ఆయన మిత్రుడు కలిసి రెండు కాగితాల మీద ఎవ్వరికీ తెలియని రెండు పదాలు రాసి వేరే గదిలో పెట్టారు. ఒకవేళ హెలినా సూక్ష్మ జగత్తుతో సంపర్కించి ఆ పదాలను చెపితే అప్పుడు ఆవిడకి ఉన్న ఆధ్యాత్మిక శక్తులను నమ్ముతానన్నారు. ఆ కాగితాన్ని తాకకుండా అందులోని పదాన్ని ఆవిడ తండ్రికి చెప్పింది. ఆయన ఆశ్చర్యపోయారు, అది ఆయనకు ఎంతో ఇష్టమైన చాలా పాత గుర్రం పేరు. అది ఎవరికీ తెలిసే అవకాశమే లేదు. అప్పటి నుంచి ఆయన తన కూతుర్ని నమ్మారు, గర్వపడ్డారు.

ఒక సూక్ష్మసత్తా నుండి మార్గదర్శనం పొందాలని 1875లో మేడం బ్లావెట్‌స్కీ తీవ్రంగా ఆశపడింది. బ్రహ్మాండాన్ని నడిపించే నియమాలను, సిద్ధాంతాలను తెలుసుకుని సూక్ష్మశరీరధారులైన సాధువుల సహకారంతో ప్రకృతి యొక్క శక్తులపై ఆధిపత్యాన్ని సాధించాలన్నదే ఆవిడ ఉద్దేశ్యం. సూక్ష్మశరీర ధారులైన సాధువులు వారి ఇష్టానుసారం ఎప్పుడైనా ఎక్కడైనా స్థూల శరీరాన్ని ధరించగలరు. ఏ వస్తువునైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా ప్రత్యక్షం చేయగలరు, భూత భవిష్యత్తులను చూడగలరు, ఇచ్ఛానుసారం తమ ఆయువును పెంచుకోగలరు. తన ఉద్దేశాలను నెరవేర్చుకోవడం కోసం ఆవిడ కర్నల్ ఆల్కాట్ మరియు డబ్లు.క్యూ.జడ్జ్ అనే గుహ్య వైజ్ఞానికుడితో కలిసి థియసాఫికల్ సొసైటీని స్థాపించింది. భారతదేశం వచ్చిన కొన్ని నెలల తరువాత థియసాఫికల్ సంచిక యొక్క మొదటి సంపుటి ప్రకాశితమైంది. ఈ పత్రికలో పాశ్చాత్య రహస్యవాదం గురించి, ప్రాక్ దర్శనం గురించి, భారతీయ వేదాలు మొదలైన అనేక విషయాల గురించి విపులంగా చర్చించడం జరిగింది. అప్పటి వరకు ఆవిడ కుతూహలం కోసం చేసే ప్రదర్శలను చాలా వరకు ఆపేసింది. తనకు మార్గదర్శనం చేసే సూక్ష్మసత్తా ఇటువంటి నిగూఢ జ్ఞానాన్ని అకారణంగా ప్రదర్శించడం నిషేధించింది. 'కుథ్ హుమి' అనే సిద్ధుడు, సూక్ష్మ శరీర సాధువు ఆవిడకి మార్గదర్శనం చేసేవారని చెప్తూండేది. ఈ విషయం నిరూపించుకోవడం ఆవిడకు పెద్దపని కాలేదు. ఆ సూక్ష్మసత్తా యొక్క ఆశీర్వాదాన్ని, భావనలని, బహుమానాలని పాత్రత గల వ్యక్తులకు ప్రసన్నంగా అందజేసేది.

ఒకోసారి రాత్రి వేళలలో జరిగే సమావేశాలలో సూక్ష్మ జగత్తు సందేశాలు వినిపించడంతో పాటు, అలౌకిక సంగీతం కూడా

**విజ్ఞాన విషయం ముగింపుకు వచ్చిన చోట ఆధ్యాత్మిక విషయం ప్రారంభమవుతుంది.**

వినిపించేది, అలౌకిక శక్తి ద్వారా వస్తువులు కూడా కదిలేవి. ఒక రోజు పట్టపగలే రెండు సంఘటనలు జరిగాయి. శ్రీమతి సినేట్ అనే ఆవిడ ఒకసారి నడుస్తూ నడుస్తూ, ఏదైనా సూక్ష్మ సత్తా యొక్క సందేశం స్థూలంగా వ్యక్తిగతంగా లభిస్తే నేను వారి అస్తిత్వాన్ని నమ్ముతానని మేడమ్ బ్లావెట్స్కీతో చెప్పింది. మేడమ్ బ్లావెట్స్కీ కాగితంలో ఏదో రాసి దాన్ని మడతపెట్టి చేతిలోనే ఉంచుకుంది. అక్కడ్నుంచి కదలకుండానే ఒక చెట్టును చూపించింది. ఆ చెట్టు రెమ్మపై ఇలా రాసుంది, "మీ సందేశాన్ని నాకు చెప్పండి. మీరు నా నుండి ఏం కోరుకుంటున్నారు?" దాని కింది టిబెట్ లిపిలో సంతకం ఉంది. ఒక అలౌకిక శక్తి ద్వారానే ఇది సాధ్యమని శ్రీమతి సినేట్ నమ్మింది.

కొంతమంది నిష్పక్ష అతిథుల ముందు జరిగిన మరో సంఘటన మరింతగా ప్రభావం చూపింది. మేడమ్ బ్లావెట్స్కీ, కర్నల్ ఆల్కాట్, వేరే ఇద్దరు మహిళలు, మేజర్ హేండర్సన్‌తో కలిసి పిక్నిక్ వెళ్ళాలనుకున్నారు. సామాను సర్దుకుని బయలు దేరారు. దారిలో ఒక ఆంగ్ల న్యాయాధికార దంపతులు కూడా కలిసారు. అక్కడికి వెళ్ళాక చూసుకుంటే ఆరుగురికి సరిపోయే కప్పులు, సాసర్లు మాత్రమే ఉన్నాయి. ఏదో ఒకటి చేయమని మేడమ్‌ని అడిగారు. కొంత సేపు మౌనంగా ఉన్నాక ఆవిడ మేజర్ హేండర్సన్‌ను ఒక ప్రత్యేకమైన చోటు చూపించి అక్కడ తవ్వమంది. కొంచం తవ్వగానే ఒక కప్పు, సాసరు దొరికాయి. అవి సరిగ్గా వాళ్ళు ఇంటి నుంచి తెచ్చిన మిగితా వాటి లానే ఉన్నాయి.

మునుపెన్నడూ చూడని ఇటువంటి సంఘటనలు చూసాక హూమ్, సినేట్ మొదలైనవారు మొత్తం ప్రపంచాన్ని ఆకర్షించే విధంగా ఏదైనా చమత్కారం చేయాలని మేడమ్ బ్లావెట్స్కీపై ఒత్తిడి చేసారు. లండన్‌లో ప్రచురించబడే లండన్ టైమ్స్ పత్రిక అదే రోజు సిమ్లాలో ప్రత్యక్షమయ్యేటట్టు చేయమన్నారు. కొన్నాళ్ళ తరువాత తన కార్యాలయంలో సినేట్‌కు మార్గదర్శక సత్తా నుండి సందేశం లభించింది. ఇటువంటి చమత్కారాలు చేయడం పెద్ద కష్టం కాదు కాని, సామాన్య జనుల దృష్టిలో పడితే ప్రపంచ మంతటా అస్తవ్యస్తం నెలకొంటుందని తెలిపింది. ఇలాంటివి చేయడం వల్ల గుంపులుగా మనుషులు మీద పడతారు, కాని పరమ సత్యాన్ని తెలియజేసే ఏకైక మార్గం క్రమంగా జ్ఞానాన్ని పంచడం. ఒక జీవిత కాలంలో తన పాత్రతను బట్టి మనిషి క్రమంగా జ్ఞానాన్ని సంపాదిస్తాడు. చమత్కారాల వల్ల కుతూహలం పెరుగుతుంది, కాని దానివల్ల ప్రజల వివేకం జాగృతమవదు. పది మంది అపరిచితులు చెప్పిన విషయం కన్నా ఒక ప్రత్యక్షదర్శి చెప్పిన మాటలు ఎక్కువ విశ్వసనీయం అని సినేట్ అర్థం చేసుకున్నారు. కాబట్టి చేస్తున్న సత్కార్యాన్ని కొనసాగిస్తూంటే భవిష్యత్తులో దైవీ సహకారం తప్పక లభిస్తుందని ఆయనకు నమ్మకం కుదిరింది.

భారతదేశంలోని ప్రతి ఒక్క స్థలం ఒక తీర్థం అని నమ్మిన మేడమ్ బ్లావెట్స్కీ సంపూర్ణ భారత పర్యటన చేసింది. అప్పుడే ఆవిడకు బ్రైట్ అనే రోగం సోకింది. అదే పరిస్థితిలో ఒంటరిగా డార్జిలింగ్ వెళ్ళింది. అక్కడ్నుంచి సిక్కిం వెళ్ళి తన గురువును కలుసుకున్నది. మళ్ళీ ఆరోగ్యాన్ని పొందింది. ఆ తరువాత థియసాఫికల్ సొసైటీకి చెందిన కొందరికి కుథ్ హూమీ స్థూలంగా దర్శనమిచ్చారు. చాలాసార్లు తెల్లటి దుస్తులు ధరించి తలపాగా పెట్టుకున్న ఒక తేజో సంపన్నమైన భారతీయుడు కొంత సేపటి వరకు గాలిలో విహరిస్తున్నట్టు, అటూ ఇటూ తిరుగుతున్నట్టు కనిపించి అదృశ్యమై పోయేవారు. చాలా మంది ప్రత్యక్షంగా ఈ దృశ్యాన్ని చూసారు.

అడయార్ (చెన్నై)లో ఉన్న సొసైటి కార్యాలయంలోని ఒక అలమారాలో మేడం బ్లావెట్స్కీ తన గురువు చిత్రపటాన్ని పెట్టింది. ఆవిడ అక్కడ లేకపోయినా గురువు నుండి సందేశాలు అక్కడ లభ్యమవ్వడం వల్ల ఆ ప్రదేశం ప్రసిద్ధికెక్కింది. ఒకసారి ఆవిడ మిత్రుడు జనరల్ మార్గన్‌ను అలమారా చూడడానికి పిలిపించింది. అలమారా తలుపు తీయగానే ఒక ప్లేటు కిందపడి పగిలిపోయింది. అక్కడే ఉన్న శ్రీమతి కౌలుంబ్ విసుక్కుంది. గొణుక్కుంటూ ఆ పగిలిన ప్లేటు ముక్కల్ని ఒక కాగితంలో చుట్టి మళ్ళీ అలమారాలో పెట్టింది. ఇదంతా చూసి నొచ్చుకున్న జనరల్ మార్గన్, ఆ సాసరు అంత ముఖ్యమైనదైతే సూక్ష్మ శక్తితో మళ్ళీ అతికించుకోండి అన్నాడు. ఆ తరువాత మరో రోజు అలమారా తెరిచినప్పుడు కుథ్ హూమీ గారి సందేశంతో పాటు అతికించిన ప్లేటు కూడా దొరికింది. ఈ సంఘటన భారతీయుల్నీ, యూరోపియన్లనీ చాలా ప్రభావితం చేసింది.

సూక్ష్మ జగత్తులో విహరించే మహాత్ములతో సంపర్కం ఏర్పర్చుకుని లోక కళ్యాణం చేసే ఆధ్యాత్మిక వ్యక్తులు చాలామంది ఉన్నారు. **లోకోద్ధరణ కోసం పాత్రత గల ఇటువంటి వ్యక్తులను సూక్ష్మశరీర ధారులు వెతుకుతూ ఉంటారు.** భవిష్యత్తులో ప్రతి వ్యక్తి తమ జీవితాలలో ఆధ్యాత్మికతను అవలంబించుకుని సహజంగానే సూక్ష్మజగత్తుతో సంపర్కం ఏర్పర్చుకునే సామర్థ్యాన్ని సంపాదించుకున్నా ఆశ్చర్యం లేదు.

*- అఖండజ్యోతి, డిసెంబరు 2001*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

**అనుమానం, అపనమ్మకం, పిరికితనం పరాజయానికి కారణాలు.**

పూజ్య గురుదేవుల అమృతవాణి



# యుగశిల్పులకు నాలుగు కార్యక్రమాలు

ఇది సామాన్యమైన సమయం కాదు. అసామాన్యమైన సమయం. ఇది యుగసంధి కాలం. ఇప్పుడు యుగం మారుతుంది. అంటే కొంత మార్పులు చేర్పులు జరగటం అవసరం అని మీకు తెలుసు. బిడ్డ జన్మించేటప్పుడు, కడుపులో నుండి బయటకు వచ్చేటప్పుడు ఎంతో బాధను అనుభవిస్తుంది. ఇప్పుడు పాతయుగం వెళ్ళిపోతోంది. నూతన యుగం వస్తోంది. ఈ సమయంలో రెండు పనులు జరుగుతాయి. ఒకటి నిర్మాణం. మరొకటి ధ్వంసం. పరివర్తన చెందే ఈ సమయంలో ధ్వంసం అయ్యేవి ఏమిటి?

సంధి కాలంలో నిర్మాణం, ధ్వంసం రెండూ ఒకదాని వెంట ఒకటి ఉంటాయి. ఒకటి నిర్మింపబడుతూ ఉంటుంది. ఒకటి ధ్వంసం అవుతూ ఉంటుంది. ఇల్లు నిర్మించేటప్పుడు పునాదులు తవ్వుతుంటారు. రెండోవైపు గోడలు కడుతుంటారు. ఒకవైపు పునాదులు త్రవ్వే పని ప్రారంభం అవుతుంది. రెండవవైపు వాని నిర్మాణం ప్రారంభం అవుతుంది. నిర్మాణం, త్రవ్వటం రెండు ఒకదానితో మరొకటి కలసి జరుగుతుంటాయి. బిడ్డ జన్మించేటప్పుడు మంత్రసాని అవసరం ఉంటుంది. నర్స్ అవసరం ఉంటుంది. ఇదే విధంగా పరివర్తనను ఎంతోమంది పర్యవేక్షించవలసిన అవసరం ఉంటుంది. మీకు తెలియదు. ప్రకృతికి కోపం వస్తే కొన్ని ప్రదేశాలలో వరదలు, మరికొన్ని ప్రదేశాలలో అతివృష్టి, కొన్ని ప్రదేశాలలో అనావృష్టి సంభవిస్తాయి. కొన్ని చోట్ల తుఫాను సంభవిస్తుంది. కొన్నిచోట్ల భూకంపం వస్తుంది. ఈ విధంగా ప్రకృతి తన కోపాన్ని మనపై చూపిస్తుంది. ఇప్పుడు వాతావరణం ఎలా అయిపోయిందంటే కొంతమంది పిల్లలు పుడుతున్నారు. వీరు జన్మతః కుసంస్కారులు. వీరు తల్లి మాట వినరు. ఉపాధ్యాయుల మాట వినరు. వీరు పెరిగి పెద్దయిన తరువాత ఇంకెలాంటి పాడు పనులు చేస్తారో తెలియదు. ఇదంతా చెడు వాతావరణం ప్రభావం.

దీని నుండి రక్షించటానికి, వాతావరణాన్ని పరిశుభ్ర పరచటానికి మేము ఒక పనిని ప్రారంభించాం. దీని బాధ్యత వహించాం. భగీరథుడు ఏ విధంగా తపస్సు చేశాడో మేము అదే విధంగా తపస్సు చేశాము. భగీరథుడు తపస్సు చేయుట వలన ఏం జరిగింది? స్వర్గంలో ఉండే గంగ భూలోకానికి వచ్చింది. గంగ నేలపై ప్రవహించటంతోనే నేలంతా పచ్చదనం సంతరించుకున్నది. వృక్షాలు జనించాయి. భగీరథుడు ఏ విధంగా తపస్సు చేశాడో అదే విధంగా నేను తపస్సు చేశాను.

ఒకానొక సమయంలో స్వర్గలోక ఆధిపత్యం కొరకు దేవతలను రాక్షసులు బాధించేవారు. దేవతలు బ్రహ్మ దగ్గరికి వెళ్ళారు. బ్రహ్మ "భూమిపై ధధీచి పేరుగల ఒక మహర్షి ఉన్నాడు. అతని అస్థికలతో ఇంద్రునికి వజ్రాయుధం తయారుచేయండి. దానితో రాక్షసులను ఓడించటం సులభమౌతుంది" అని చెప్పాడు. దేవతలు ఆ విధంగానే చేశారు. ధధీచి ఎంత గొప్పగా తపస్సు చేసేనంటే అతని ఎముకలతో తయారుచేసిన వజ్రాయుధంతో వృత్రాసురుని వంటి రాక్షసుని కూడా వధించవచ్చు. నేను కూడా అలాగే చేశాను. నేను రెండు సంవత్సరాలు మౌనవ్రతం పాటించాను. ఏకాంతంగా నివసించాను. ఈ విధంగా నా తపస్సు, ఏకాంత సేవ సాగాయి.

ఇదంతా నా బాధ్యత. మరి మీ బాధ్యత ఏమిటి? మీరు కూడ కొంచెం చేయాలి. మీరు చేయకపోతే ఎలా? రాణి ఈగ పిల్లల కొరకు తేనెతుట్టను ఏర్పాటు చేస్తుంది. ఒంటరిగా చేస్తుందా? మిగతా ఈగలు తిరిగి తిరిగి అక్కడక్కడా ఉన్న పూల నుండి మకరందాన్ని తీసుకుని వస్తాయి. సేనాపతి ఉంటాడు. అతను యుద్ధం చేస్తాడు. అయితే ఒంటరిగా చేస్తాడా? అతని వెంట సిపాయిలు ఉంటారు. లంకకు వెళ్ళేముందు వారధిని నిర్మించారు. రామలక్ష్మణులిరువురే నిర్మించారా? వారితో ఎలుగుబంటి, వానరాలు కూడా ఉన్నారు. మహాభారతంలో అర్జునుడు యుద్ధం చేశాడు. ఒంటరిగా చేశాడా? లేదు. అతనితో చాలామంది సహచరులు ఉన్నారు. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఒంటరిగా ఎత్తాడా? అతనితోపాటు అతని అనుచరులు ఉన్నారు. ధర్మ చక్ర ప్రవర్తనను బుద్ధుడు ఒంటరిగా చేశాడా? బౌద్ధ భిక్షువులు అతని వెంట ఉన్నారు. గాంధీజీ సత్యాగ్రహాన్ని చేసి స్వరాజ్యాన్ని సంపాదించారు. అయితే ఆయన వెంట కొన్ని వేలమంది ఉన్నారు.

ఇదే విధంగా నా తపశ్చర్య కొనసాగుతోంది. అయితే ఇది ఒంటరిగా కొనసాగుతుందా? నా కుటుంబ సభ్యుల, సోదరుల, నా అల్లుళ్ళ, నా పిల్లల, నా పూర్వీకుల, అన్ని వయస్సుల కల సభ్యుల సహకారంతో ఈ పని జరగాలి. ఇది నా 75వ సంవత్సరం. ఈ సంవత్సరం నేను నా కార్యకర్తలకు కొన్ని పనులు అప్పగించాలి అనుకుంటున్నాను. ఏయే పనులు అప్పగించాలి?

**మనుష్యులకున్న శక్తులలో అన్నింటికంటే గొప్ప శక్తి మానసిక శక్తి.**

**మొదటి పని మేము నలందా విశ్వవిద్యాలయం వంటి, తక్షశిల విశ్వవిద్యాలయం వంటి సంస్థలు ఏర్పాటు చేయాలి అని అనుకుంటున్నాం.** ఇది చాలా పెద్ద పని. ఈ ప్రపంచంలో త్రాగటాన్ని నేర్పించేవాళ్ళు, వ్యభిచారాన్ని నేర్పించే వాళ్ళున్నారు. ఎవరూ మంచి పనులను నేర్పించరు. మంచి పనులను నేర్పించటానికి నాకు లక్షమంది కావాలి. గాంధీజీ వందమంది వ్యక్తులు ఉంటే నా పనులు జరుగుతాయి అని చెప్పేవారట. కానీ నాకు ఆ సంఖ్య సరిపోదు. ఎందుకంటే భారతదేశంలో 7 లక్షల గ్రామాలున్నాయి. ఒక్కొక్క వ్యక్తికి 7 గ్రామాలు ఇచ్చినప్పటికి, లక్షమంది కంటే తక్కువమంది ఉంటే సరిపోదు. లక్షమంది ప్రచారకులను నేను తయారుచేయదలిచాను. దీని కొరకు మీ పరిచయస్థులను, మిత్రులను, కుటుంబ సభ్యులను ఒక్కొక్కరిని శిక్షణ కొరకు పంపించండి. మేము ఒక నెలలో అంతా నేర్పించి వారిని సమర్థవంతులుగా తయారుచేస్తాం. సంగీతం ద్వారా నూతన యుగ సందేశాన్ని ఇవ్వగలిగేటట్లు వారిని తయారుచేస్తాం.

నా శిక్షణ వ్యాఖ్యాన ప్రధానమైనది కాదు. సంగీత ప్రధానమైనది. విషయాన్ని పాట రూపంలో చెప్తాం. మీరు ఒక పని చేయండి. చురుకైన వారిని, సమయదానం చేయగలిగిన వారని, సేవాభావం కలిగిన వారిని, నేర్చుకోవాలనే అభిలాష కల వారిని ఇక్కడకు పంపించండి. వృద్ధులను, రోగులను పంపిస్తే వారు ఏం నేర్చుకోగలరు? వాళ్ళు చదువలేరు. ఏమీ చూడలేరు. అటువంటి వ్యక్తులను ఏం చేసుకోగలము? మీరు ఇక్కడకు పంపించే చురుకైన వ్యక్తికి మీరు ఒక విన్నపం చేయాలి. అతడు ఇక్కడ నుండి వెళ్ళిన తరువాత ఒక విద్యాలయాన్ని ఏర్పరచాలి. అది ప్రచార విద్యాలయం కావాలి. అక్కడ సంగీతం నేర్పించాలి. ప్రవచనం ఇవ్వటం నేర్పించబడాలి. మేము మొదట నలందా విశ్వవిద్యాలయం, తక్షశిల విశ్వవిద్యాలయం పద్ధతిలో లక్షమంది ప్రచారకులను తయారుచేస్తాం. ఆ ప్రచారకుల ద్వారా ప్రతి వ్యక్తి తన కర్తవ్యం ఏమిటి? తనేం చేయాలి? అని ఆలోచించే వాతావరణాన్ని కల్పిస్తాం. ప్రజ్ఞా శిక్షణ విద్యాలయాల గురించి అఖండజ్యోతి సంపాదకీయాలలో వ్రాయబడి ఉన్నది. ఎన్నో చోట్ల చెప్పాను కూడా. మీ గ్రామంలో కూడా ఒక విద్యాలయం నిర్మించాలి. అక్కడ సంగీతంతో కూడిన ఒక బృందం ఉండాలి. ఒక వ్యక్తి మాత్రమే పాట పాడితే సరిపోదు. ఎంతో మంది వ్యక్తులు కలసి బృందంగా ఏర్పడి తమ ఆలోచన పాట ద్వారా విస్తరింప చేయాలి. ఇది మొదటి పని.

**రెండవ పని. రెండవ పనిగా లక్ష యజ్ఞాలు చేయాలని నేను నిశ్చయించుకున్నాను అవును లక్ష.** ఎలా? అమావాస్య, పౌర్ణమి, ఏకాదశి, ఆదివారం ఇలా ఏదో ఒక రోజు మీకు వీలయిన రోజు యజ్ఞం చేయాలని నిర్ణయించుకోండి. ఆ రోజు ఐదు కుండాలు తయారు చేయండి. హవనం చేయండి. హవనమును మేము ఎంతో సులువు చేశాం. ఎంతో ఖర్చవుతుంది. ఎందరో పండితులు వస్తారు. ఎంతో దక్షిణ తీసుకుంటారు. లేదు. ఎలాంటి దక్షిణా తీసుకోరు. మీరంతా కలసి మంత్రాలు ఉచ్చరించండి. కుండాలు ఏర్పరచవలసిన అవసరం కూడా లేదు. చతురస్రంగా ఉన్న వేదికను ఏర్పరచండి. ఇది 24 అంగుళముల పొడవు. 24 అంగుళముల వెడల్పు. 3 అంగుళముల ఎత్తు ఉండాలి. ఈ వేదికపై ముగ్గువేసి పూజాస్థలంగా తయారుచేసి హవనం చేయండి. హవన సామాగ్రి మీ దగ్గర లేనట్లయితే బెల్లం, నెయ్యి కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసి ఒక్కొక్క ఉండను హవనం చేస్తూ ఉండండి. దీని సుగంధం వలన వాతావరణం అంతా సుగంధ భరితం అవుతుంది. పవిత్రం అవుతుంది. ఎందుకంటే **బెల్లంలో, నేతిలో మనుషుల అనారోగ్యాన్ని తొలగించటానికి అవసరమైన గుణాలన్నీ ఉన్నాయి.** ఇవి హవన సామాగ్రిలో కూడా లభిస్తాయి. ధాన్యం, గోధుమలను హోమం చేయమని చెప్పలేదు. నువ్వులను వేయమని అనలేదు. బియ్యాన్ని వేయమని చెప్పలేదు. ధాన్యాన్ని వేయటాన్ని నేను పూర్తిగా వ్యతిరేకిస్తాను. ఈ వస్తువులను వేయవలసిన అవసరం లేదు.

దీనితోపాటు జన్మదినం కూడా జరపాలి. గాయత్రీపరివార్‌లో 24 లక్షల మంది ఉన్నారు. ఈ వ్యక్తులందరి జన్మదినం జరిపితే 24 లక్షల జన్మదినాలు జరుగుతాయి. యజ్ఞం అంటే నా ఉద్దేశ్యంలో ఆడంబరాలు, భారీ అట్టహాసాలు కాదు. పెద్ద పెద్ద సమూహాలు, వందల కొలదీ యజ్ఞ కుండాలు కానే కాదు. ఈ కాలంలో యజ్ఞం అంటే చాలా ఖర్చుతో కూడుకుని ఉన్నది. పెద్ద యజ్ఞంలో ఎంతో సామాగ్రి ఖర్చవుతుంది. ప్రజల వద్ద చందాలుగా వసూలు చేసిన ధనం దుర్వినియోగం అవుతుంది. దీనిని నేను పూర్తిగా వ్యతిరేకిస్తాను. కొంతమంది నా దగ్గరకు వచ్చారు. వచ్చి "మేము వంద కుండాల యజ్ఞాన్ని చేస్తాం" అన్నారు. మేము "ఒక్కసారే వద్దు" అని చెప్పాం. **ఐదు కుండాల కంటే ఎక్కువ చేయవద్దు.** మీరు ఐదు కుండాల యజ్ఞ వేదికను ఏర్పరచి, తక్కువ ఖర్చుతో హవనం బాగా చేయగలరు. ఈ ప్రకారం ఒక లక్ష హవనాలను ఈ సంవత్సరంలో తప్పకుండా పూర్తి చేస్తారు. ప్రపంచ చరిత్రలో లక్ష కుండాలలో హవనం చేయటం ఒక అద్భుతమైన విషయం. **దీనికి ఒక పద్ధతి ప్రతి ప్రదేశంలో నెలకు ఒకసారి ఐదు కుండాలతో హవనం చేయటం, అందరి జన్మదినాలు జరపటం. ఇందులో సంగీతం, ప్రవచనం, ప్రజ్ఞాపురాణం జరుగుతుంది.**

తండ్రి సిద్ధాంతాలనిస్తే - తల్లి వాత్సల్యాన్ని పంచుతుంది.

**మీకు ఇవ్వబడిన మూడవ పని వృక్షాలను నాటటం.** హవనం చేయటం, వృక్షాలను నాటటం దాదాపు రెండూ ఒకటే. వాతావరణంలో విషం ఎంతగా పేరుకుపోయిందో! గాలిలో, నీటిలో ఎంతో విషం చేరిపోతోంది. ప్రతి ప్రదేశంలో విషం ఉన్నది. ఈ విషానికి సమాధానం వృక్షాలను నాటటమే. లేదండీ! మా దగ్గర ఖాళీ ప్రదేశం లేదు, పొలం లేదు అంటారా? అప్పుడు మీరు మీ ఇంటిలోనే చిన్న తోటను నిర్మించండి. చిన్నచిన్న తులసి మొక్కలను నాటండి. శాంతికుంజ్‌లో మేము వనమూలికలతో ఎంత పెద్ద ఉద్యానవనాన్ని నిర్మించామో, దాని వలన ఎంతమంది లాభాన్ని పొందుతున్నారో మీరు చూడగలరు. మీరు కూడా ఇంట్లో వనమూలికలను తయారుచేసి ప్రజలకు ఇస్తే వారి అనారోగ్యాలను నివారించవచ్చు. వాని ఆకులతో హవన సామాగ్రిని కూడా తయారు చేయవచ్చు. మీరు ఒక వృక్షాన్ని నాటగలరు. ఎక్కడైనా నాటండి. మీ ఇల్లు కాని, గవర్నమెంటువారి స్థలంలో కాని, ఇరుగుపొరుగువారి ప్రదేశంలో కాని నాటండి. నాటి “దీనిని నేను నాటాను, కానీ కొన్నాళ్ళుపోతే ఇది మీ స్వంతమౌతుంది” అని చెప్పండి. **వాతావరణాన్ని పరిశుభ్ర పరచటం కోసం మేము వృక్షాలను ఎక్కువగా నాటాం. ఇదే మూడవ కార్యక్రమం.**

నాల్గవ కార్యక్రమం. ముందు నిర్మించిన శక్తి పీఠాలన్నీ చాలా పెద్దవి. వాటి నిర్మాణానికి లక్షల రూపాయలు ఖర్చయినవి. లక్షల రూపాయలు ఖర్చయినప్పటికి దానిని సరిపడిన పని జరగలేదు. ఇప్పుడు వాటి స్థానంలో మీరు అద్దెకు ఒక ఇల్లు తీసుకోండి. లేదా సత్రాలు ఖాళీగా ఉంటాయి. వానిలో మీరు రెండు గదులు అడగండి. ఎవరైనా పెద్దవాళ్ళ దగ్గరకు వెళ్ళి మీరు నాలుగు గంటలు మాకు ఈ గదులను ఇస్తే ఇందులో మేం పెద్దవాళ్ళకు, చిన్నవాళ్ళకు విద్యను బోధిస్తాం. ప్రజ్ఞా శిక్షణ కూడా జరుపుతాం, మాకు నాలుగు గంటలు ఇవ్వండి. మిగతా సమయాన్ని మీరు మీ పనుల కొరకు వినియోగించండి” అని చెప్పండి. అలా అయితే మీరు కోరుకున్న ఇల్లు మీకు లభ్యమవుతుంది. ఒకవేళ లభించనట్లయితే చిన్న పెంకుటిల్లు కాని, పూరిల్లు కాని నిర్మించండి. ఇందులో పాతిక నుండి ముప్పై మంది వరకు కూర్చొనగలుగుతారు.

**శక్తిపీఠాలకు నేను ఒక క్రొత్త రూపాన్ని ఇచ్చాను. ఈ శక్తిపీఠాలు 100 రూపాయలతో కూడా నిర్మించవచ్చు. ఇందులో మీరు గాయత్రీమాత ఫోటోను ఒకటి ఉంచండి. అందరూ దానికి నమస్కరించి, అక్కడ కూర్చుని గాయత్రీ మంత్రం జపిస్తే అదే శక్తిపీఠం అవుతుంది.**

ఇందులో శిక్షణ కార్యక్రమాలు జరుపబడాలి. అలా జరిగినట్లయితే మా జీవాత్మ ప్రసన్నమౌతుంది. శక్తిపీఠాలు నిర్మించాలన్న నా ఉద్దేశ్యం నెరవేరుతుంది. ఇది దేశం అభివృద్ధి చెందటానికి, ముందుకు వెళ్ళటానికి, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది. వ్యక్తి ఉన్నత సంస్కారాన్ని పొందటానికి మేము బీజాన్ని నాటుతాము. అది తరువాత వ్యక్తి నిర్మాణానికి, సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుంది. మన శక్తిపీఠం జన జాగృతికి కేంద్రం కావాలి. మేము మీకు నాలుగు కార్యక్రమాలను గురించి చెప్పాము. ఐదవ కార్యక్రమం కూడా చెప్తే ఈ రోజు ప్రవచనం అయిపోతుంది.

ఐదవ పని ఏమిటంటే **మీరు ఎప్పుడైనా హరిద్వార్ వచ్చినట్లయితే శాంతికుంజ్‌కు తప్పకుండా రండి.** శాంతికుంజ్‌లో మేము ఉంటామా? అవును, దాదాపుగా అంతే. యుగసంధి సమయం ఎంత వరకూ ఉంటే అంత వరకు మాతాజీ ప్రాణం, నా ప్రాణం మా తపశ్చర్యలతో పాటుగా వాతావరణంలో ఉంటాయి. ప్రపంచంలో ఎక్కడా జరగని సంఘటనలు శాంతికుంజ్‌లో జరుగుతాయి. మీరు ఇటువంటి పుణ్యక్షేత్రమును ఇంకెక్కడా చూడరు. దీనిని చూడటానికి మీరు మీ కుటుంబ సభ్యులతో పాటు రండి. శాంతికుంజ్ చాలా ఉపయోగకరమైన ప్రదేశం. వివాహం మొదలైన కార్యాల అనవసరపు ఖర్చు తగ్గించు కోవాలన్నది నా కోరిక. భారతదేశంలో పేదరికాన్ని అంతం చేయాలని నేను అనుకుంటున్నాను. పేదరికాన్ని అంతం చేయాలి అంటే మీ ఆదాయం పెరగాలి. ఆదాయం పెరగటానికి ఒక పద్ధతి ఖర్చును తగ్గించుకోవటం. భారతదేశంలో వివాహానికే ఎక్కువ ఖర్చు అవుతుంది. మీరు ఖర్చును తగ్గించుకోండి. మీ ఇండ్లలో ఇరుగు పొరుగువారు, బంధువులు మిమ్మల్ని హైరానా పెడితే శాంతికుంజ్ వచ్చేయండి. మీరు మీ అమ్మాయి, వరుడు, అతని తల్లితండ్రులతో ఇక్కడకు వచ్చేయండి. బండి ఖర్చులు మీకు అవుతాయి. కానీ శుభకార్యానికి ఎటువంటి ఖర్చులు కావు. ఎవరికీ దక్షిణ ఇవ్వనక్కరలేదు. అన్నీ ఇక్కడ ఎల్లప్పుడూ తయారుగా ఉంటాయి. మీ పిల్లలకు జుట్టు తీయించటానికి, అన్నప్రాశన చేయించటానికి, విద్యారంభ కార్యక్రమానికి ఇక్కడకు వచ్చేయండి.

మిత్రులారా! ఇది చాలా గొప్ప వాతావరణం కల ప్రదేశం. గంగాతీరం. హిమాలయాల సమీపం. సప్తఋషుల తపోభూమి ఇది. సాధనతో నిండి ఉన్న వాతావరణం. ఇక్కడ అఖండ దీపం స్థాపించబడింది. అఖండ జపం నిరంతరం జరుగుతూ ఉంటుంది. నిత్యం 9 కుండాలతో యజ్ఞం జరుగుతూ ఉంటుంది. ఇవన్నీ ఇక్కడ జరగటానికి కారణం ఈ స్థానం అటువంటిది. ఇక్కడ

**సద్గురువుకు మిమ్ముల మీరు అర్పించుకుంటే తరించిపోతారు.**

నివసించేవారు సహజంగా తపోశక్తితో నిండి ఉంటారు. **ఆధ్యాత్మికంగా శాంతికుంజ్ సాటిలేని ప్రదేశం. సప్తఋషులు తపోభూమి వద్ద గాయత్రీ పుణ్యక్షేత్రం నిర్మించబడింది. ఈ ప్రదేశంలో ఇప్పటికీ విశ్వామిత్రుని సంస్కారం, చేతన, నిండి ఉన్నాయి. శాంతికుంజ్‌లో నివసించేవారు, బయట నుండి వచ్చేవారు అందరూ ఎంతో సాధన చేసి ఆత్మబలాన్ని పొందుతారు.** అన్ని బలాల కంటే ఆత్మబలం ఎంతో ఉత్కృష్టమైనది. పరాక్రమం, తేజస్సు, వర్చస్సు దీనివలన లభిస్తాయి. ఈ వాతావరణంలో నివసించే వారికి భావానుభూతి సహజంగా వృద్ధి చెందుతుంది. ఇది ప్రత్యక్షంగా కనిపించే ఉపయోగం. పరోక్షంగా హిమాలయాలలో తపస్సు చేసిన సప్తఋషుల భావాలు ఇక్కడ ప్రసరిస్తూ ఉంటాయి. ఇక్కడి దైవశక్తి వలన ఇక్కడ నివసించేవారు ప్రేరణ పొందే అవకాశం లభిస్తుంది. కొద్ది సమయంలోనే ఎక్కువ పొందగలుగుతారు. శాంతికుంజ్‌లో జరిగే శిక్షణ దైవకృప వలన జరుగుతున్నదే.

స్నేహితులారా! జ్ఞానగంగ ఎక్కడ నుండి ప్రవహిస్తుందో ఆ గంగోత్రి క్షేత్రం ఇది. గోముఖం నుండి గంగ ప్రవహిస్తుంది. శాంతికుంజ్ నుండి నాలుగువైపులా జ్ఞానమనే ప్రకాశం వెలువడుతుంది. నలువైపులా గంగ ప్రవహిస్తుంది. నలుదిక్కులా సస్యశ్యామలం చేస్తుంది. ఇక్కడ నుండి మేము నాలుగువైపులా జనరేటర్‌వలె వెలుగును ప్రకాశింపచేస్తాం. ఇది ప్రకాశానికి కేంద్రం. ఇది సామాన్యమైనది కాదు. అసామాన్యమైనది. మీరు ఎన్నో పుణ్యక్షేత్రాలు చూసి ఉంటారు. కానీ శాంతికుంజ్‌కు రెండుసార్లు కంటే ఎక్కువసార్లు రావలసిన అవసరం లేదు. మీ పరిచయస్థులకు, మిత్రులకు ఒక్కసారి చెప్పండి. ఎప్పుడైనా హరిద్వార్ వస్తే శాంతికుంజ్‌కు కూడా రమ్మని. బ్రహ్మ వర్చసులో ఏమి జరుగుతాయి? వానిని చూడటానికి రండి, ప్రతివ్యక్తి, ప్రతిక్షణం మిషన్‌వలె పని చేయటాన్ని మీరు ఇక్కడ చూస్తారు. ఇక్కడ ఎవరూ మిమ్మల్ని చేయి చాపి మాకు భిక్ష వేయండి, మాకు దానం ఇవ్వండి, మాకు డబ్బులివ్వండి, మాకు దక్షిణ ఇవ్వండి అని అడగరు. ఇక్కడ మీకు సేవ మాత్రమే చేస్తారు. అందువలన మీరు శాంతికుంజ్‌కు రావాలన్న కోరిక ఉంటే హరిద్వార్ వచ్చినప్పుడు శాంతికుంజ్‌ను మరచిపోకండి.

మీకు తెలిసిన వారికి కూడా శాంతికుంజ్‌కు రావటం మరచిపోవద్దని చెప్పండి. శాంతికుంజ్ గురించి మీకు చెప్పాల్సినది ఇదే.

మరొక్కసారి మీరు ఏమేం చేయాలో వినండి. మొదటిది ఒక వ్యక్తిని, ఒక యుగశిల్పిని ఇక్కడకు పంపించాలి. అతడు ఇక్కడ ఒక నెల శిక్షణను పొందిన తరువాత అక్కడ శిక్షణను ఇవ్వగలిగి ఉండాలి. అతడు మీ ప్రదేశానికి అధ్యాపకుడు అవుతాడు. అప్పుడు మీకు నన్ను మళ్ళీ పిలవవలసిన అవసరం ఉండదు. అతని ద్వారానే మీరు మీ పనులన్నింటినీ చేసుకోవచ్చు. ప్రజ్ఞా శిక్షణ విద్యాలయాల లక్ష శాఖలు ఉండాలి. మీరు అక్కడ ఐదు కుండాలతో హవనం చేయటానికి ఏర్పాట్లు చేయండి. **ప్రతి వ్యక్తి యొక్క జన్మదిన సందర్భంలో యజ్ఞం చేయండి.**

స్నేహితులారా! మీకు నేను చెప్పే మరొక విషయం ఏమిటంటే మీరు చెట్లని నాటండి. ఎన్ని చెట్లు నాటగలిగితే అన్ని చెట్లు నాటండి. మీ పూర్వీకుల పేరు మీద చెట్లు నాటి పుణ్యాన్ని పెంపొందింపచేసుకోండి. మీరు ఆ చెట్లను పొలాలలో నాటండి. మీ ఇంటి ఆవరణలో నాటండి. మీరు ఇక్కడ ఉన్న బ్రహ్మవర్చస్సు పరిశోధనా సంస్థను చూసి ఇక్కడ ఎంత ఎక్కువ పరిశోధన జరుగుతోందో చూడండి. దేవాత్మ హిమాలయాల మందిరం ఎలా ఉన్నదో చూడండి. సాధకులు ఏం చేస్తున్నారో చూడండి.

మీరు నేను చెప్పిన ఈ నాలుగైదు అంశాల పట్ల శ్రద్ధ వహిస్తారని నేను ఆశిస్తాను. మీరు ఇవన్నీ చేసినట్లయితే, నేను మీకు మిత్రుడను అనుకోండి. నా చేతిలో చేయి కలిపి, నా అడుగులో అడుగువేసిన వారు నాకు సోదరుడు, నా కుటుంబీకుడు. ఇవన్నీ మీరు చేస్తారన్న నమ్మకం నాకున్నది.

★★★

## మౌనం మహిమ

*వ్యాసుడు మహాభారతాన్ని చెప్తుండగా గణేశుడు వ్రాస్తున్నాడు. చెప్తున్నంత వేగంగా వ్రాయడం కష్టం. కాని గణేశుడికి ఎటువంటి ఇబ్బంది, అవరోధం కలుగలేదు. వ్రాయడం పూర్తయిన తరువాత సూతుడు ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ – గణేశా! వ్యాసుడు చెప్తుకుంటూ పోతుంటే నీవు అర్థం చేసుకుని వ్రాయడం, వ్రాత ప్రతులను సమకూర్చు కోవడం వంటి అధిక శ్రమతో కూడిన పనులు ఎలా చేయగలిగావని ప్రశ్నిస్తాడు. దానికి గణేశుడు చిరునవ్వు నవ్వి, స్వామి! మౌనం వల్ల శక్తుల ఏకీకరణ జరుగుతుంది. అనంతమైన శక్తి ఉద్భవించి ఎలాంటి పని అయినా చేయడానికి వీలుకాకపోవడం అంటూ ఉండదు. పని పూర్తయ్యేంతవరకు సర్వకాల సర్వావస్థల యందు నేను పూర్తిగా మౌనంతో ఉంటాను. అందుకే అన్ని పనులు సమర్థవంతంగా చేయగలుగుతున్నానని బదులు పలుకుతాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**వాంఛాగ్రస్తుడు పలుమార్లు మరణిస్తాడు.**

నా వారితో నా మాట

# ప్రజ్ఞను ప్రఖరతరం చేయాలి

**బందవు గురుపద్ కంజ్ కృపా సింధు నరరూపహరి**
**మహామోహ తమ పుంజ్, జాసు వచన్ రవికర్ నికర్**

– *రామచరిత మానస్ 1/5*

పరమపూజ్య గురుదేవుల చరణకమలాలకు నమస్కరిస్తున్నాను, వారు కృపా సాగరులు, మానవ రూపంలో ఉన్న శ్రీహరి. వారి వచనాలు (వాక్కు, ఆలోచనలు) మహా మోహరూపంలో ఉన్న గాఢాంధకారాన్ని నశింపజేసే సూర్యకిరణ సమూహాలు.

పూజ్య గురుదేవులు మనకిచ్చిన జ్ఞానమే వారి పరిచయం, గుర్తింపు, ఆశీర్వాదం. **గురుదేవుల సాహిత్యమే వారి స్వరూపం.** వారిని పొందాలనుకునే వారు ఈ రూపంలోనే వారిని గుర్తించాలి, స్వీకరించాలి. అలా చేయలేని పక్షంలో నిరాశ తప్పదు. వారి సాన్నిధ్యం పొందడానికి వేరే మార్గమే లేదు. జ్ఞానం వల్లే సుఖం, సంపద, సమృద్ధి కలుగుతాయి. అజ్ఞానం వల్లనే దుఃఖం, ఆపద, విపత్తులు వస్తాయి. ఎవరికైనా కష్టాల నుండి, ఆపదల నుండి విముక్తిని కలిగించాలంటే అతనికి తగిన జ్ఞానాన్ని అందజేయాలి. తెలివితేటలను ఇయ్యాలి. అంతకు మించిన వేరే ఉపాయమేదీ లేదు.

ఈ సామాన్యమైన, సరళమైన మాటలు సాధారణంగా సులువుగా, సరిగ్గా అర్థం కావు. ఎలగోఅలా అసంబద్ధమైన పద్ధతుల్లో కష్టాలను, దుఃఖాలను తీర్చుకోవాలని చూస్తారు. చిత్ర విచిత్రమైన ఉపాయాలు చేస్తూంటారు. ఇలా చేయడం వల్ల సమయం, శ్రమ, సాధన అన్నీ ఎలాగైనా వృధా అవుతాయి, దాంతో పాటు పరాజయం పాలైనందుకు తల బాదుకోక తప్పదు, పశ్చాత్తాపపడక తప్పదు. గురుదేవులు మన మధ్య సశరీరంగా ఉన్న రోజుల్లోనే ఇలా ఆలోచించే వ్యక్తులు వారి దగ్గరకు వచ్చేవారు. వాళ్ళ కష్టాలు తొలగిపోవడానికి గురువుగారు వాడే వస్తువులను, వారి మట్టి కూజా, కళ్ళజోడు కవరు లాంటివి అడిగి తీసుకెళ్ళేవారు, లేదా గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకెళ్ళిపోయేవారు. గురుదేవులు వాడే వస్తువులకు వారి కష్టాలను రూపుమాపే శక్తి ఉంటుందని వారి నమ్మకం.

ఇటువంటి సన్నివేశాలకు చాలా సార్లు నవ్వుకున్నా, ఎన్నో సార్లు వ్యావహారిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చేది. ఒక రోజు మధ్యాహ్నం గురువుగారి దగ్గరకు ఒక వ్యక్తి వచ్చాడు. చూస్తే చాలా ఉన్నత పదవిలో ఉన్న పెద్దమనిషి లాగానే అనిపించాడు. కొద్దిసేపు కూర్చుని తన బాధలు, కష్టాలు చెప్పుకుని వెళ్ళిపోయాడు. తరువాత గురువుగారు టాయిలెట్‌కి వెళ్ళవలసి వచ్చి లేచి చూసుకుంటే చెప్పులు కనిపించలేదు. ఏమైపోయాయా అనుకున్నారు కాని తరువాత నవ్వుతూ, ''ఇందాక ఒకతనొచ్చాడుగా, అతనే తీసుకెళ్ళాడు, అతన్ని పైకి రమ్మనండి'' అన్నారు. కిందకెళ్ళి చూస్తే అతను ఎక్కువ దూరం వెళ్ళలేదు. అతన్ని గురువుగారు పిలుస్తున్నారని చెప్పారు.

ఈ మాట వినగానే అతనికి చమటలు పట్టాయి, కంగారు పడ్డాడు. తన పరిస్థితి ఏంటి అనేది తనకే అర్థం కాలేదు. కాని ఇక చేయడానికేముంది? గత్యంతరం లేక ఆ పిలిచిన వ్యక్తితో గురువుగారి దగ్గరు వెళ్ళాడు. గురువుగారు చాలా ప్రశాంతంగా, "నాయన! ఇక్కడ పెట్టిన చెప్పులు నువ్వు గానీ తీసావా" అన్నారు. అతను వెక్కి వెక్కి ఏడుస్తూ, నేను చాలా కష్టాల్లో ఉన్నాను గురువుగారు అంటూ తను దాచిన చెప్పుల జత బయటకు తీసాడు. గురువుగారు బదులిచ్చారు, " నాయన! నేను నీ కష్టాలన్నిటినీ తీరుస్తాను. చూస్తూంటే చదువుకున్న వాడిలాగా ఉన్నావు. నీకు తెలియదా, ఒక తపస్వి యొక్క తపస్సు, తపోశక్తి అతని సంకల్పంలో, ప్రార్థనల్లో నిహితమై ఉంటాయి. అతని ఆలోచనలు అతని తపస్సుతో రంగరించబడతాయి."

అతను శ్రద్ధగా గురువుగారి మాటలు వింటున్నాడు. నువ్వు ఏం చేస్తూంటావు నాయన అని గురువుగారు అడిగారు. అతను కేంద్ర ప్రభుత్వంలోని ఒక విభాగానికి డైరెక్టరు. ఇది విని గురువు గారు అతనికి హితవు చెప్పారు, "నాయన! నువ్వు నా దగ్గర నుండి ఏదైనా తీసుకెళ్ళాలనుకుంటే నా పుస్తకాలు తీసుకో. అవి చదువు, ఇతరులతో చదివించు. అలా చేయడం వల్ల నీ కష్టాలు తొలిగిపోవడంతో పాటు, ఇతరుల సమస్యలకు కూడా సమాధానాలు అందించిన వాడివి అవుతావు. **నా తపోశక్తి నా రచనల్లో, సాహిత్యంలో, ఆలోచనల్లో ఉన్నది."** గురువుగారి మాటలు విన్నాక, వారి స్నేహాన్ని, ప్రేమని రుచి చూసాక పోయిన అతని ఆత్మవిశ్వాసం తిరిగొచ్చింది. అతని కళ్ళల్లో, ముఖంలో ఒక ప్రత్యేకమైన తేజస్సు కనిపించింది. ప్రసన్నంగా, ఆనందంగా తిరిగి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాక గురువుగారు ఒక మాటన్నారు, "నాయన! జీవితంలోని 50% సమస్యలు మనిషి వ్యవహారంతో ముడిపడి ఉంటాయి. వ్యావహారిక సమన్వయ లోపం, మాట్లాడక పోవడం వల్ల వచ్చే బేధాల వల్ల జీవితం యొక్క సహజ స్థితి కొట్టుమిట్టాడుతుంది. మిగిలిన 40% **సమస్యలకు మూలం ఆలోచన, భావ కాలుష్యాలు.** ఆలోచనల్లో ద్వంద్వం, ఆత్మవిశ్వాస లేమి, భావనల్లో సంక్షోభం మొదలైనవి ఈ సమస్యలకు కారణం. మిగిలిన 10% సమస్యలు ప్రారబ్ధం వల్ల వచ్చినవి. పూర్వపు కర్మలు, చెడు సంస్కారాలతో సంబంధించినవి. ఈ తరహా సమస్యలు జీవితంలో పది పదిహేను సంవత్సరాలకి ఎప్పుడో

**తుప్పు ఇనుము నుండి ఉత్పన్నమై దానినే తిని వేస్తుంది.**

అప్పుడు ఒకసారి వస్తాయి. ఇటువంటి వాటి పరిష్కారం కోసం తపస్సు, ఆధ్యాత్మిక అనుష్ఠానం, మహాపురుషుల ఆశీర్వచనం తప్పక అవసరమవుతుంది. మొత్తానికి ఆహార విహారాలు, మాట తీరు, వ్యవహార శైలి, ఆలోచన పద్ధతి, ఆత్మవికాసం, ఈశ్వరునిపై విశ్వాసం మొదలైన వాటిని అవలంబించుకుని జీవితాన్ని ఆధ్యాత్మిక ధృక్పథంతో గడిపితే సమస్యలు వాటంతటవే తొలగిపోతాయి."

**"జీవితంలో వచ్చే పలు సమస్యల గురించి నేను తీవ్రంగా ఆలోచించాను, తరువాత వాటిని నా అనుభూతులతో ముంచి, నా తపస్సుతో పెనవేసుకున్నాను. ఇలా చేయడంలోని ఉద్దేశం ఒక్కటే, నేనుండగా నా పిల్లలు చింతించకూడదు. జీవిత సిద్ధాంతాలను సహజంగా అర్ధం చేసుకోవాలి, సమగ్రమైన జీవితమేంటో తెలుసుకుని, విజయవంతంగా బతకాలి. నేను భోజనం తయారు చేసి పెట్టేసాను. ఇక అది వడ్డించుకుని, తినడం, తినిపించడం మీ వంతు. మీరు ఇది కూడా చేయలేకపోతే, వండిన పంచభక్ష్య పరమాన్నాలున్నా మీరు ఆకలితో బాధపడితే, సరైన పోషణ లేక రోగాల బారిన పడితే, దానికి మీ బద్ధకమే కారణమవుతుంది.**

గురుదేవులు ఆనాడు చెప్పిన ఈ మాటలు నేటికీ ప్రామాణిక మైనవే. నిజానికి వాటి అవసరం ఇప్పుడే ఎక్కువ అని చెప్పుకోవాలి. జీవితంలోని ప్రతి క్షేత్రంలో మంచి ఆలోచనల అవసరం ఎక్కువగా ఉన్నది. కుటుంబాల్లో కలహాలు పెరుగుతున్నాయి. భార్య భర్తల మధ్య ఒత్తిడి, విడాకులు అనే మాటలు మామూలు పదాల్లా వినిపిస్తున్నాయి. కిశోరావస్థలో ఉన్న ఆడపిల్లలు, మగపిల్లలు అపరాధం, నిరాశల భారాన్ని మోస్తున్నారు. యువతరం దారి తప్పుతున్నట్టు కనిపిస్తోంది. ఇంట్లో పెద్దలు కుటుంబానికి, ఉద్యోగానికి మధ్య సమన్వయం కుదుర్చుకోలేక పోతున్నారు. ఇళ్ళల్లో ఉండే స్త్రీలు ఆరోగ్య సమస్యలతో పాటు ఎన్నో మానసిక రోగాలను కూడా భరిస్తున్నారు. ఇదే విధంగా పెద్ద పెద్ద ఆఫీసర్ల నుండి కార్మికుల వరకు, నాయకులు, నటులు అందరూ ఎక్కడో అక్కడ మానసిక ఝుంజాటాల్లో చిక్కుకుని ఉన్నారు.

వీరందరికీ సవ్యమైన దిశ చూపించాలి. వీరికి మార్గం, మార్గదర్శనం అవసరం. ఇదంతా చేయవలసిన బాధ్యత మనందరి పైనా ఉంది. గురువుగారి అవయవాలని చెప్పబడే మనమంతా ఈ బాధ్యతను వహించాలి. ఇదే క్షాత్రధర్మం, యుగ ధర్మం, మానవ ధర్మం. ఈ బాధ్యతే నెరవేర్చక తప్పదు. నేటి వరకు మన పాఠకులు, పరిజనులు అఖండజ్యోతి వంటి పత్రికలు తెప్పించుకుని, సత్సాహిత్యాన్ని తెప్పించుకుని అందరికీ పంచి చదివించారు. కాని ఇప్పుడు ఈ పని మునుపటి కంటే ఎక్కువ సమర్ధవంతంగా, సువ్యవస్థతతో చేయాల్సిన అవసరం వచ్చింది. పిల్లలకి, తల్లులకి, యువకులకి, అధికారులకి, కార్మికులకి వారి వారి సమస్యలను పరిష్కరించే పుస్తకాలను, ఆలోచనలను, పత్రాలను వ్యవస్థీకరించాలి.

ఆ తరువాత అప్పటి పరిస్థితిని బట్టి, వారి మానసిక స్థితిని బట్టి ఈ ఆలోచనలను చదివి, నేర్చుకుని, అవలంబించుకునేట్టుగా ప్రేరేపించాలి. ఫలానా పుస్తకమో, పత్రికో ఇచ్చి చదువు అంటే సరిపోదు. సమస్యల్లో మునిగి ఉన్నవారు, మనోరోగాలతో పీడింప బడ్డవారు అంత సహజంగా ప్రేరితులు కారు, మారరు. అందుకు తగిన కృషి చేయాలి, సమయాన్ని వెచ్చించాలి. అందుకు మన పరిజనులందరు అడపా తడపా జ్ఞాన గోష్ఠులు (సత్సంగాలు) ఏర్పాటు చేసుకోవాలి.


ఈ కార్యక్రమాన్ని బలపరచడానికి సామర్ధ్యం గల శక్తిపీఠాలు గ్రంధాలయాలను ఏర్పాటు చేయవచ్చు. గురుదేవులు గ్రంథాలయాలను దేవాలయాలతో పోల్చేవారు. శక్తిపీఠాలంటేనే ప్రతిష్ఠింపబడ్డ దేవాలయాలు. గ్రంధాలయాలు కూడా ఏర్పడితే వాటి విలువ ఇంకా పెరుగుతుంది. బుద్ధిజీవులు, చక్కటి అవగాహన కలిగినవారు, గురుదేవుల ఆలోచనలను బాగా అర్థం చేసుకున్నవారు వారి వీలుని బట్టి వర్క్‌షాప్‌లు, సెమినార్లు ఏర్పాటు చేయవచ్చు. ఇవే కాక పరిస్థితులను బట్టి ఇతర రకాల ఏర్పాట్లను కూడా అన్వేషించవచ్చు. సమస్యలను పరిష్కరించే మంచి ఆలోచనలు అందరికీ అందాలన్నదే లక్ష్యం.

గురుదేవులు అందించిన మంచి ఆలోచనలు, సత్సాహిత్యమే వారి జ్ఞాన శరీరం. వీలైనన్ని ఎక్కువ స్థలాల్లో, ఎక్కువ ఇళ్ళల్లో, ఎక్కువ మంది జీవితాల్లో దీన్ని అందించే ప్రయత్నం చేయాలి. అందుకు మన పాఠకులు, పరిజనులు కూడా వాటిని చదవాలి. వారి మానసిక సమస్యలు తొలిగిపోవడమే కాక ఇతరుల సమస్యలను తీర్చగల సామర్ధ్యం పొందుతారు. గురువుగారి జీవితంలో రెండే మహామంత్రాలుండేవి, అవి ప్రేమ, ప్రజ్ఞ అన్న విషయం గుర్తుంచుకోవాలి. ప్రేమ, ప్రజ్ఞల బీజ మంత్రాన్ని అర్థం చేసుకున్నవాడు, ప్రపంచంలో అర్ధం చేసుకోదగ్గ, అర్థం చేసుకోవలసిన అవసరమున్న ప్రతి దాన్ని అర్థం చేసుకుంటాడు అన్నారు గురుదేవులు.

"నన్ను ప్రేమించేవారు నా ప్రజ్ఞను అవలంబించుతారు, నా ప్రజ్ఞను స్వీకరించేవారికి ప్రేమను పంచే సామర్ధ్యం ఉండాలి." అన్నారు. వారు రచించిన సాహిత్యమంతటిలో ఈ రెండు తత్త్వాలే వ్యక్తపరిచారు. గురుపూర్ణిమ యొక్క మహాపర్వం నాడు మనలోని ప్రతి ఒక్కరు వారి అభివ్యక్తికి (expression) మాధ్యమంగా (Medium) తయారవ్వాలి. వారిని ఇళ్ళల్లో, హృదయాల్లో ప్రతిష్ఠించాలి. **నిజంగా మనలను ఆయన శిష్యులుగా భావించుకుంటే, మనతో పాటు ఇతరుల హృదయాల్లో కూడా వారి ప్రేమను నింపే ప్రయత్నంలో ఎటువంటి లోటు ఉండకూడదు. వారి ప్రజ్ఞ యొక్క ప్రఖరతతో మన, ఇతరుల మస్తిష్కాలను ప్రకాశింపచేయాలి. గురు పూర్ణిమనాడు ఇదే శిష్యులు గురువుకు చేసుకోదగ్గ భావపూర్వక సమర్పణ.**

*– అఖండజ్యోతి, జులై 2012*
*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

సాధానాత్మకమైన అనుశాసనాన్ని ఉల్లంఘిస్తే దుర్గతిపాలు అవుతారు.



ఆరోగ్యమే మహాభాగ్యం - 21

# హోమియో వైద్య సేవ

## హోమియోపతి వైద్య విధానం

**హోమియోపతి (Homeopathy)** ప్రపంచవ్యాప్తంగా **ప్రాచుర్యంలో ఉన్న వైద్య పద్ధతి.** ముఖ్యంగా భారతదేశంలో దీనికి లభిస్తున్న ప్రజాదరణ, తద్భూపేణా ప్రభుత్వాదరణ, ప్రపంచంలో మరెక్కడా లేదనటం అతిశయోక్తి కాదు. ఈ పద్ధతి దరిదాపు రెండు వందల ఏళ్ళబట్టీ వాడుకలో ఉన్నప్పటికి దీనికి శాస్త్రీయమైన పునాదులు లేవనే నింద ఒక చెరగని మచ్చలా ఉండిపోయింది. ఆధునిక శాస్త్రీయ దృక్పథంతో చూస్తే ఈ నిందారోపణ సబబయినదే అనిపిస్తుంది. కాని హోమియోపతి వైద్యం వల్ల వ్యాధి నయమైనవారు ముందుకు వచ్చి ఇచ్చే సాక్ష్యం సంగతి ఏమిటని ప్రతిసవాలు చేసేవారు ఉన్నారు.

**చరిత్ర:**

హోమియోపతి అన్నది **హోమోయిస్ (ఒకే రకమైన), పేథోస్ (బాధ, రోగ లక్షణం) అనే రెండు గ్రీకు మాటలని సంధించగా పుట్టిన మాట.** కనుక దీనిని తెలుగులో **సారూప్య లక్షణ వైద్యం అనొచ్చు. ఉష్ణం ఉష్ణేత శీతలే అన్నట్లు, వజ్రం వజ్రేన బిధ్యతే అన్నట్లు ఒక పదార్థం ఏ బాధని కలిగిస్తుందో ఆ బాధని నివారించటానికి అదే పదార్థాన్ని మందుగా వాడాలి అన్నది హోమియోపతి మూల సూత్రం. ఈ వైద్య పద్ధతిని, ఈ మాటని కనిపెట్టినది "శామ్యూల్ హానిమాన్ (Samuel Hahnemann; 1755-1843)"** అనే జర్మనీ దేశపు వైద్యుడు. ఈయన వైద్య కళాశాలకి వెళ్ళి అప్పటి వైద్యశాస్త్రం అధ్యయనం చేశాడు. ఆ రోజులలో వైద్యం అంటే నాటు వైద్యమే. రోగానికి కారణం మలినపు రక్తం అనే నమ్మకంతో రోగి రక్తనాళాలని కోసి రక్తం ఓడ్చేసేవారు. దేహనిర్మాణ శాస్త్రం (ఎనాటమీ), రోగ నిర్ణయ శాస్త్రం, రసాయన శాస్త్రం అప్పటికి ఇంకా బాగా పుంజుకోలేదు. కనుక అప్పటి వైద్య విధానాలలో హానిమాన్‌కి లోపాలు కనిపించటం సహజం. ఈ లోపాలని సవరించటానికి ఆయన ఒక కొత్త పద్ధతిని కనిపెట్టాడు. అదే హోమియోపతి. హోమియోపతి వాడుకలోకి వచ్చిన తరువాత హోమియోపతి భక్తులు ఇప్పుడు వాడుకలో ఉన్న "ఇంగ్లీషు వైద్యాన్ని" ఎల్లోపతి (Allopathy) అనటం మొదలు పెట్టారు. అంతేకాని ఇంగ్లీషు వైద్యులు ఎవ్వరు వారి వైద్యపద్ధతిని "ఎల్లోపతి" అని అనరు.

దరిదాపు రెండున్నర శతాబ్దాల క్రితం పుట్టిన ఈ పద్ధతి కాలక్రమేణా కొన్ని మార్పులు చెందింది. మొదట్లో హానిమాన్ ప్రవచించిన పద్ధతిని **సనాతన హోమియోపతి (classical homeopathy) అని, ఇప్పుడు వాడుకలో ఉన్న పద్ధతిని అధునాతన హోమియోపతి (modern homeopathy)** అని అందాం. కాని విచారణ చేసేది మూలసూత్రాలు, ఆక్షేపణలు. హోమియోపతి వైద్యానికి కొన్ని మూలసూత్రాలు ఉన్నాయి.

**మొదటి సూత్రం : మనం ఇచ్చే మందు రోగానికి, రోగ లక్షణాలని తగ్గించటానికి కాదు,** మనిషికి. ఒకే రోగం అందరి లోనూ ఒకే రకమైన లక్షణాలని చూపించదనేది సర్వులు గమనిస్తున్న విషయమే. ఇది పటిష్టమైన సూత్రమే అని మానసిక శాస్త్రంలో ప్రావీణ్యత ఉన్నవారు ఒప్పుకుంటున్నారు. ఈ సూత్రానికి "mind over matter" అని ఇంగ్లీషులో భాష్యం చెప్పొచ్చు. కనుక రోగి ఎన్ని లక్షణాలు ఏకరవు పెట్టినా వాటన్నిటికి ఒకే ఒక మూల కారణం ఉంటుందనేది వీరి సిద్ధాంతం. కనుక రోగి ఎన్ని లక్షణాలు ఏకరవు పెట్టినా వాటన్నిటికి ఒకే ఒక మందు (remedy) ఇస్తారు. సనాతన హోమియోపతిలో మందుల ఖాతాలో ఉన్న ఏ మందు రోగికి నప్పుతుందో ఎంపిక చెయ్యటం చాలా కష్టం. పది పుస్తకాలు చదివినంత మాత్రాన అబ్బే ప్రతిభ కాదు ఇది; అనుభవం ఉండాలి. అందుకనే హోమియోపతి వైద్యం అందరి చేతిలోను రాణించదు. అందుకనే కాబోలు, అధునాతనులు ఈ సూత్రాన్ని సమయాను కూలంగా విస్మరిస్తారు.

**రెండవ సూత్రం :** రోగికి ఏ మందు ఇవ్వాలనే ప్రశ్నకి సమాధానం చెబుతుంది ఈ సూత్రం. **ఆరోగ్యంగా ఉన్న ఒక వ్యక్తిచేత ఏదైనా మందు తినిపించినప్పుడు ఆ వ్యక్తి శరీరంలో ఏయే లక్షణాలు పొడచూపుతాయో ఆయా లక్షణాలు ప్రదర్శించిన రోగికి అదే పదార్థం మందుగా పనిచేస్తుంది.** ఈ సూత్రానికి "ఉష్ణం ఉష్ణేణ శీతలం" అని సంస్కృతంలో భాష్యం చెప్పొచ్చు. ఈ సిద్ధాంతాన్నే లేటిన్ భాషలో similia similibus curentur అంటారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి సింకోనా తింటే చలిజ్వరం లక్షణాలు కనిపించేయనుకుందాం. అప్పుడు చలిజ్వరంతో బాధ పడే రోగికి అతి చిన్న మోతాదులో సింకోనా ఇస్తే రోగ లక్షణాలు ఉపశమించి, క్రమేపీ రోగం నయమవుతుందని సనాతన హోమియోపతి చెప్తుంది. ఎల్లోపతి వైద్యంలో కూడా ఈ సూత్రం

ఖిక్షువు తనకు దానంగా ఇచ్చిన దాన్ని గురించి ఫిర్యాదు చేయరాదు.

ఉంది. టీకాల మందులు దీనికి ఒక ఉదాహరణ. ఏ రోగం బారి నుండి తప్పించుకోవాలంటే ఆ రోగం లక్షణాలని శరీరంలో పుట్టిస్తుంది. టీకాల మందు కలరా, మసూచికం (smallpox), పోలియో, టెటనస్, నిమోనియా, ఫ్లూ మొదలైన వాటికి ఎన్నింటికో "టీకాల మందులు (vaccinations) కనిపెట్టారు. పుప్పొడి (pollen) పడని వాళ్ళకి కూడా టీకాల మందులు ఉన్నాయి. మలేరియా వంటి వ్యాధులకి కూడా టీకాల మందుల కోసం వేట సాగుతోంది. కనుక ఈ సూత్రంలో లోపం లేదు. కాని ప్రాయోగికమైన విషయాలలో బేధాభిప్రాయాలు ఉన్నాయి. ఉదాహరణకి, టీకాలు వేయించుకున్న వ్యక్తి రక్తం పరీక్ష చేసి చూస్తే టీకాల వల్ల శరీరంలో వచ్చిన మార్పు (ప్రతికాయాలు (antibodies) కనిపించటం) ఏమిటో స్పష్టంగా కనిపిస్తుంది. అంటే టీకా మందు వల్ల శరీరం ఎలా స్పందిస్తుందో రక్తం పరీక్ష చేసి మనం రుజువు చూపించవచ్చు. హోమియోపతి మందు వేసుకున్న తరువాత శరీరంలోని రక్తంలో కాని, జీవకణాలలో కాని ఎటువంటి మార్పు వస్తుందో ఇంతవరకు ఎవ్వరూ ప్రమాణాత్మకంగా రుజువు చేసి చూపించలేకపోయారు.

**మూడవ సూత్రం : ఇచ్చే మందు అతి సూక్ష్మమైన మోతాదులో ఇవ్వాలి.** సాధారణంగా రోగి వేసుకొనే మూడు మాత్రలలో మందు ఒక పాలు ఉంటే పంచదార (కాకపోతే ఆల్కహాలు, కాకపోతే నీళ్ళు) 1,000,000,000,000 పాళ్ళు ఉంటుంది. ఇంత తక్కువ మోతాదులో ఉన్న మందు ఎలా పని చేస్తుందో, దాని వెనక ఉన్న తర్కం ఏమిటో ఇంతవరకు ఎవ్వరూ నిక్కచ్చిగా రుజువు చేసి నిర్ద్వందంగా చెప్పలేకపోయారు.

**తథాస్తు ప్రభావం :** ఇంగ్లీషులో ప్లసిబో (placebo) అనే మాట ఉంది. లేటిన్‌లో ఈ మాటకి "అలాగే సంతోషిస్తాను" అనే అర్థం ఉంది. అలాగే వైద్యశాస్త్రంలో "ఈ మందు గుణం చేస్తుంది" అని చెప్పి వైద్యుడు పంచదార మాత్రలు ఇచ్చినా కొందరిలో గుణం కనిపిస్తుంది. ఈ దృగ్విషయాన్ని (phenomenon) శాస్త్రీయ పద్ధతిలో అనేక కోణాల నుండి రుజువు చేశారు. ఈ సందర్భంలో ఔషధం లేని ఉత్త పంచదార మాత్రలని ప్లసీబో అంటారు. దీనిని తెలుగులో "తథాస్తు మందు" (placebo) అని, ఈ ప్రభావాన్ని తథాస్తు ప్రభావం (placebo effect) అనొచ్చు. ఎందుకంటే సంస్కృతంలో తథాస్తు అంటే "అలాగే జరుగుతుంది" అని అర్థం కనుక.

హోమియోపతి వాడకంలో కనిపించే గుణం కేవలం తథాస్తు ప్రభావమే అని ఆధునిక శాస్త్రీయ దృక్పథపు వాదన. తథాస్తు ప్రభావం వల్ల కనిపించే గుణం ఉత్త ఊహాజనితము కాదు, మనస్సు మనని మభ్యపెట్టటము కాదు. ఈ ప్రభావం వల్ల వ్యాధి నిజంగా నయం అవుతుంది. నమ్మకంతో తులసిదళంతో నూతి నీళ్ళు తాగినా కొందరిలో గుణం కనిపిస్తుంది. అలాగని నూతి నీళ్ళకి మహత్తు ఉందనడం శాస్త్రీయం అనిపించుకోదు. వచ్చిన చిక్కల్లా ఈ తథాస్తు ప్రభావం అందరిలో కనిపించదు. ఈ దృగ్విషయం (phenomenon) పరిపూర్ణంగా అర్థం అయినవానికి హోమియోపతి వైద్యం కూడా ఎలా పనిచేస్తున్నదో అర్థం అవటానికి అవకాశాలు ఉన్నాయి.

**ప్రజాదరణకి కారణాలు :** హోమియోపతి మందులు హోమియోపతి శాస్త్రీయత లేని ఒక బూటకపు వైద్య పద్ధతి అనే ఆక్షేపణ ఒకటి బహుళ ప్రచారంలో ఉన్నప్పటికి, హోమియోపతి పద్ధతికి ప్రజలలో, కొన్ని పరిధులలో, ఆదరణ ఉంది. ఉదాహరణకి బడుగుదేశాలలోను, బీదవారిలోను ఉన్న ఆదరణ సంపన్న దేశాలలోను, సంపన్నులలోను లేదు. సంపన్న దేశాలలో కూడా మిగిలిన దేశాలతో పోల్చి చూస్తే అమెరికాలో ఆదరణ చాలా తక్కువ. ఇదే విధంగా విద్యాగంధం తక్కువ ఉన్న వారిలో ఉన్న ఆదరణ విద్యావంతులలో లేదు. విద్యావంతులలో కూడా ఆధునిక శాస్త్రంతో పరిచయంలేని వారిలో ఉన్న ఆదరణ శాస్త్రం తెలిసిన వారిలో లేదు. ఏది ఏమయినప్పటికి, ఎన్ని ఆక్షేపణలు ఉన్నప్పటికి, హోమియోపతి వైద్యం రెండున్నర శతాబ్దాల కాలం నిలదొక్కు కోవటానికి కారణాలు లేకపోలేదు.

1. హోమియోపతి వైద్యం, మందులు (కనీసం భారతదేశంలో) బాగా చౌక ఇంగ్లీషు మందులతో పోల్చి చూసినా, ఆయుర్వేదం మందులతో పోల్చి చూసినా ఈ వైద్యం భారతదేశంలో చౌక. కనుక బీదవారికి అందుబాటులో ఉన్న పద్ధతి ఇది.
2. సరి అయిన మందు వేసుకుంటే గుణం కనిపిస్తుంది. త్వరగా కనిపిస్తుంది. చేసిన గుణం తాత్కాలికం కాకుండా శాశ్వతంగా ఉంటుంది.
3. హోమియోపతి మందులు హాని చెయ్యవు. ఒకవేళ సరిఅయిన మందు పడకపోతే గుణం కనిపించదు తప్ప, హాని ఉండదు.
4. హోమియోపతి మందులు ప్రకృతిలో దొరికే పదార్థాలతోటే తయారవుతాయి గాని కృత్రిమంగా సంధించబడ్డ రసాయనాలు కాదు.
5. హోమియోపతి మందులు బాహ్య లక్షణాలని అదుపులో పెట్టడానికి ప్రయత్నించవు. బయటకి కనిపించే లక్షణాలకి మూల హేతువు ఏదో దానిపై పనిచేస్తాయి. ఉదాహరణకి జ్వరం, దగ్గు మొదలైనవి బయటకి కనిపించే లక్షణాలు. ఈ

**ఆలోచించినది సవ్యంగా ఉంటే అది వెంటనే ఫలితాన్నిస్తుంది.**

లక్షణాలు పొడచూపగానే వాటిని వెంటనే అణచిపెట్టటానికి మందు వేసుకుంటే అసలు కారణం కప్పడిపోతుందని ఆధునిక వైద్యశాస్త్రం కూడా అంటుంది.

6. హోమియోపతి పూర్ణదృక్పథ (holistic) సిద్ధాంతం. అంటే రోగిని ఒక రోగాల పుట్టలా కాకుండా ఒక వ్యక్తిగా చూసి, రోగికి ప్రస్ఫుటంగా కనిపించే బాహ్యలక్షణాలతోపాటు, రోగి మానసిక స్థితిని, మూర్తిత్వ వ్యక్తిత్వాలని సమీక్షించి, రోగ లక్షణాలని కాకుండా రోగ కారణాలని దృష్టిలో పెట్టుకుని ఔషధ నిర్ణయం చెయ్యాలంటుంది.

**చిక్కులు :** జలతారు పోగుల మధ్య నల్లబట్ట ఉన్నట్లు, హోమియోపతి సిద్ధాంతాలు చెప్పటానికి, వినటానికి బాగానే ఉంటాయి కాని, వీటిని ఆచరణలో పెట్టటంలో కొన్ని చిక్కులు ఉన్నాయి. రోగితో కనీసం గంటయినా గడపకుండా రోగ నిర్ణయం చేసి ఔషధాన్ని ఎంపిక చెయ్యటం కష్టం. సరి అయిన ఔషధం ఎంపిక చెయ్యకపోతే గుణం కనిపించదు. హోమియోపతిలో తలనొప్పికి ఫలానా, జ్వరానికి ఫలానా అంటూ మందులు లేవు. తలనొప్పి ఎక్కడ వస్తున్నది, ఎప్పుడు వస్తున్నది, ఎప్పుడు ఉద్రేకం (aggravation) అవుతున్నది, ఎప్పుడు ఉపశమనం (amelioration) అవుతున్నది, రోగి మూర్తిత్వ వ్యక్తిత్వాలు ఏమిటి మొదలైన ప్రశ్నలకు ఇచ్చే సమాధానాలను బట్టీ మందు ఉంటుంది. కానీ ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు రాబట్టాలంటే సమయం పడుతుంది.


**సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా**

**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్.జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్,
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర, శాంతినగర్,
కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచు కోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*


**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**


## సుభాషితాలలో సుధారస బిందువులు-10


*(43వ పేజీ తరువాయి...)*


చంద్రుడు అనేక ఔషధాలకు నిలయం. అమృతానికి నిలయుడు. శివుని శిరస్సుపై వెలుగొందెడి ఆభరణం. శతభిషజులు (వైద్యుల) చే అనుసరించబడెడి మహోన్నతుడు. కానీ ప్రతి అమావాస్యకు (కృష్ణ పక్షంలో) క్షీణించే లోపాన్ని మాత్రం తప్పించుకొనలేదు. ఇది దైవలీల. విధి ఎంతటి బలమైనదో తెలిపే సత్యం ఇది.

***సృజతి తావదశేష గుణాకరం***
***పురుషరత్న మలంకరణం భువః ।***
***తదపితత్‌క్షణ భంగీకరోతి చే***
***దహహ కష్టమపండితతా విధేః ॥***

"పాపీచిరాయుః, సుకృతిః గతాయుః" అన్న ఆర్యోక్తి విధి లీలకు విచిత్ర అర్థాన్ని తెలుపుతోంది. ఎన్ని గుణగుణాలను కల్గి ఉన్నప్పటికీ దైవబలం లేని కారణంగా సజ్జనుడు అల్పాయుష్కుడు కావచ్చును. ఎన్ని దుర్గుణాలు ఉన్నా, లోకకంటకుడైనా దైవ వరాన్ని పొందిన దుష్ట రాక్షసులు చిరాయువులుగా చాలాకాలం జీవించడం కేవలం దైవబలానికి నిదర్శనం. మహామహులు ఆదిశంకరులు, శివాజి, వివేకానందుడు మొదలైన మహనీయులు చిన్న వయస్సులోనే దివంగతులు కావడం విధి లీల.

కావున దైవబలం కోసం ప్రయత్నిస్తూ, మంచి పనులు చేస్తూ మనుగడ కొనసాగించడమే మానవ ధర్మమని, భర్తృహరి బోధించాడు. ఆ 'కర్మ పద్ధతి' లోని సారాన్ని వచ్చే వ్యాసంలో తెలుసుకుందాం.


- సాధన నరసింహాచార్య

### లోహియా ఆదర్శవాదం

*సంపన్నుడు, విద్యావంతుడు, ప్రతిభాశాలి, సుందరుడు అయిన డాక్టరు రామ మనోహర్ లోహియాను వివాహ మాడాలని, ఇంటి అల్లుడిని చేసుకోవాలని అనేక మంది ఉత్సాహపడుతుండేవారు. ఆయన కుటుంబ సభ్యులు కూడా వివాహం చేసుకోమంటూ తీవ్రమైన ఒత్తిడి తెచ్చేవారు. కాని ఆయన మాతృభూమిని దాస్యశృంఖలాల నుండి బంధ విముక్తురాలిని చేసేంతవరకు సమయాన్ని, దృష్టిని ఇతర విషయాలపై మళ్ళించేది లేదని దృఢ నిశ్చయంతో పలికేవారు. ఆయన లక్ష్యం, ఆయన ఆదర్శం కేవలం ఆయనను ఉత్కృష్టుడిని చేయటమే కాక వేలాదిమందిని ప్రభావితం చేసింది.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

**దేవత్వం చెడులో కూడా మంచిని దర్శిస్తుంది.**



# సుభాషితాలలో సుధారస బిందువులు - 10

దైవబలం ఉంటే అపజయం ఉండదు. ఈ భావాన్నే 'కాలం కలసి రావాలి' అంటూ ఉంటారు. మానవశక్తి ఎంత గొప్పదైనా, దైవబలం తోడుగా ఉండాలి. విధి, దైవం అనేవి మన జీవితాలను ఎంతో ప్రభావితం చేస్తాయి. భర్తృహరి 'దైవపద్ధతి'లో ఇలా వివరించారు.

*నేతాయస్య బృహస్పతిః ప్రహరణం వజ్రం, సురాఃసైనికాః*
*స్వర్గోదుర్గ, మనుగ్రహః ఖలుహరే, రైరావణోవారణః*
*ఇత్యాశ్చర్య బలాన్వితోఽపి బలభిద్భగ్నః పరైః సజ్గరే*
*తద్వ్యక్తం ననుదైవమేవ శరణం ధిగ్ధివృధాపౌరుషమ్ ॥*

దేవలోకానికి అధిపతి అయిన ఇంద్రుడు ఎన్ని లౌకిక శక్తుల సహాయం ఉన్నా, దైవబలం లేని కారణంగా రాక్షసుల చేతిలో ఎన్నో పరాభవాలు పొందాడు. బృహస్పతి వంటి మహనీయుడు గురువు అయినప్పటికీ, అష్టదిగ్గజములకు అధిపతి అయిన ఐరావతము వాహనమైనప్పటికీ, శత్రుభేద్యమునకు అసాధ్యమైన స్వర్గమే కోట అయినప్పటికీ, విష్ణువు ఆశీస్సులు ఉన్నప్పటికీ, కేవలం దురదృష్టం తోడై ఉండడం వలన దైవబలం లేని కారణంగా ఎన్నో అపజయాలు పొందాడు. అందువలన వ్యక్తి బలంతోపాటు దైవబలం కూడా ఆవశ్యకం.

*భగ్నాశస్య కరండ పిండి తతనోర్మ్లానేంద్రియస్య క్షుధా*
*కృత్వాఽఖుర్వివవరం స్వయం నిపతితో నక్తం ముఖే భోగినః*
*తృప్తస్తత్పిశితేన సత్వరమసౌ తేనైవ యాతః పథా*
*స్వస్థాస్తిష్టత దైవమేవ హి పరంవృద్ధౌక్షయే కారణమ్ ॥*

ఒకపాము బుట్టలో బంధింపబడి, ఆహారము లేక, చిక్కి శల్యమై ఉండగా, దైవవశాత్తు ఒక ఎలుక ఆ బుట్టకు రంధ్రం చేసి, అందులో ఆహారం ఉందేమోనన్న ఆశతో బుట్టలోనికి వెళ్ళింది. అది పాముకు దైవవశాత్తు కలిగిన అదృష్టం. ఎందుకంటే ఎటువంటి శ్రమ లేకుండా, ఆహారం దానివద్దకే చేరడం, దానిని తిన్న పాము ఆ ఎలుక చేసిన రంధ్రం ద్వారా బయటకు వెళ్ళడం అనేది దైవబలం వల్ల పాముకు కలిగిన అవకాశం, కాబట్టి దైవబలం ఉంటే ఎవరికైనా అవకాశాలు వాటంతట అవే వచ్చి సహకరిస్తాయన్నది సత్యం. అందుకు మానవుల సత్ప్రవర్తన, సద్గుణాలు దైవానుగ్రహానికి తోడ్పడుతాయి.

*యథా కన్దుక పాతే నో త్పతత్యార్యః పతన్నపి ।*
*తథా త్యనార్యః పతతి మృత్పిండ పతనం యథా ॥*

విధివశాత్తు, పతన దశలో ఉన్నవానికి, దైవానుగ్రహంతోడైతే మళ్ళీ తిరిగి ఉన్నత స్థితిని పొందుతాడు. అదే దైవానుగ్రహంలేని దురదృష్టవంతుడు అదే స్థితిలో జీవితాంతం ఉండిపోతాడు. అందుకే మనం వీలైనన్ని మంచి పనులు చేస్తూ, దైవానుగ్రహాన్ని సంపాదిస్తే, ఆ దైవబలం వల్ల జీవితంలోని ఆటుపోట్లను సులువుగా ఎదుర్కొనేశక్తివంతులు అవుతారు. బంతిని క్రిందికి విసిరినప్పటికీ, అది అంతేవేగంతో తిరిగి పైకి వస్తుంది. అందుకు దానిలో అంతర్గతంగా దాగి ఉన్న వాయువు అనే దైవశక్తి. అది బంతిని చైతన్యశక్తిలా పని చేయిస్తుంది. కానీ మట్టిముద్ద ఎటువంటి చైతన్యం లేకుండా (దైవబలం లేని కారణంగా) అది క్రిందకు కొట్టబడితే నేలకే అతుక్కుపోతుంది తప్ప మళ్ళీ తిరిగి పైకి రాలేదు. అందుకు కారణం కూడా దైవబలమే.

*శశిదివాకరయోః గ్రహపీడనం*
*గజభుజంగ విహంగ మబంధనం*
*మతిమతాంచ విలోక్య దరిద్రతాం*
*విధిరహో బలవానితి మే మతిః ॥*


విధి (దైవబలం) ఎంత బలీయమైనదంటే, ఎంతటి శక్తివంతుడైనా, దైవబలం లేకుంటే కష్టాలు తప్పవు అన్న జీవన సత్యాన్ని భర్తృహరి చక్కటి ఉదాహరణలతో ఇలా వివరించారు.

సూర్యుడు గ్రహాలకు అధిపతి, ప్రత్యక్ష పరమాత్మ అయినప్పటికీ, ప్రతి ఏటా సూర్యగ్రహణం అనివార్యం. అలాగే చంద్రగ్రహణం కూడా అప్రతిరోధం. (నిరోధించడానికి వీలు లేనిది) ఎందువలననగా అదీ కేవలం విధిలీల. దైవబలం తోడు లేకుంటే ఎంతటి వారికైనా ఇట్టి స్థితి తప్పదు. ఆకారంలో ఎంతో పెద్దది అయిన ఏనుగు, బంధించడానికి తావీయని సర్పాలు, ఎంతో ఎత్తున ఎగిరే పక్షులు కూడా దైవశక్తి లోపించినప్పుడు బంధించబడక తప్పదు. అందుకే "విధి ఎంతటి బలీయమైనది" అంటూ భర్తృహరి ప్రశ్నిస్తున్నారు. ఎంతో జ్ఞానం ఉన్నప్పటికీ, పాండిత్యం ఉన్నప్పటికీ, పండితులకు కూడా తప్పని బాధ దారిద్ర్యం. కావున దైవబలం ఉన్నంతవరకూ వీరిని ఏ దుష్టశక్తి ఏమీ చేయలేదు.

*అయమమృత నిధానం, నాయకోఽప్యోషధీనాం*
*శతభిషగనుయాతః, శంభు మూర్ధ్నోఽరతంశః ।*
*విరహయతిన చైనం రాజయక్ష్మా శశాంకం*
*హత విధి పరిపాకః కేనవా లంఘనీయః ॥*

*(...మిగిలినది 42వ పేజీలో చూడండి)*

**పాత్రత అభివృద్ధి చెందితే ప్రతిభ ప్రాప్తిస్తుంది.**



నిత్యస్మరణీయులు - 8

# సమైక్యతా స్థాపకుడు సర్దార్ పటేల్

కలిసి జీవిస్తూ, నిత్యం కలహించుకునే శత్రుత్వం కంటే, విడిపోయి కరచాలనం చేసుకునే మైత్రి గొప్పదన్న సత్యాన్ని నమ్మి, భారత్, పాకిస్తాన్‌లు విడిపోవడం తప్పదని గ్రహించి, "ఇద్దరం స్నేహితులుగా విడిపోదాము" అని చాటిచెప్పిన కర్మయోగి సర్దార్ పటేల్. భారత్ నుండి పాకిస్తాన్ విడిపోయిన తర్వాత, స్వతంత్ర సంస్థానాలుగా ఉన్న చిన్న రాజ్యాలను ఒకే ఛత్రం క్రిందకు తేవాలన్న లక్ష్యంతో తపించి, ఏకీకృతం చేసిన ప్రజాస్వామ్య ప్రేమికుడు మన పటేల్.

గుజరాత్ రాష్ట్రంలో, నడియాడ్ గ్రామంలో, జవేర్‌భాయ్, లాడ్‌బాయి దంపతులకు 31-10-1875వ తేదిన పటేల్ కుటుంబంలో వల్లభ్ జన్మించాడు. పటేల్‌కు సోమ, నర్సి, విఠల్, కాశీ అనే నలుగురు సోదరులు దహీ అనే సోదరితో కూడిన పెద్ద కుటుంబం. చిన్నతనం నుండి తండ్రికి పొలం పనులలో సహాయం చేస్తూ కాయకష్టాన్ని నమ్ముకుని, జీవితాన్ని తీర్చిదిద్దుకున్న కష్టజీవి. పేదరికం పట్ల మొండితనం, ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలు, నీతివర్తనం అనే లక్షణాలు అతనిలో చిన్నతనం నుండి పెరిగి పెద్దవి కాసాగాయి.

చిన్నతనంలో "చంద్రుడు కొన్ని రాత్రులు చిన్నగా ఎందుకు కనపబడతాడు"? అనే ప్రశ్నను ఎందరినో అడిగినా, సమాధానం దొరకలేదు. చివరకు ఉపాధ్యాయుడు కూడా సమాధానం చెప్పకుండా, అతని ధైర్యానికి కోపగించుకుని "నీ అంతట నువ్వే తెలుసుకో" అని కసిరికొట్టాడు. దాంతో పుస్తకాలను చదివి, లోకాన్ని పరిశీలించి, జ్ఞానాన్ని సంపాదించాలన్న నిర్ణయంతో చదువును కొనసాగించాడు.

హైస్కూల్ చదువు కోసం, మేనమామ ఇంట్లో ఉండి చదువుకునే రోజులలో ఒకనాడు నిత్యం ఆలస్యంగా వచ్చే ఉపాధ్యాయుణ్ణి మార్చే ఒక సంఘటన పటేల్ వ్యక్తిత్వానికి తార్కాణంగా నిలుస్తుంది.

రోజు ఉపాధ్యాయుడు తరగతికి ఆలస్యంగా వచ్చేవారు. పిల్లలంతా, ఆయన "ఇంకా రాలేదు కదా" అన్న భావనతో ఆటపాటలతో అల్లరి చేస్తున్నారు. కొంత సేపటికి వచ్చిన ఆయన కోపంతో అందరినీ తిట్టడం మొదలు పెట్టారు. వల్లభ్ లేచి "మీరు సరైన సమయంలో వచ్చి ఉంటే, మేం బుద్ధిగానే ఉండేవాళ్ళం కదా!" అన్నాడు. దాంతో మరింత ఆగ్రహంతో ఊగిపోయిన ఆయన, వల్లభ్‌ను ప్రధాన ఉపాధ్యాయుని వద్దకు తీసుకుని వెళ్ళి, వల్లభ్‌పై చర్య తీసుకోవలసినదిగా ఫిర్యాదు చేశాడు.

అప్పుడు ప్రధాన ఉపాధ్యాయుడు, వల్లభ్‌ను క్షమాపణ చెప్పమని ఆదేశించగా, వల్లభ్ ఆయనతో "అయ్యా! నేను పెద్దలను ధిక్కరించే వాడిని కాదు. క్షమాపణ చెప్పడానికి అభ్యంతరం లేదు. అయితే ఉపాధ్యాయుల వారు సరైన సమయంలో తరగతికి వస్తే, విద్యార్థులు అల్లరి చేసే అవకాశం ఉండదు కదా! అంతేగాక అధ్యాపకులే క్రమశిక్షణ పాటించక పోతే విద్యార్థులకు క్రమశిక్షణ ఎలా అలవడుతుంది?" అని ప్రశ్నించిన ధైర్యవంతుడు. అప్పటి నుండి ఆ ఉపాధ్యాయుడు కూడా ఆలస్యంగా రావడం మానివేసి క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచాడు. ఆ విధంగా పెద్దవారిని కూడా చక్కదిద్దే ధీమంతుడిగా ఎదిగాడు. ఇదే విధానం తనకన్నా ఆరు సంవత్సరాలు వయస్సులో పెద్ద అయిన గాంధీజీ విషయంలో కూడా ఎన్నో సార్లు ఆయన నిర్ణయాల మార్పుకు తోడ్పడింది.

మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణుడయ్యాక న్యాయవాద పరీక్షకు ఎంతో శ్రమతో, దీక్షతో చదవసాగాడు. అయితే ఒక రాచపుండు అతనిని తీవ్రంగా బాధించేది. ఎంతో ఓపికగా, భరించినప్పటికి అది వీలు పడలేదు. చివరకు నాటు వైద్యుని వద్దకు వెళ్ళి, చికిత్స చేయమన్నాడు. దానికి వాత ఒక్కటే మార్గమని అయితే భరించే వయస్సు వల్లభ్‌కు లేదని చెప్పగా, వెంటనే నిప్పులలో కాలుతున్న కడ్డీని తీసుకుని, తానే ఆ కురుపుపై ఉంచుకుని, ఆ బాధను దిగమింగి అద్భుత సహనాన్ని ప్రదర్శించాడు. ఎంతో కఠోర దీక్షతో, పట్టుదలతో జిల్లా న్యాయవాదుల పరీక్ష పాసయ్యి, అతని అన్న విఠల్‌తో కలిసి క్రిమినల్ కేసులు వాదించ సాగాడు. అయితే అతని చిరకాల వాంఛ లండన్ వెళ్ళి బారిష్టర్ చదవడం, అది ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. అయినా పట్టుబట్టి, తండ్రిపై ఆధారపడకుండా, తన సంపాదనతోనే లండన్ వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు.

*(మిగిలినది వచ్చే సంచికలో...)*

**పరిశ్రమలేని శక్తి వినాశనానికి కారణమవుతుంది.**

# శ్రావణ మాసం - శోభిత హాసం

శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రంతో పౌర్ణమి కూడి ఉండడం చేత ఈ మాసాన్ని శ్రావణ మాసం అని పిలుస్తారు.

శ్రీకృష్ణుడు, హయగ్రీవుడు, బదరీనారాయణ పెరుమాళ్, చూడికూడుత్తనాంచార్ వంటి పురాణ విశిష్ట వ్యక్తులు జన్మించిన శుభమాసం ఈ శ్రావణ మాసం. శ్రావణ శుద్ధ పంచమినాడే గరుత్మంతుడు అమృతభాండాన్ని సాధించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. ఆధునిక యోగి పుంగవులు శ్రీ అరవిందులు జన్మించిన మాసం కూడా ఈ మాసమే.

శ్రావణ మాసం భక్తి ప్రపత్తులతో ముక్తికి సాధనం. శ్రావణ మంగళవార నోములు, శుక్రవార వ్రతాలు, శనివార పూజలతో ఆధ్యాత్మిక పరిమళాలతో శోభిల్లే శుభమాసంగా పేర్కొనతగినది.

శ్రావణ మంగళవారం నూతన ముత్తయిదువలు మంగళ గౌరీ వ్రతాన్ని ఆచరించి, తమ కుటుంబానికి మంగళం కలగాలని, అన్ని అమంగళాలు తొలగిపోవాలని కోరుతూ తరిస్తారు.

శ్రావణ శుక్రవారాన్ని గురించి వేంకట పార్వతీశ్వర కవులు ఇలా వర్ణించారు.

**శ్రీల జెలువొందుటకు సువాసినులొనర్చు**
**శ్రావణీ శుక్రవార పూజలకునలరు**
**నమ్మహాలక్ష్మి శుభదృష్టినవతరించు**
**నమృత వీచికల శుభంబునార్చు ౕగాత**

వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి, పేరంటాలతో, పట్టు చీరలతో, క్రొత్త ఆభరణాలతో గృహిణులు కళకళలాడుతూ, తిరుగుతూ ఉంటే, ఆ ఇళ్ళు శుభానికి ప్రతీకలై, ఆనందానికి ఆరోగ్యానికి జ్ఞాపికలై, అనురాగపు దీపికలౌతారన్నది అక్షర సత్యం.

శ్రావణ పట్టీలు, శ్రావణ తగవులు పేరిట అత్తవారు కొత్త కోడళ్ళకు నగలు, వస్త్రాలు సమర్పించడం ఆనవాయితి. శ్రావణ శుద్ధ పంచమిని నాగపంచమిగా ఆచరిస్తారు. నాగపంచమినాడు దుక్కి దున్నడం చేయరాదు. ఈ విషయం తెలియని ఒక గౌడ బ్రాహ్మణుడు దుక్కి దున్నుతుండగా, ఒక కలుగులో ఉన్న నాగసర్ప పిల్లలు నాగలి ములుకుతాకి చనిపోయాయి. దీనికి ఆగ్రహించిన నాగిని, ఆ బ్రాహ్మణుని అతని కుటుంబ సభ్యులను కాటువేసి, వివాహిత అయిన అతని పెద్ద కుమార్తెను చంపటానికి ఆమె ఇంటికివెళ్ళగా, అక్కడ ఆమె, ఆ ఇంటి గోడలపై పసుపుతో వేసిన పాము చిత్రాన్ని, వాటికి చేసిన పూజలకు సంతృప్తి చెంది, ఆమెకు సహాయం చేయాలని నిశ్చయించి, అమృత బిందువులతో ఆమె తల్లి తండ్రులను తిరిగి బ్రతికించింది. ఈ వృత్తాంతాన్ని తెలుసుకొనిన ఆ గ్రామవాసులు నాగపంచమిని శ్రద్ధాభక్తులతో ఆచరించడం మొదలైంది.

దీనినే గరుడ పంచమిగా కొన్ని ప్రాంతాలవారు ఆచరిస్తారు. బ్రహ్మాండ పురాణం ప్రకారం గరుత్మంతుడు నాగపంచమినాడే అమృత భాండాన్ని సాధించి, తన తల్లికి దాస్యవిముక్తిని కల్పించిన రోజు. మాతృఋణం తీర్చుకున్న పుణ్యదినంగా ఆచరిస్తారు గరుత్మంతునికి వైనతేయుడు అని మరో పేరు కలదు. గోదావరికి గల ఏడుపాయలలో ఒకదానిపేరు వైనతేయ, వశిష్ట నది గోదావరి నుండి గన్నవరం అనే ఊరు వద్ద విడిపోతుంది. అక్కడే గరుత్మంతునికి ఆలయం ఉందని స్థల పురాణం తెలుపుతోంది.

పూర్వం ఒకనాడు గరుత్మంతుని తక్షకుని మధ్య యుద్ధం జరిగింది. దాని పర్యవసానంగా, ఇరువురి మధ్య రాజీ యత్నంగా నాగయంత్రాన్ని గరుత్మంతుడు ధరించెనని, గరుత్మంతునితోపాటు నాగ పూజలు జరుగుతాయని వంగదేశపు పురాణాలలో కథలు ఉన్నాయి.

శ్రావణ పౌర్ణమిని రాఖీపౌర్ణమిగా పేర్కొంటారు. దీనినే జంధ్యాల పౌర్ణమిగా ఆచరిస్తారు. సోదర సోదరీమణుల మధ్య అనుబంధానికి, విశ్వమానస సౌభ్రాతృత్వానికి చిహ్నం ఈ రాఖీ పౌర్ణమి. రక్షా బంధనం. కేవలం సోదరిపట్ల మాత్రమేగాక, స్త్రీ జన రక్షణ, దేశరక్షణ, భాషా సంస్కృతుల రక్షణ అనే ఆదర్శాలు ఈ రక్షాబంధన ఉత్సవంలో అంతర్లీనంగా దాగి ఉన్నది. స్వయం సేవకులు ఓంకార ధ్వజానికి ప్రణమిల్లుట సంస్కృత భాషాభిమానులు సంస్కృత మహోత్సవం పేరిట ఉత్సవాలు జరపడం పరిపాటి.

**యేనబద్ధో బలీరాజా, దానవేంద్రో మహాబలః**
**తే త్వామసి బధ్నామి రక్షే మాచల మాచల**
**స్వే స్వే కర్మణ్యభిరత్సం సిద్ధిం లభతేనరః ॥**

బలి చక్రవర్తి దానగుణమునకు కట్టుబడిన (విష్ణువు యొక్క పాద స్పర్శనంతో తరించి, చిరంజీవిగా ప్రతి ఏటా భక్తుల పూజలందుకున్న) రీతిలో నీ రక్షణకు నేను కట్టుబడి, జీవిత పరమార్థాన్ని పొందగలను అన్న భావనతో రక్షకు సార్థకతను కల్గించేదే శ్రావణ పౌర్ణమి.

ఉపనయనం జరిగిన యజ్ఞోపవీతాన్ని ధరించే వటువులు, నిత్యాగ్నిహోత్రులు కూడా ఈ పౌర్ణమి రోజునే నూతన యజ్ఞోప వీతాన్ని ధరించి, ధర్మరక్షణకై కృషి చేస్తానని ప్రతిన పూనుతారు.

హయగ్రీవుని జయంతిగా శ్రావణపౌర్ణమిని జరపడం వేద రక్షకుని కర్తవ్యం, మానవులు హయగ్రీవుని ఆశీస్సులతో వేద రక్షణను కర్తవ్యంగా భావించాలని బోధిస్తుంది. మధు కైటబులతో యుద్ధం చేసి, వారిని వధించి, వేదాలను తిరిగి బ్రహ్మచెంతకు చేర్చిన కథను స్మరించుకోవడం మన ధర్మం.

శ్రావణ బహుళ అష్టమిని శ్రీకృష్ణాష్టమిగా జరుపుకుంటాం. బాల్యం నుంచే రాక్షస సంహారం చేస్తూ, ధర్మ రక్షణకు కంకణ బద్ధుడైన శ్రీకృష్ణ జయంతి అందరికీ ఆదర్శప్రాయం. కృష్ణుని పాదాలను రంగవల్లులుగా తీర్చిదిద్ది, ఇరవై ఒకటి పిండివంటలతో బాలకృష్ణుని ఆహ్వానించడం, సాయంత్రం ఉట్టి సంబరంతో క్రీడాస్ఫూర్తిని కలిగిస్తూ, విజయం పొందడంలోని ఆనందాన్ని వివరించడం, శ్రీకృష్ణ చరిత్రలోని ఘట్టాలను వివరించే నృత్యాలు, నాటికలతో పండుగ వాతావరణాన్ని కలిగిస్తుంది. సహపంక్తి భోజనాలు, ఆనంద కోలాటాలతో సమసమాజ భావాలకు ప్రతీకగా పేరొందిన పండుగల సమాహారమే శ్రావణ మాసం. ధర్మనిష్ఠను, వ్రత నియమాలతో, ఆనంద సందేశాల హరివిల్లు ఈ శ్రావణం. అందుకే శ్రావణ మాసం ప్రకృతి శోభిత హాసం.

– సాధన నరసింహాచార్య

**యుగం అనేది చదువు వల్ల మారదు. మంచితనం వల్ల మారుతుంది.**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## విశాఖపట్నంలో

2012 జులై 7వ తేది విశాఖపట్నంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గాయత్రీ పరివార్ కార్యకర్తల సమ్మేళనం జరిగింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు.

పూజ్యులు డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు, గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు శ్రీ అశ్విని సుబ్బారావుగారు, శాంతికుంజ్ నుండి శ్రీ పరమానంద ద్వివేది, శ్రీ శర్మ గార్లు దీపప్రజ్వలన గావించి, వేదికనలంకరించి కార్యక్రమములను నిర్వహించారు. సభకు శ్రీ అశ్విని సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు. శ్రీ గాయత్రీ స్వామి ప్రత్యేక అతిథిగా సభకు విచ్చేశారు.

తొలుత సభను ప్రారంభిస్తూ, సమ్మేళన లక్ష్యాలను వివరిస్తూ పూజ్య గురుదేవుల లక్ష్యాలైన యుగపరివర్తన ద్వారా భూమిపై స్వర్గావతరణ గావించెడి లక్ష్యదిశగా ఈ 5 జిల్లాల్లో జరిగిన ప్రగతిని సమీక్షించుట జరిగింది. ప్రజ్ఞామండలులు / మహిళా మండలులు / యువ మండళ్ళు స్థాపించుటలో సాధించిన ప్రగతి, లోటుపాట్లు చర్చించి, ప్రగతి బాటలో పయనించవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. అటుపిమ్మట పూజ్య గురుదేవుల సాహిత్యాన్ని మరియు వారి వాణియైన అఖండజ్యోతి / యుగశక్తి గాయత్రిని ఇంటింటికి చేర్చుటలో సాధించిన ప్రగతిని సమీక్షించుట జరిగినది. సాహిత్యాన్ని వ్యాప్తి చేయుటలో వెనుక బడిన శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి చేపట్టవలసిన పనిగా గుర్తించుట జరిగినది.

పూజ్యులు డా॥ శ్రీరామకృష్ణ మాష్టారి లక్ష్యానికి, శాంతికుంజ్ నిర్దేశానుసారం యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారుల సంఖ్యను ప్రస్తుతమున్న 11000 నుంచి లక్షా ముప్పదివేలకు పెంచవలయునని సంకల్పము గైకొనుట జరిగినది. మాష్టారి ఆదేశాల మేరకు 500 వరకు పత్రికల చందాదారులను ఆగస్టు నుండి పెంచుటకు నిర్ణయించడమైనది.

**శ్రీ అశ్విని సుబ్బారావుగారి ప్రసంగం :** తమ ప్రేరణా ప్రసంగంలో పూజ్యులు డా॥ ప్రణవ్ పండ్యాగారి గాయత్రీ అనుష్టాన ప్రక్రియను వివరించిరి. గాయత్రీమాత సాక్షాత్కార లక్ష్యంతో డా॥ ప్రణవ్ పండ్యాగారు 40 దినముల గాయత్రీ మంత్రానుష్ఠానాన్ని ప్రారంభించుట జరిగినది. దీనికి పూజ్య గురుదేవులు 4 మార్లు మధ్యలో అవరోధం కల్పించిరి. దీనితో విసిగిన ప్రణవ్ జీ "ఎందుకు నన్నిలా బాధిస్తున్నారు? ఇప్పటికి 4 సార్లు నా గాయత్రీ మంత్ర అనుష్ఠాన పూర్తికి భంగం కల్గించారు" అని తన బాధను వ్యక్తీకరిస్తూ పూజ్య గురుదేవులను ప్రశ్నించారు. జవాబుగా గురుదేవులిట్లు బదులిచ్చిరి. "బేటా! దేని నిమిత్తమై ఈ అనుష్ఠాన సంకల్పాన్ని తీసికొన్నావు?" అని ప్రశ్నించగా, "గాయత్రీమాత సాక్షాత్కారాన్ని కోరుతూ" అని బదులిచ్చారు ప్రణవ్‌జీ. దీనికి గురుదేవులు నవ్వి" అయితే కూర్చొని కన్నులు మూసుకో! కుమారా!" అన్నారు. తదుపరి క్షణంలో "కన్నులు తెరువు" అన్నారు. తానే గాయత్రీమాతగా దర్శనమిచ్చారు. ప్రణవ్ ఈ రీతిగా పూజ్యగురుదేవులు "తనకు గాయత్రీమాతకు భేదము లేదని" ప్రణవ్‌కు తెలియజేస్తూ ఆ రహస్యాన్ని తెలియజెప్పారు. గురుదేవుల లక్ష్యానుసారం కార్యక్రమాలను నిర్వర్తించుట గాయత్రీమాతను సేవించుటే అని తెలిపారు. రెండవ అంశంగా, గురుదేవులను శ్రద్ధాభక్తులతో సంపూర్ణ సమర్పణా భావంతో సేవించెడివారి పనులను, ఆశలను, ఆకాంక్షలను గురుదేవులే నెరవేర్చెదరని, గుజరాత్‌లో జునాగడ్ నగరంలో ఒక పేద భక్తుడు, నిర్మించిన గాయత్రీ మందిర నిర్మాణ రహస్యాన్ని తెలిపారు. జునాగఢ్‌లో గాయత్రీ మందిర నిర్మాణ సంకల్పాన్ని ఒక చిరు హోటల్ యజమాని గురుదేవుల ముందు వ్యక్తం చేయగా, సుదూరంగా ఎక్కడో దక్షిణాఫ్రికాలోనున్న ఒక కోటేశ్వరుని ప్రేరేపించి మందిర నిర్మాణానికి వలసిన ధనాన్ని అందించేలా చేసి మందిర నిర్మాణం గావింపజేశారు.

మూడవ అంశంగా గాయత్రీ పరివార్ సక్రియ కార్యకర్త గురించి వివరిస్తూ ఇలా తెలిపారు.

**సమర్థక్ :** అప్పగించిన పనుల వరకు పూర్తిచేసి మిన్నకుంటాడు.

**సహయోగి :** అంశదానం లేక సమయదానమిచ్చి కొంత పరిమితి మేర సహకారమందించెడివాడు.

**కార్యకర్త :** సమజ్‌దారి, జుమ్మేదారి, ఇమాందారి మరియు బహదూరి లక్షణాలు కలిగి సమయదానమిచ్చెడివాడు కార్యకర్త.

సమాజ్‌దారి–వివేకవంతుడు; జుమ్మేదారి–బాధ్యత తీసికొనెడి వాడు; ఇమాందారి – విశ్వసనీయత కలిగినవాడు; బహదూరి – పోరాటపటిమ కల్గినవాడు.

**శ్రీ పరమానంద ద్వివేదిగారి ప్రసంగం :** గురుదేవులు

**ఆపదకాలంలోనే మన వారెవరో, పరాయి వారెవరో తెలుస్తుంది.**

మనల నుండి ఆశించెడి గుణకర్మ స్వభావాలపెంపు ద్వారా పాత్రతను పెంచుకొని సాధకుడు / పరివార్ ముందుకు సాగాలి. వ్యక్తిత్వ లోపం పరిష్కరింపబడనిచో అహంకార, లోభ, మోహ, స్వార్థాలు మనలను ఆక్రమిస్తాయి. దీనితో మనలోని కాలనేమి తొంగిచూచి మనల కాటు వేస్తాడు. కావున సద్భావనల పెంపొందించుకొనుట ప్రధానం. ఇది సత్కర్మలకు దారితీస్తుంది. తద్వారా లోక కళ్యాణం సిద్ధిస్తుంది.

**డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి ప్రసంగం:** మనమంతా పరస్పర సహకారంతో పనిచేయాలి. యుగశక్తి గాయత్రి రూపంలో పూజ్య గురుదేవులు మనకొక అస్త్రాన్ని అందించారు. అజ్ఞానమనెడి రాక్షసుని, యుగశక్తి గాయత్రి జ్ఞానరూపంలోనున్న అస్త్ర సహాయంతో సంహరించాలి. అప్పుడే మనం భూమిపై స్వర్గాన్ని స్థాపించగలం. దీనికై ఈ పత్రికను ఇంటింటికి చేర్చాలి. కావున దీని చందాదారుల సంఖ్యను లక్షకు పైగా పెంచాలి. మొదటి నా వాటాగా 20 పత్రికలకు చందా చెల్లించుచున్నానని ప్రకటించి, మిగిలిన వారితో 500 వరకు చేయించుట జరిగింది.

**శ్రీ గాయత్రి స్వామి వారి ప్రసంగం :** 90వ పడిలో కూడా తాను అత్యంత ఉత్సాహంతో ఉండుటకు కారణం గాయత్రి ఉపాసన, సాధన అని సెలవిచ్చారు. తన 7వ ఏట కాశీ పండితుని ద్వారా గాయత్రీ మంత్రోపదేశం లభించింది. పూజ్య గురుదేవుల సాహిత్యాన్ని పఠించుట ద్వారా "గురుదేవుల గాయత్రీ వివరణ నభూతో న భవిష్యత్" అన్న రీతిలో ఉన్నది అని ప్రకటించిరి. గురుదేవులు సాక్షాత్తు గాయత్రీమాత అవతారమని భావిస్తున్నట్లు ప్రకటించారు. పశుత్వ ఛాయలతో నిండిన మానవ మస్తిష్కాన్ని దైవత్వంతో నింపాలనెడిది పూజ్య గురుదేవుల సంకల్పమని ప్రకటించిరి. పెరటి ఔషధ మొక్క వైద్యానికి పనికిరాదేమోనన్నది నిజమని శ్రీరామశర్మగారిని ఈ పుణ్య భారతావనిలో ఆశించినంత రీతిలో ఆదరించలేదని ఆవేదనను వ్యక్తపరచారు.

అట్లే "ఉపాసన, సాధన, ఆరాధనలు" ఒక అద్భుత గ్రంథరాజం. శ్రద్ధ-విశ్వాసములను, విశ్వామిత్ర మహర్షి బల-అతిబల విద్యలకు ప్రతీకలని నేను నమ్ముచున్నానని చెప్పుచూ, భవిష్యత్తులో సద్బుద్ధికి ప్రతిరూపమైన గాయత్రిని ఇంటింటికి చేర్చెదనని పలుకుతూ సెలవు తీసికొనినారు.

శ్రీ చంద్రశేఖర్ జైన్, గాయత్రి పరివార్ ట్రస్టు విశాఖపట్నం సభ్యులు మాట్లాడుతూ, ప్రపంచ ప్రమాణాలు కలిగిన ఒక విద్యాలయాన్ని బాలబాలికల స్థాయి నుండి పరిశోధన స్థాయి వరకు ఆంధ్రరాష్ట్రంలో స్థాపించుటకు గాయత్రీ పరివార్ నడుం బిగించాలని పిలుపుతో ముగించిరి.

**54 కుండముల గాయత్రీ మహాయజ్ఞం :** 2012 జులై 8వ తేది ఆదివారం ఉదయం 9 గంటలకు 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. ఈ యజ్ఞమును శ్రీ చంద్రశేఖర్ జైన్, శ్రీ పూల్‌సింగ్ తదితరులు నిర్వహించారు. మాన్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు, శ్రీ అశ్విని సుబ్బారావుగారు, శ్రీ పరమానంద ద్వివేదిగారు ప్రవచించారు. శ్రీ అశ్విని సుబ్బారావుగారి ప్రసంగ ప్రేరణతో దాదాపు 20 వేల రూపాయల గురుదేవుల సాహిత్యం మరియు గాయత్రీ మంత్ర బాక్సులు పరిజనులు ఖరీదు చేశారు. ఈ యజ్ఞంలో 2000 మంది పాల్గొన్నారు.

## విజయనగరంలో

2012 జులై 10వ తేదిన విజయనగరం పట్టణ గాయత్రి పరివార్ కార్యకర్తల సమావేశం ఉదయం 10 గంటలకు గాయత్రీ ప్రజ్ఞామండలిలో (శ్రీ విశ్వేశ్వరరావు ఇంటిలో) శ్రీ పరమానంద ద్వివేది శాంతికుంజ్ హరిద్వార్‌గారి సారథ్యంలో నిర్వహించ బడింది. సుమారు 20 మంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీ పరమానంద ద్వివేదిగారు ఈవిధంగా సందేశాన్ని అందించారు.

పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యుల జన్మ శతాబ్ది పురస్కరించుకుని, యుగనిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈ క్రింది కార్యక్రమాలను క్షేత్ర దశలో విస్తృతంగా చేపట్ట వలసినదిగా కోరారు.

1. పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని ఇంటింటికి చేర్చుట, యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారుల సంఖ్యను అధిక సంఖ్యలో పెంచుట, చెట్లు నాటే కార్యక్రమాలను విస్తృతపరచుట.

2. సంస్కార విభాగంలో బాలసంస్కారశాలలు స్థాపించుట, అధిక సంఖ్యలో మహిళామండళ్ళను, ప్రజ్ఞామండలులను స్థాపించి, మరుగున పడిన సనాతన ధర్మానుసరణకు తిరిగి జీవం పోసి, దాని విలువను తెలియచెప్పుట. గాయత్రీ జపం, యజ్ఞం, దీప యజ్ఞాల ద్వారా పై కార్యక్రమాలను వ్యాప్తిగావించుట.

3. కార్యకర్తలు ఉత్సాహంతో ఈ క్రింది కాలనీల గ్రామాలను గాయత్రీ కాలనీలుగా, గాయత్రి గ్రామాలుగా చేయాలనే నిర్ణయం తీసుకున్నారు.

1) పూసపాటి రేగ 2) మెపటం 3) కోనాల 4) రెల్లివలస 5) కుమలి 6) గోవిందపురం 7) పినలేమలి 8) పెద వేమలి 9) జయతి 10) ముంగలాపల్లి 11) చొళ్ళంగి పేట 12) లక్కిదాం 13) అచ్యుతపేట 14) జోపేట 15) తెట్టమి 16) గుంక్లాం 17) జమ్ము నారాయణపురం 18) పెదతాడివాడ

**కాలనీలు :** 1) పి.బి.కాలని 2) దాసన్నపేట 3) బావామెట్ట 4) ప్రశాంతినగర్ 5) ప్రదీప్‌నగర్ 6) అలకానంద కాలని

చెడ్డవానితో స్నేహం, మన ఉనికికే ప్రమాదం.

7) బ్యాచ్ కాలని 8) సంతపేట 9) కృష్ణరాజాపురం 10) కస్ప 11) గాజులరేగ 12) రాజీవ్‌నగర్ కాలని

కార్యకర్తలలో ప్రముఖంగా శ్రీ కుసుమంచి సుబ్బారావు, శ్రీవిశ్వేశ్వరరావు, శ్రీ చలమయ్య, శ్రీమతి పద్మావతి, శ్రీమతి టి. పద్మావతి మున్నగు కార్యకర్తలు సంకల్పం తీసుకున్నారు.

## గుంటూరులో

గురుపూర్ణిమ సందర్భమున గుంటూరు, వేణుగోపాలనగర్ లోని సందీపని ఆశ్రమం (సప్తఋషి ఆశ్రమం) నందు జులై 3,4,5 తేదిలలో డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారి నేతృత్వంలో మూడు రోజుల సాధనా శిబిరం నిర్వహించబడింది. నూతనంగా నిర్మించిన ఆశ్రమ భవనమును గృహప్రవేశం జరిగింది. శ్రీ విశ్వనాథ్, విజయ దంపతులు ఈ కార్యక్రమానికి విశేషమైన ఏర్పాట్లు చేశారు.

## నారాకోడూరులో

03.07.2012 గురుపౌర్ణమి పర్వదినాన నారాకోడూరులోని గాయత్రీ శక్తిపీఠంనందు 9 కుండముల గాయత్రీ మహాయజ్ఞమును శ్రీ నేమాని లక్ష్మీ నరసింహమూర్తి దంపతులు నిర్వహించారు. సుమారు 200 మంది పరిజనులు పాల్గొన్నారు. యజ్ఞ కార్య క్రమములో పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది గురించి వివరించారు.

11.07.2012 శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేదిగారు గుంటూరు జిల్లాలోని నారాకోడూరులోని గాయత్రి శక్తి పీఠాన్ని సందర్శించారు. ప్రతిష్ఠించుటకు సిద్ధంగా ఉన్న సప్తఋషుల విగ్రహములను ప్రతిష్ఠించుటకు తమ సుముఖతను వ్యక్తం చేశారు. ఈ గాయత్రీ శక్తి పీఠమును కార్యకర్తల శిక్షణా కేంద్రంగా మరియు పరివార్ నిర్మాణ కేంద్రంగా తయారు చేయడానికి సంకల్పించారు. ప్రతినెల 1వ తేది నుండి 5వ తేది వరకు 5 రోజుల సాధనా శిబిరమును నిర్వహించుటకు నిర్ణయం తీసుకున్నారు.

## తిరుపతిలో గాయత్రి పరివార్ కార్యాలయం

2012 జులై 3వ తేది గురుపూర్ణిమ సందర్భమున గాయత్రీ పరివార్ తిరుపతి శాఖ కార్యాలయమును శ్రీమతి మునిలక్ష్మమ్మ గారి ఇంటిలో ప్రారంభించబడింది.

అడ్రస్ : ఇ.నెం. 7-53-52, వాసవినగర్, యం.ఆర్.పల్లి, జ్యోతి బేకరిపైన (మొదటి అంతస్తు), తిరుపతి - 517502.

తిరుపతి పట్టణంలోని ప్రముఖ వస్త్ర వ్యాపారి మరియు ఆర్యవైశ్య ప్రముఖులైన శ్రీ గోపీనాథ్, సుజాత దంపతులచే కార్యాలయం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో శ్రీమతి మునిలక్ష్మమ్మ, శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్, గేవర్‌లాల్, చంద్ర లాల్, తిరుపతి గాయత్రి పరివార్ మహిళామండలి సభ్యులు సుమారు 60 మంది పాల్గొన్నారు. మూడు కుండముల గాయత్రీ యజ్ఞం నిర్వహించబడింది.

## వేములవాడలో

03.07.2012 కరీంనగర్ జిల్లా వేములవాడలో గురుపౌర్ణమి శుభ సందర్భమున పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో డా॥ పులి సత్యన్నారాయణ గారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ అడ్డగట్ల సత్యహరి, సుగుణాకరరావు సహాయ సహకారాలను అందించారు. సుమారు 200 మంది పరిజనులు యజ్ఞ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. 500 రూపాయల గురుదేవుల సాహిత్యం విక్రయించడమైనది.

## దిల్‌సుఖ్‌నగర్‌లో

జులై 3,4 తారీఖుల్లో హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీరామకీర్తన ప్రజ్ఞాపీఠంలో గురుపౌర్ణిమ సంబరాలు వైభవంగా జరిగాయి. సుమారు నలభై మంది పరిజనులతో ఉదయం 7 గంటలకు గాయత్రి హవనం జరిగింది. గురుదేవుల అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ పరిజనులందరూ పరమపూజ్య గురువు గారి పాదపూజను నిర్వహించారు. పరిజనులందరూ భక్తి, శ్రద్ధలతో 108 ఆహుతులను సమర్పించారు. అదే రోజు శ్రీ హరిసింగ్ తార దంపతుల వివాహ దినోత్సవం కావడంతో వారు యజ్ఞశాలలో సంస్కారాన్ని జరుపుకుని విశేషమైన ఆశీస్సులను పొందారు. హవనం అనంతరం అందరూ గురుదేవుల వాణితో కలిసి గాయత్రీ మంత్ర జపం, గాయత్రీ చాలీసా పఠనం చేశారు.


## ప్రకటన

గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలంలోని నారాకోడూరు గాయత్రీ శక్తి పీఠమునందు 2012 అక్టోబరు 1వ తేది నుంచి 5వ తేది వరకు సాధనా శిబిరం నిర్వహించబడుతుంది. వయో పరిమితి 50 సంవత్సరములుగా నిర్ణయించడమైనది. శారీరకముగా, మానసికముగా, ఆరోగ్యముగా ఉన్న స్త్రీ,పురుషులు ఈ సాధనా కార్యక్రమంలో పాల్గొనుటకు తమ తమ దరఖాస్తులను ఈ క్రింది చిరునామాకు పంపవలసినదిగా కోరడమైనది. దరఖాస్తులలో మీ పేరు, చిరునామా, వయస్సు, విద్యార్హతలు, మీ టెలిఫోన్ నంబరు మొదలైన అన్ని వివరాలు ఇవ్వవలెను. ఎన్నిక కాబడిన వారికి ఆహ్వానపత్రం పంప బడుతుంది.

**గాయత్రీ చేతనా కేంద్రం**
**హెచ్.పి.రోడ్, అశ్విని హౌస్ దగ్గర, మూసాపేట,**
**హైదరాబాద్-500 018. ఫోన్: 040-23700722**


ఎవరికి ఏది అవసరమో దానిని ఇవ్వాలి.